శుక్రవారం 6-12-2019




సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 255




**'ధరా'ఘాతం!**

రెపో, రివర్స్ రెపో రేట్లు యథాతథంగా ఉంచిన ఆర్‌బీఐ -బిజినెస్‌లో



**మెరిసేదెవరో.. మెప్పించేదెవరో?**

నేడు హైదరాబాద్‌లో భారత్, విండీస్ మధ్య తొలి టి20 మ్యాచ్ -స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

# అర్ధరాత్రి 'విచారణ'



**బుధవారం అర్ధరాత్రి దాటాక ఘటనాస్థలికి నిందితులు**

**జస్టిస్ ఫర్ దిశ!**

- తొలుత తొండుపల్లికి.. ఆపై చటాన్‌పల్లికి తరలింపు
- లారీ నిలిపిన ప్రాంతం, ప్రాంతాల పరిశీలన
- దిశను ముందు చూసిందెవరు?
- అత్యాచారం చేయాలన్న ఆలోచన ఎవరికి వచ్చింది?
- మృతదేహాన్ని క్యాబిన్‌లోకి ఎలా తీసుకెళ్లారు..
- పెట్రోల్ ఎక్కడ కొనుగోలు చేశారు?
- జరిగిన ఉదంతాన్ని కళ్లకు కట్టిన దుండగులు
- తొండుపల్లి వద్ద పాతిపెట్టిన దిశ మొబైల్ స్వాధీనం
- అత్యంత రహస్యంగా సాగుతున్న దర్యాప్తు
- తమకు ఇంకా కస్టడీ ఆదేశాలు రాలేదంటున్న పోలీసులు

**50 మంది పోలీసులతో 7 ప్రత్యేక బృందాలు**

**కేసును స్వయంగా పర్యవేక్షిస్తున్న సీపీ సజ్జనార్**

సాక్షి, హైదరాబాద్/షాద్‌నగర్/శంషాబాద్

దేశవ్యాప్తంగా సంచలనం రేపిన దిశ కేసులో బుధవారం సాయంత్రం నుంచి అనేక నాటకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ కేసును పోలీసులు సవాలుగా తీసుకున్నారు. ఇప్పటికే పోలీసుల నిర్లక్ష్యం జరిగిందంటూ విమర్శలు రావడంతో నిందితులను షాద్‌నగర్ కోర్టు కస్టడీకి ఇచ్చిన విషయాన్ని లీక్ కాకుండా జాగ్రత్తపడ్డారు. ఈ విషయంలో షాద్‌నగర్ పోలీస్ స్టేషన్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్, డీజీపీ కార్యాలయాలు అత్యంత గోప్యత పాటిస్తున్నాయి. మీడియాలో వస్తున్న కథనాలు, ప్రచారంపై పోలీసులు ఎలాంటి వ్యాఖ్యలు చేయట్లేదు. నలుగురు నిందితుల కస్టడీపై తమకు కోర్టు నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు.

**మొబైల్‌ను తవ్వి తీయించారు**

అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో నిందితులు మహ్మద్ ఆరిఫ్, జొల్లు నవీన్, శివ, చెన్నకేశవులును చర్లపల్లి జైలు నుంచి రహస్యంగా పోలీసులు తరలించారు. తొలుత తొండుపల్లి టోల్‌గేట్ ప్రాంతంలో ఘటనాస్థలానికి బుధవారం అర్ధరాత్రి దాటాక నిందితులను తీసుకెళ్లారు. అక్కడ లారీ నిలిపిన స్థలం, మద్యం తాగిన ప్రాంతాలను పరిశీలించారు. దిశను ముందు చూసిందెవరు? అత్యాచారం ఆలోచన ముందు ఎవరికి వచ్చిందన్న తదితర వివరాలు తెలుసుకున్నారు. పంక్చర్ చేసిందెవరు? స్కూటీ బాగు చేయించేందుకు

మిగతా 2వ పేజీలో ▶

## ఆరని మంటలు

- అత్యాచార బాధితురాలి సజీవ దహనానికి యత్నం
- యూపీలోని ఉన్నావ్‌లో దారుణం
- మంటల్లో కాలిపోతూనే కిలోమీటర్ వరకు పరుగులు
- స్థానికుల సాయంతో పోలీసులకు ఫోన్
- 90% గాయాలతో ఆస్పత్రిలో మృత్యువుతో పోరాటం
- నిందితుల అరెస్టు.. వారిలో ఒకరు ఆమెను రేప్ చేసి అరెస్టయ్యి.. బెయిల్‌పై వచ్చిన వ్యక్తి

5లో

నిన్న హైదరాబాద్ ఉదంతం..
నేడు ఉన్నావ్ దారుణం..
నా రక్తం ఉడుకుతోంది.
అసలేం జరుగుతోంది..

- ట్విట్టర్‌లో ఓ మహిళ ఆవేశం




# ఉల్లి ఘాటు @ రూ. 170



**ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి ఉల్లి ధర**

- హైదరాబాద్‌లోని హోల్‌సేల్ మార్కెట్‌లో మొదటి రకం ఉల్లి కిలో ఏకంగా రూ. 145
- బహిరంగ మార్కెట్‌లో రూ. 160–170 పలుకుతున్న ధర
- మహారాష్ట్ర నుంచి సరఫరా తగ్గడం, వ్యాపారులు సిండికేట్ కావడం వల్లే..
- కోల్డ్ స్టోరేజీలు లేక పక్క రాష్ట్రాలపై ఆధారపడుతున్న రాష్ట్రం
- 13 కల్లా మనకు ఈజిప్ట్ ఉల్లి: అధికారులు
- ఉల్లి వంటకాలపై పడిన ప్రభావం.. ఉల్లి దోశ, పకోడీ బంద్!




**లోక్‌సభనూ తాకిన ఉల్లి ఘాటు** -5లో

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో 'ఉల్లి బాంబ్' పేలింది! గత కొంతకాలంగా సామాన్యులను బెంబేలెత్తిస్తూ ఎగబాకుతున్న ధర తాజాగా 'ఆల్‌టైం హై'ను తాకింది. ఇప్పటివరకు సెంచరీ మార్కుకు అటుఇటుగా పలికిన ధర గురువారం ఒక్కసారిగా ఆకాశాన్నంటింది. హైదరాబాద్‌లోని మలక్‌పేట మార్కెట్ చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా మొదటి రకం ఉల్లి హోల్‌సేల్‌లో క్వింటాలుకు ఏకంగా రూ. 14,500 పలికింది. అంటే హోల్‌సేల్‌లోనే కిలో రూ. 145కు చేరింది. ఈ పరిస్థితిని సొమ్ము చేసుకునేందుకు వ్యాపారులు మరింతగా రేట్లను పెంచడంతో రిటైల్ మార్కెట్‌లో ధర రూ. 160 నుంచి రూ. 170 మధ్య పలుకుతూ మధ్యతరగతి ప్రజలు ఉల్లి పేరెత్తాలంటేనే జంకేలా చేస్తోంది. రెండో రకం ఉల్లి కిలో రూ. 120, మూడో రకం ఉల్లి రూ. 80 పలుకుతుండగా నాసిరకం ఉల్లి సైతం రూ. 70 పలుకుతోంది. దీంతో కిలో నుంచి రెండు కిలోల వరకు ఉల్లి కొందామని మార్కెట్‌కు వెళ్తున్న వారు అరకిలోతో సరిపెట్టుకుంటున్నారు. గతేడాది ఇదే సీజన్‌లో ఉల్లి ధరలు రూ. 30 దాటలేదని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతుండటం గమనార్హం. ఈసారి దేశవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు పంట దెబ్బతినడం, పొరుగు రాష్ట్రాల నుంచి డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా లేకపోవడం, విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న ఉల్లి రాకకు మరింత సమయం పట్టే అవకాశం ఉండటంతో ధర ఇప్పట్లో దిగొచ్చే పరిస్థితి కనిపించట్లేదు. దీనికితోడు మహారాష్ట్ర వ్యాపారులతో స్థానిక వ్యాపారులు కుమ్మక్కు కావడం, నిల్వలపై నిఘా కొరవడడం మార్కెట్‌లో మరింతగా రేట్ల అగ్గిని రాజేస్తోంది.

**పొరుగున తగ్గిన సాగు వల్లే ఉల్లి ఘాటు...**

తెలంగాణలో ఉల్లిసాగు ఎక్కువగా లేకపోవడంతో పొరుగు రాష్ట్రాలపైనే రాష్ట్రం ఆధారపడుతోంది. ముఖ్యంగా మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రత్యేకించి మహారాష్ట్ర నుంచి వచ్చే దిగుమతులే రాష్ట్ర ప్రజల అవసరాలను తీరుస్తున్నాయి. దేశంలో 60–70 శాతం ఉల్లి దిగుబడికి మహారాష్ట్రే కేంద్రంకాగా అక్కడ ఈసారి సాగు

మిగతా 2వ పేజీలో ▶

## మోడల్ స్కూళ్లలో కెరీర్ గైడెన్స్ మొదలు

- విద్యార్థుల అభిరుచుల మేరకు ఆయా రంగాలపై ప్రోత్సాహం
- 194 స్కూళ్లలోని 18 వేల మందికి దిశానిర్దేశం
- ప్రభుత్వ స్కూళ్లల్లోనూ కెరీర్ గైడెన్స్
- త్వరలోనే 'మై చాయిస్.. మై ఫ్యూచర్' సర్వే

3లో








## ఉభయతారకంగా 'దుమ్ముగూడెం'

- 37 టీఎంసీలు నిల్వ ఉండేలా బ్యారేజీ.. 320 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసేలా ప్లాంటు నిర్మాణం
- నెలాఖరులోగా టెండర్లు పిలవాలని సీఎం కేసీఆర్ ఆదేశం
- కాళేశ్వరం నుంచి మిడ్‌మానేరుకు మూడో టీఎంసీ తరలించే పనులకూ టెండర్లు
- కాళేశ్వరం నుంచి సాగర్ ఆయకట్టుకు నీటి తరలింపునకు ప్రణాళిక.. సాగునీటి ప్రాజెక్టులపై సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాలు

సాక్షి, హైదరాబాద్: అటు జల విద్యుదుత్పత్తికి, ఇటు గోదావరి నీటి నిల్వకు ఉపయోగపడేలా దుమ్ముగూడెం వద్ద బ్యారేజీ నిర్మించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. దుమ్ముగూడెం వద్ద గోదావరిలో 150 రోజులపాటు పుష్కలమైన నీటి ప్రవాహం ఉంటుంది. ఈ నేపథ్యంలో అక్కడ 37 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా బ్యారేజీ, 320 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసేలా ప్లాంటు నిర్మించాలని సీఎం నిర్ణయం తీసుకున్నారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మిడ్‌మానేరుకు మూడో టీఎంసీ నీటిని లిఫ్టు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ రెండు పనులకు సంబంధించి వెంటనే అంచనాలు రూపొందించి నెలాఖరులోగా టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని నీటి పారుదల ప్రాజెక్టులపై ప్రగతి భవన్‌లో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. నదిలోనే నీళ్లు ఆగేలా వీలైనంత తక్కువ భూసేకరణతో దుమ్ముగూడెం బ్యారేజీకి డిజైన్ చేయాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. మల్లన్నసాగర్‌కు

మిగతా 2వ పేజీలో ▶

## కరోడ్ కీ 'రాణి'

- ఐఎంఎస్ స్కాం నిందితురాలు దేవికారాణి, బంధువుల ఇళ్లపై ఏసీబీ దాడులు
- హైదరాబాద్, తిరుపతి, కడపల్లో సోదాలు
- ఆమె భర్త గురుమూర్తిని అరెస్టు చేసిన ఏసీబీ
- కుటుంబసభ్యుల పేరిట భారీగా ఆస్తుల కొనుగోలు
- ఐఏఎస్ అధికారి పాత్రపైనా త్వరలో విచారణ?

- వివరాలు 3లో

## రాష్ట్రంలో ఈసారి చలి తక్కువే!

**హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా**

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది చలి ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేశారు. డిసెంబర్, జనవరి నెలల్లో తెలంగాణలో పలు చోట్ల రాత్రిపూట 10 సెంటీగ్రేడ్‌ల కన్నా తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యేవి. ఈసారి కనిష్ట ఉష్ణోగ్రత 15 డిగ్రీలకు తక్కువ ఉండే అవకాశం లేదని చెబుతున్నారు. ఆదిలాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం 10 డిగ్రీలు నమోదయ్యే అవకాశముంది. గతంలోలాగా 4 లేదా 5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు లేవని చెబుతున్నారు. ఈ సీజన్‌లో రాత్రి, పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదు అవుతున్నాయని పేర్కొంటున్నారు. వాతావరణ మార్పుల కారణంగానే సీజన్లలో గణనీయమైన తేడా కనిపిస్తుందని, ఏడాదిగా పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.







## క్లుప్తంగా...

### జీఎస్టీ రిటర్నుల దాఖలు గడువు పెంపు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని జీఎస్టీ డీలర్లు తమ రిటర్నుల దాఖలు గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.1.5 కోట్ల వరకు టర్నోవర్ కలిగిన వ్యాపారులు మూడు నెలలకోసారి దాఖలు చేసే జీఎస్టీఆర్–1 గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2019 అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికానికి గాను 2020 జనవరి 31 లోపు, 2020 జనవరి–మార్చి త్రైమాసికానికి గాను 2020 ఏప్రిల్ 30లోపు రిటర్నులు దాఖలు చేయవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### నేడు కేజీబీవీల్లో అంతర్‌జిల్లా బదిలీలు

**సాక్షి, హైదరాబాద్:** కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తూ అంతర్‌జిల్లా బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీఆర్‌లు, సీఆర్‌టీలు, ఏఎన్‌ఎంలు, పీఈటీలకు శుక్రవారం వెబ్ అలాట్‌మెంట్ ఇవ్వనున్నారు. బదిలీ అయినవారు ఈ నెల 7న ప్రస్తుత స్థానాల నుంచి రిలీవ్ అయి, కొత్త స్థానాల్లో చేరాలని పాఠశాల విద్య కమిషనర్ తెలిపారు. వివరాలకు https://samagrashiksha.telangana.gov.inను సంప్రదించాలన్నారు.

### 13న ఏఏఓ గ్రేడ్‌–2 పరీక్ష

**సాక్షి, హైదరాబాద్:** అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్స్ గ్రేడ్–2 ఉద్యోగానికి సంబంధించి అర్హత పరీక్షను సీబీఆర్‌టీ పద్ధతిలో ఈనెల 13న నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. వివరాలకు కమిషన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

### 14 నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

**సాక్షి, హైదరాబాద్:** డిపార్ట్‌మెంటల్ పరీక్షల తేదీలు ఖరారయ్యాయి. ఈనెల 14 నుంచి 23వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) పద్ధతిలో జరిగే ఈ పరీక్షల హాల్‌టికెట్లను ఈనెల 7వ తేదీన టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని కమిషన్ తెలిపింది. వివరాలకు 040–22445566 నంబర్‌ను సంప్రదించాలని సూచించింది.

### హజ్ దరఖాస్తు గడువు పెంపు

**సాక్షి, హైదరాబాద్:** 2020 హజ్ యాత్ర దరఖాస్తు స్వీకరణ గడువును కేంద్ర హజ్ కమిటీ డిసెంబర్ 17 వరకు పొడిగించిందని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మసీవుల్లా ఖాన్ తెలిపారు. గురువారం నాంపల్లి హజ్‌హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర హజ్ కమిటీ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర హజ్ కమిటీ దరఖాస్తుల స్వీకరణ గడువును పెంచిందన్నారు. యాత్రికుల సౌకర్యార్థం నాంపల్లి హజ్‌హౌస్‌లోనే ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని చెప్పారు.

### కేంద్ర మంత్రి పీయూష్‌తో ఎంపీ అరవింద్ భేటీ

**సాక్షి, న్యూఢిల్లీ:** రాష్ట్రంలోని పసుపు రైతుల సమస్యలను ఎంపీ ధర్మపురి అరవింద్.. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఢిల్లీలో వాణిజ్య శాఖ ఉన్నతాధికారులతో పీయూష్ జరిపిన భేటీలో అరవింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు ఆవశ్యకతపై అరవింద్ వివరించారు. కాగా, త్వరలోనే పసుపు రైతుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. పసుపు బోర్డు ఏర్పాటు సమావేశం ప్రాధాన్యత కారణంగా ఎంపీ అరవింద్ తన నానమ్మ అంత్యక్రియలకు కూడా హాజరుకాలేదని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

### 1.4 కిలోల అక్రమ బంగారం స్వాధీనం

**శంషాబాద్:** బంగారాన్ని మలద్వారంలో దాచుకొని అక్రమంగా తరలించేందుకు యత్నించిన ముగ్గురిని డీఆర్‌ఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ముంబై ఎయిర్‌పోర్టు నుంచి ఏఐ–50 విమానంలో బుధవారం రాత్రి ముగ్గురు ప్రయాణికులు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ముందస్తు సమాచారంతో అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఆ ముగ్గురి వద్ద బంగారం ఉన్నట్లు తేలింది. శస్త్ర చికిత్స ద్వారా వారి దగ్గరున్న బంగారు గుళికలను బయటికి తీశారు. 1,420 గ్రాముల పేస్టులో ఉన్న ఈ బంగారాన్ని సాధారణ స్థితికి తీసుకొచ్చే సరికి 1,235 గ్రాములుగా మారింది. దీని విలువ రూ. 48,49,062గా ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ముంబై విమానాశ్రయంలో ఓ వ్యక్తి సాయం తో తాము బంగారాన్ని క్యారియర్లుగా తీసుకొచ్చినట్లు నిందితులు విచారణలో తెలిపారు.

### ‘మీ సెల్ఫీని బహుమతిగా పంపండి’

**సాక్షి, హైదరాబాద్:** గ్రీన్ ఇండియా చాలెంజ్ పేరుతో రాష్ట్రం మొదలుకొని జాతీయస్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన టీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు, ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ మరో వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈనెల 7వ తేదీన తన జన్మదినం సందర్భంగా మొక్కలు నాటుతూ దిగిన సెల్ఫీలను ఆయనకు బహుమతిగా పంపాలని సంతోష్‌కుమార్ కోరారు.

# ‘గ్రేటర్’ ట్రాఫిక్ కమిషనరేట్

## ట్రాఫిక్‌ను ‘దారి’లో పెట్టేందుకు కొత్త వ్యవస్థ

- ప్రజా రవాణా రంగం మెరుగుకు చర్యలు
- అంతర్జాతీయ ప్రమాణాలతో రోడ్ల అభివృద్ధి
- జీహెచ్‌ఎంసీ, పోలీస్ ఉన్నతాధికారుల సమావేశంలో మంత్రి కేటీఆర్



గురువారం హైదరాబాద్‌లో జీహెచ్‌ఎంసీ, పోలీసులు ఇతర ఉన్నతాధికారులతో సమావేశమైన మంత్రి కేటీఆర్. చిత్రంలో మేయర్ బొంతు రామ్మోహన్

**సాక్షి, హైదరాబాద్:** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహా నగరంలో వాహనాలతో పాటు పాదచారులు సౌకర్యవంతంగా ప్రయాణించేలా రోడ్లను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతామని మునిసిపల్, ఐటీ శాఖల మంత్రి కె.తారక రామారావు చెప్పారు. ట్రాఫిక్ వ్యవస్థను శాస్త్రీయంగా క్రమబద్ధీకరిస్తామని, దీని సమన్వయానికి జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రత్యేక ట్రాఫిక్ కమిషనరేట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గురువారం బుద్ధభవన్‌లో జీహెచ్‌ఎంసీ, పోలీసు, విద్యుత్, టీఎస్‌ఐఐసీ, జలమండలి ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. మంత్రి మాట్లాడుతూ, నగర ప్రజలను ప్రజా రవాణా వైపు మళ్లించేలా ఆ వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. వాణిజ్య ప్రాంతాల్లోని సెట్‌బ్యాక్‌ల స్థలాన్ని ఫుట్‌వేలకు వినియోగించనున్నట్లు తెలిపారు. ముంబైలో ప్రజా రవాణా వినియోగం 72 శాతం కాగా, ఇది హైదరాబాద్‌లో 34 శాతమేనన్నారు. ఐదేళ్లలో వాహనాల సంఖ్య 73 లక్షల నుంచి కోటీ ఇరవై లక్షలకు పెరిగిందన్నారు.

**ప్రజా రవాణా పెంపే లక్ష్యం**

మెట్రోరైలు, ఎంఎంటీఎస్ వ్యవస్థల అభివృద్ధితో పాటు ప్రధాన మార్గాల్లో లేనింగ్‌లు, ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, సైకిల్ మార్గాలు ఏర్పాటు చేస్తామని, పచ్చదనాన్ని పెంచుతామని కేటీఆర్ చెప్పారు. ఖాళీ స్థలాలను పార్కింగ్ ప్రదేశాలుగా మార్చేందుకు ప్రైవేట్ యజమానులను ఒప్పించాలని, తద్వారా ఆదాయం పొందొచ్చనే విషయాన్ని వారికి తెలపాలన్నారు. లేఔట్ల ఓపెన్ ప్రదేశాల్లో ప్రజల సదుపాయార్థం పబ్లిక్ టాయ్‌లెట్లు, పార్కులు, బస్‌షెల్టర్లు, స్కైవాక్ వేలు ఏర్పాటు చేస్తామన్నారు.

**ఆ రోడ్ల బాధ్యత ప్రైవేట్ ఏజెన్సీలదే**

సమగ్ర రోడ్ల నిర్వహణ పథకం (సీఆర్‌ఎంపీ) కింద 709 కి.మీ. మేర ప్రధాన రోడ్ల నిర్వహణను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించామని, ఈనెల 9 నుంచి ఏజెన్సీలు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్లను మంత్రి కేటీఆర్ ఆదేశించారు. ఐదేళ్ల వరకు ఆ రోడ్ల నిర్వహణ బాధ్యత కాంట్రాక్ట్ ఏజెన్సీలదేనని, పైప్‌లైన్లు, కేబుళ్లు, డ్రైనేజీ తవ్వకాలు, మరమ్మతులు, పునరుద్ధరణ పనులన్నీ ఏజెన్సీలే చేపట్టాలన్నారు.

**డయల్ ‘100’కు విస్తృత ప్రచారం**

మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని మంత్రి కేటీఆర్ అధికారులకు సూచించారు. టోల్ ఫ్రీ నంబర్ 100కు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. వైన్స్ పరిసరాల్లో మద్యం తాగే వారిపై చర్యలు తీసుకోవాలని, సంబంధిత దుకాణాలను మూసివేయించాలని సూచించారు. పార్కులు, ఖాళీ స్థలాలు అసాంఘిక శక్తులకు అడ్డాలుగా మారరాదన్నారు. డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ, రోడ్లు, రవాణా సదుపాయాలు బాగుంటే ట్రాఫిక్ సమస్యలుండవన్నారు. ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ ఆధునీకరణకు నిధులివ్వాలని కోరారు. నగర మేయర్ బొంతు రామ్మోహన్, మునిసిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అర్వింద్‌కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఉభయతారకంగా ‘దుమ్ముగూడెం’

▶ మొదటి పేజీ తరువాయి

రెండో టీఎంసీ నీటిని తరలించే పనులకు, సీతారామ ప్రాజెక్టులో మిగిలిన పనులకు కూడా వెంటనే టెండర్లు పిలవాలని పేర్కొన్నారు. కంతనపల్లి బ్యారేజీ పనులను వచ్చే మార్చి చివరి నాటికి పూర్తి చేయాలని స్పష్టంచేశారు.

**మేజర్, మీడియం తేడాలొద్దు...**

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మిడ్‌మానేరుకు ప్రస్తుతం రెండు టీఎంసీల నీటిని పంపు చేస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి రోజుకు మూడు టీఎంసీల నీటిని లిఫ్టు చేయాలని సీఎం నిర్ణయించారు. మిడ్‌మానేరుకు మూడు టీఎంసీలు లిఫ్ట్ చేసి, అక్కడి నుంచి మల్లన్నసాగర్‌కు రెండు టీఎంసీలు లిఫ్ట్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. దుమ్ముగూడెం బ్యారేజీ, మిడ్‌మానేరుకు మూడు టీఎంసీల నీటిని లిఫ్టు చేసే పనులకు రూ.13,500 కోట్ల నుంచి రూ.14,000 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. తదుపరి మంత్రి వర్గ సమావేశంలో ఈ రెండు పనులకు ఆమోదం తీసుకోవాలని సీఎం నిర్ణయించారు. మేజర్, మీడియం, మైనర్ అనే తేడా లేకుండా రాష్ట్రంలో నీటి పారుదలశాఖ అంతా ఒకటే విభాగంగా పని చేయాలని కేసీఆర్ ఆదేశించారు. రాష్ట్రాన్ని ఆరేడు ఇరిగేషన్ జోన్లుగా విభజించుకోవాలని, ఒక్కో జోన్‌కు ఒక్కో ఈఎన్‌సీ ఇన్‌చార్జిగా వ్యవహరించి, తన పరిధిలోని నీటి పారుదల వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షించాలని సూచించారు. నీటి పారుదలశాఖ ముఖ్య అధికారులంతా త్వరలో రాష్ట్ర స్థాయి వర్క్ షాపు నిర్వహించుకుని, తెలంగాణ సమగ్ర నీటి పారుదల విధానాన్ని ఖరారు చేయాలన్నారు. అన్ని ప్రాజెక్టులు, పంపు హౌజులు, లిఫ్టులు, కాల్వలు, చెరువుల నిర్వహణకు అవసరమైన వ్యూహాన్ని, మ్యాన్యువల్స్‌ను ఆ వర్కుషాపులోనే రూపొందించాలని స్పష్టంచేశారు.

**అవసరమైన నిధులు బడ్జెట్లోనే కేటాయింపు...**

సాగునీటి వ్యవస్థను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన నిధులను బడ్జెట్లోనే కేటాయించనున్నట్లు సీఎం వెల్లడించారు. దుమ్ముగూడెం వద్ద జల విద్యుత్ కేంద్రాన్ని నిర్మించడానికి, కాళేశ్వరం నుంచి మూడు టీఎంసీలు ఎత్తిపోయడానికి అనుగుణంగా విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. అన్ని ప్రాజెక్టుల వద్ద అదనంగా ఇంపెల్లర్స్, పంపుసెట్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఉంచాలని సూచించారు. నీటి పారుదల విధానం, ఇన్వెంటరీ, నిర్వహణ వ్యూహం ఖరారైన తర్వాత రాష్ట్ర స్థాయి నీటి పారుదల సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. కృష్ణా నదిలో నీటి ప్రవాహం లేని సమయంలో నాగార్జున సాగర్ ఆయకట్టుకు నీరందించే ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మిడ్‌మానేరుకు మూడు టీఎంసీల నీళ్లు వస్తాయి కాబట్టి పుష్కలమైన నీరు అందుబాటులో ఉంటుంది. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వచ్చే నీటితో బస్వాపూర్ రిజర్వాయర్ నింపి, అక్కడి నుంచి షామీర్‌పేట వాగు, మూసీ నది, ఆసిఫ్ నహర్‌కు నీటిని తరలించాలని.. ఉదయ సముద్రాన్ని బైపాస్ చేసి పానగల్ వాగులో కలపాలని నిర్ణయించారు. అక్కడి నుంచి నేరుగా నాగార్జున సాగర్ ఆన్‌లైన్ రిజర్వాయర్ అయిన పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌కు నీటిని చేర్చాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ పనులపై సంపూర్ణ అవగాహన వచ్చేందుకు నీటి పారుదల శాఖ అధికారులు, రిటైర్డు ఇంజనీర్లు త్వరలోనే ఆ ప్రాంతాలను పరిశీలించాలన్నారు. గోదావరి బేసిన్‌లో మల్లన్న సాగర్ వద్ద, కృష్ణా బేసిన్‌లో పాలమూరు ఎత్తిపోతల పథకం వద్ద నీటి పారుదల శాఖ అధికారులు సమావేశాలు నిర్వహించుకోవడానికి అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇదిలావుండగా దుమ్ముగూడెం వద్ద గోదావరిపై 320 మెగావాట్ల సామర్థ్యంతో జల విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలంగాణ జెన్ కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్ రావు ‘సాక్షి’కి తెలిపారు. ఎన్ని యూనిట్లను ఏర్పాటు చేయాలన్న అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు. కాగా, 37 టీఎంసీల నిల్వతో చేపడుతున్న దుమ్ముగూడెం బ్యారేజీ నిర్మాణానికి రూ. 4,500 కోట్లు ఖర్చు కాగలదని ప్రాథమికంగా అంచనా వేసినట్లు నీటిపారుదల శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రాజీవ్ శర్మ, జెన్ కో–ట్రాన్స్ కో చైర్మన్ దేవులపల్లి ప్రభాకర్‌రావు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్.నర్సింగ్‌రావు, కార్యదర్శి స్మితా సభర్వాల్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, శేరి సుభాష్ రెడ్డి, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఈఎన్‌సీలు మురళీధర్‌రావు, హరిరామ్, వెంకటేశ్వర్లు, బి.నాగేంద్రరావు, జెన్‌కో డైరెక్టర్ వెంకట్రాజం, ట్రాన్స్‌కో డైరెక్టర్లు సూర్య ప్రకాశ్, నర్సింగ్ రావు, నీటి పారుదల శాఖ సలహాదారు పెంటారెడ్డి, రిటైర్డ్ ఇంజనీర్లు శ్యాంప్రసాద్ రెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



చటాన్‌పల్లి బ్రిడ్జి వద్ద ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు బృందం



షాద్‌నగర్ బస్టాండ్ ఆవరణలో లారీని పరిశీలిస్తున్న క్లూస్ టీం

# అర్ధరాత్రి ‘విచారణ’

▶ మొదటి పేజీ తరువాయి

ఏ షాప్ వెళ్లారు? దిశను ఎత్తుకెళ్లిన ప్రాంతాన్ని నిందితులు పోలీసులకు చూపించారు. అత్యాచారం జరిగిన ప్రాంతానికి సమీపంలో పాతిపెట్టిన దిశ మొబైల్‌ను నిందితులతోనే తవ్వి తీయించారు. అక్కడి నుంచి దిశ మృతదేహాన్ని క్యాబిన్‌లో ఎలా వేసుకుని వెళ్లారు? ఎవరెవరు సాయం చేశారు? నవీన్, శివ పెట్రోల్ కొన్న బంకులు కూడా చూపించారు. ఇక షాద్‌నగర్ వైపు వెళ్లిన తర్వాత వెనక్కి రావడం, చటాన్‌పల్లి బ్రిడ్జి వద్ద మృతదేహాన్ని దహనం చేసేవరకు జరిగిన ఉదంతాన్ని నిందితులు పోలీసులకు కళ్లకు కట్టారు.

**శవాన్ని ఈడ్చుకెళ్లిన దుండగులు..**

చటాన్‌పల్లి బ్రిడ్జి వద్ద లారీని నిలిపిన నిందితులు మృతదేహాన్ని క్యాబిన్ నుంచి దించారు. వారే మోసుకెళ్లి బ్రిడ్జి కింద ఒక మూలకు ఈడ్చుకెళ్లినట్లు పోలీసులకు వివరించినట్లు తెలిసింది. తొండుపల్లి వద్ద ఘటనాస్థలంలోనే దిశ చనిపోయినా.. ఇంకా దిశ బతికే ఉండొచ్చన్న అనుమానంతో ఆనవాళ్లు కూడా దొరక్కుండా వెంట తెచ్చుకున్న పెట్రోల్‌తో పాటు, లారీ నుంచి డీజిల్ తీసి దహనం చేసిన విధానాన్ని చూపారు. ఆ మంటల్లోనే దిశ సిమ్ కార్డులు వేసినట్లు వివరించారు.

**మరోసారి లారీ పరిశీలన**

చటాన్‌పల్లి నుంచి నేరుగా క్లూస్ టీం షాద్‌నగర్‌లో ఉన్న లారీ వద్దకు వెళ్లి మరోసారి ఆనవాళ్లు సేకరించింది. స్థానిక ఆర్టీసీ డిపోలో నిలిపి ఉంచిన లారీ క్యాబిన్‌లో ఆధారాలు సేకరించింది. రక్తపు మరకలు, వెంట్రుకలు, వేలిముద్రలు, బ్లాంకెట్ పోగులు తదితర ఆనవాళ్లు సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు సమాచారం. ఈ కేసు దర్యాప్తులో మొత్తం 50 మంది పోలీసులు పాలుపంచుకుంటున్నట్లు వినికిడి. మొత్తం 7 బృందాలను సీపీ సజ్జనార్ ఏర్పాటు చేసినట్లు తెలిసింది. నలుగురు అదనపు ఎస్పీ స్థాయి అధికారులు ఇందులో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**విభజించి దర్యాప్తు..**

20 రోజుల్లోనే చార్జిషీటు దాఖలు చేయాలన్న గడువు విధించుకోవడంతో.. కేసును విభజించి దర్యాప్తు చేస్తున్నారు. డీఎన్‌ఏ, శరీర స్రావాల విశ్లేషణ, ప్రత్యేక సాక్షుల నుంచి వివరాల సేకరణ, సాంకేతిక ఆధారాలైన సెల్‌ఫోన్ సిగ్నల్స్, సీసీ కెమెరాల ఫుటేజీ, లారీ టైర్ల మార్కుల సేకరణ, లీగల్ ప్రొసీడింగ్స్ ఇలా విభజించి ఆయా బృందాలకు అప్పగించినట్లు తెలుస్తోంది. ఈ బృందాలకు శంషాబాద్ డీసీపీ ప్రకాశ్‌రెడ్డి నేతృత్వం వహిస్తున్నారు. కేసు వివరాలను ఎప్పటి కప్పుడు సజ్జనార్ తెలుసుకుంటున్నారని సమాచారం.

**పైకోర్టుకు వెళ్లినా.. ఉరి పడాల్సిందే**

ఈ కేసులో ప్రత్యక్ష సాక్షుల కన్నా.. సాంకేతిక, ఫోరెన్సిక్ ఆధారాలే కీలకం కానున్నాయి. ఘటన జరిగిన ప్రాంతంలో మనుషుల సంచారం లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఘటనను నేరుగా చూసిన వారు లేకపోవడంతో ఈ కేసులో నిందితుల పాత్ర నిరూపించడం పోలీసులకు సవాలుగా మారింది. దిశ కేసు నేపథ్యంలో దేశవ్యాప్త నిరసనలు వెల్లువెత్తుతుండటంతో తెలంగాణ పోలీసులపై ఒత్తిడి పెరిగింది. దీంతో నిందితులకు ఉరిశిక్ష పడేలా.. పైకోర్టుకు వెళ్లినా.. శిక్షలో ఎలాంటి మార్పులు చోటుచేసుకోకుండా అత్యంత పకడ్బందీగా సాక్ష్యాలు సేకరిస్తున్నారు.

**వరంగల్ కేసులా కాకుండా..**

వరంగల్‌లో 9 నెలల చిన్నారిపై లైంగిక దాడి, హత్య కేసులో కూడా ప్రత్యక్ష సాక్షులు ఎవరూ లేరు. కానీ, కేసులో నిందితుడి పాత్ర నిరూపించడంలో పోలీసులు సఫలమయ్యారు. తొలుత ఫాస్ట్‌ట్రాక్ కోర్టు నిందితుడికి ఉరిశిక్ష విధించింది. అయితే నిందితుడు పెట్టుకున్న పిటిషన్‌ను విచారించిన కోర్టు.. అత్యంత అరుదైన కేసుల్లోనే ఉరి శిక్ష విధించాలంటూ.. నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ.. తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ‘దిశ’కేసును దర్యాప్తు చేస్తున్న బృందం కూడా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వరంగల్ పోలీసుల సలహాలు తీసుకున్నట్లు సమాచారం. దిశ కేసు అత్యంత అరుదైనది కాబట్టి.. ఎట్టి పరిస్థితుల్లోనూ నిందితులు పైకోర్టుకు వెళ్లినా.. శిక్షలో మార్పు లేకుండా చూడాలన్న పట్టుదలతో పోలీసులు పనిచేస్తున్నారు.

**గొర్రెల కాపరి, కానిస్టేబుల్ సమయ స్ఫూర్తి**

బాధితురాలి మృతదేహం కాలిపోతుండగా చూసిన గొర్రెల కాపరి, అతడిచ్చిన సమాచారంతో వెంటనే ఘటనాస్థలానికి వెళ్లిన కానిస్టేబుల్ వెంటనే స్పందించడంతోనే పోలీసులు బాధితురాలిని గుర్తించడం సాధ్యమైంది. ఆధారాల సేకరణ కూడా వేగంగా జరిగింది. ఈ ఇద్దరూ సమయస్ఫూర్తితో వ్యవహరించడం వల్లే దర్యాప్తు సాఫీగా సాగుతోందని చెప్పుకోవచ్చు.

**మాకెలాంటి ఆదేశాలు రాలేదు..**

దిశ కేసు దర్యాప్తు విషయంలో గురువారం ఉదయం నుంచే రకరకాల కథనాలు, విశ్లేషణలు జరుగుతున్నా.. పోలీసులు మాత్రం తమకు కోర్టు నుంచి ఇంకా కస్టడీ ఆదేశాలు రాలేదని స్పష్టం చేస్తుండటం గమనార్హం. ఈ విషయంలో వివరణ అడిగేందుకు మీడియా ప్రతినిధులు ప్రయత్నించినా లాభం లేకపోయింది.

# ఉల్లి ఘాటు @ 170

▶ మొదటి పేజీ తరువాయి

గణనీయంగా తగ్గిపోయింది. గతేడాది 4 లక్షల హెక్టార్లలో సాగు జరగ్గా ఈ ఏడాది కేవలం రెండున్నర లక్షల హెక్టార్లకు సాగు పడిపోయింది. దీనికితోడు ఆగస్టు నుంచి మూడు నెలలపాటు కురిసిన భారీ వర్షాలతో వేసిన పంటంతా దెబ్బతిన్నది. దీంతో ప్రస్తుతం ముంబై, పుణేలోనే ఉల్లి కిలో గత 2–3 నెలలుగా రూ. 90 నుంచి రూ. 100 మధ్య పలుకుతోంది. సాధారణంగా మహారాష్ట్రలో ఉల్లి కొరత ఉంటే అక్కడి వ్యాపారులు పాకిస్తాన్, ఈజిప్ట్, చైనా, అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుంచి దిగుమతి చేసుకుంటారు. అయితే ప్రస్తుతం పాక్ నుంచి ఉల్లి దిగుమతులపై కేంద్రం ఆంక్షలు విధించడంతో అక్కడి నుంచి సరఫరా ఆగిపోయింది. బంగ్లాదేశ్‌ను ముంచెత్తిన వరదల కారణంగా అక్కడి నుంచి సరఫరా లేదు. దీంతో ఈజిప్ట్, టర్కీ నుంచి ఉల్లి దిగుమతి చేసుకుంటున్నారు. ఉల్లి దిగుమతి కోసం కిలోకు రూ. 6–8 ఖర్చు వస్తుండటంతో మహారాష్ట్రలోనే కిలో రూ. 110 వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. మరోవైపు కర్ణాటక నుంచి సైతం ఉల్లి రాకపోవడంతో ధరలు ఏమాత్రం దిగిరావడం లేదు. ఈ నెల 2న 6,471 క్వింటాళ్ల మేర ఉల్లి రాష్ట్రానికి రాగా గురువారానికి అది 3 వేల క్వింటాళ్లకు తగ్గింది. దీంతో మూడు నాలుగు రోజుల కిందటి వరకు కిలో ఉల్లి రూ. 90–100 మధ్య ఉండగా గురువారం మలక్‌పేట మార్కెట్ చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఉల్లి క్వింటాల్ ధర రూ.14,500 పలికింది. ఇది బహిరంగ మార్కెట్‌కు వచ్చేసరికి రూ.160 నుంచి రూ.170కి విక్రయిస్తున్నారు.

## ఈజిప్టు ఉల్లే దిక్కు..

దేశంలో ఆకాశాన్నంటిన ఉల్లి ధరలకు కళ్లెం వేసేందుకు కేంద్రం గత నెల చివరి వారంలో టర్కీ నుంచి 11 వేల మెట్రిక్ టన్నులు, ఈజిప్ట్ నుంచి 6,090 మెట్రిక్ టన్నుల ఉల్లిగడ్డలను దిగుమతి చేసుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఈజిప్ట్ ఉల్లి ఈ నెల రెండో వారానికల్లా ముంబై చేరుతుందని కేంద్రం ప్రకటించింది. ఈజిప్ట్ ఉల్లిలోంచి తమకు వారానికి 100 టన్నులకు తగ్గకుండా సరఫరా చేయాలని ఇప్పటికే రాష్ట్రం కేంద్రానికి లేఖ రాసింది. ఈజిప్ట్ నుంచి వచ్చే స్టాక్ ఈ నెల 10కల్లా ముంబై పోర్టుకు చేరే అవకాశం ఉందని, ఆ తర్వాత మూడు రోజుల్లో రాష్ట్రానికి ఉల్లి చేరొచ్చని మార్కెటింగ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కనీసం 500 టన్నుల ఈజిప్టు ఉల్లి తెలంగాణకు దిగుమతి అవుతుందని, అప్పుడే ధరలు తగ్గుతాయని చెబుతున్నారు. రాష్ట్రంలో నారాయణఖేడ్ సహా ఇతర ప్రాంతాల్లో సాగు చేసిన ఉల్లి పంట ఫిబ్రవరి ఆఖరు లేదా మార్చిలో మార్కెట్‌లోకి వస్తుందని, అప్పటివరకు ధరాఘాతం తప్పదని చెబుతున్నారు.

**కర్నూలు ఉల్లికి పెరిగిన డిమాండ్...**

రాష్ట్రానికి కర్నూలు జిల్లా నుంచి కూడా ఉల్లి దిగుమతి జరుగుతోంది. కర్నూలులో ఏటా 87,500 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తుండగా ఈ ఏడాది అది 50 వేల ఎకరాలకు పడిపోయింది. దీనికితోడు ఈ ఏడాది విస్తారంగా కురిసిన వర్షాలతో జిల్లాలో పంట పూర్తిగా దెబ్బతిన్నది. మరోవైపు సాగు చేసిన పంటలోనూ ఎకరానికి 60 క్వింటాళ్ల మేర రావాల్సిన దిగుబడి 35–40 క్వింటాళ్లకు పడిపోయింది. దీంతో అక్కడే ధరలు అమాంతం పెరిగాయి. సెప్టెంబర్‌లో క్వింటాల్ ధర గరిష్టంగా రూ. 4,500కు, అక్టోబర్‌లో రూ. 4,600కు నవంబర్‌లో రూ. 5,250 పలికింది. సాగు, దిగుబడులు తగ్గడం, స్థానిక డిమాండ్ అధికంగా ఉండటంతో కర్నూలు మార్కెట్‌కు గతంలో రోజూ 5–6 వేల క్వింటాళ్ల ఉల్లి పంట వచ్చేది. కానీ ప్రస్తుతం అది రోజుకు వెయ్యి క్వింటాళ్లకు తగ్గింది. దీంతో అక్కడి నుంచి రాష్ట్ర అవసరాల మేరకు ఉల్లి రావట్లేదు. మరోవైపు ప్రజలకు రాయితీపై కిలో ఉల్లి రూ. 25కే సరఫరా చేసేందుకు ఎంత ధరకైనా కొనుగోళ్లు జరపాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారులకు సూచించడంతో మార్కెట్ యార్డు అధికారులు, వ్యాపారులు పోటీ పడి కొనుగోళ్లు చేస్తున్నారు. దీంతో ఉల్లి ధరలకు అమాంతం డిమాండ్ పెరిగి ధరలు నింగినంటుతున్నాయి. కర్నూలు మార్కెట్‌లో గత బుధవారం మధ్యాహ్నానికి క్వింటాలు ఉల్లి ధర గరిష్టంగా రూ. 12,510 పలికింది. ఈ ప్రభావం తెలంగాణపై పడి ఇక్కడి ధరల పెరుగుదలకు కారణమైంది.



**ఆనియన్ దోశ.. పకోడీలు బంద్!**

ఉల్లి ధరల దెబ్బకు హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల్లో ఉల్లి సంబంధిత వంటకాలను హోటళ్లు, తోపుడు బండ్లపై వ్యాపారులు చాలా వరకు తగ్గించేశారు. ముఖ్యంగా ఉల్లి దోశ, పకోడి, మిర్చి, పానీపూరీల్లో ఉల్లి వాడకంపై స్వీయ ఆంక్షలు పెట్టుకున్నారు. తోపుడు బండ్ల వద్ద ‘ఉల్లి మళ్లీ అడగరాదు’ అని బోర్డులు పెడుతున్నారు. ఇక బిర్యానీల్లో ఉల్లి వాడకం జరుగుతున్నా వాటితోపాటు ఇచ్చే సలాడ్‌లో ఉల్లి స్థానంలో కీరా, క్యారెట్‌లను ఇస్తున్నారు. వినియోగదారులు ఉల్లి అడిగితే సలాడ్‌కు రూ. 20–30 వసూలు చేస్తున్నారు. ఈ ప్రభావం పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలపైనా పడుతోంది.

**రైతుబజార్లకు 30 క్వింటాళ్ల ఉల్లి సరఫరా...**

హైదరాబాద్‌లోని 10 రైతు బజార్లకు మలక్‌పేట మార్కెట్ నుంచి 30 క్వింటాళ్లను కొనుగోలు చేసి సరఫరా చేసినట్లు అధికారులు తెలిపారు. ఉల్లి ధర తగ్గే వరకు రైతు బజార్లకు ఉల్లి సరఫరా చేస్తామని చెప్పారు.

## ‘మహా’ సిండికేట్...

రాష్ట్రంలో డిమాండ్ తగ్గట్టుగా లేని ఉల్లి సరఫరాను వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. తెలంగాణలో ఉల్లి నిల్వలకు కోల్డ్ స్టోరేజీలు లేకపోవడంతో పూర్తిగా మహారాష్ట్రపై ఆధారపడుతున్న రాష్ట్ర వ్యాపారులు అక్కడి వ్యాపారులతో సిండికేట్ అయ్యారు. కొనుగోలు చేసిన ఉల్లిని రాష్ట్రానికి తీసుకురాకుండా అక్కడే నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. అదీగాక తక్కువ బరువు తూగే పాత స్టాక్‌కు ధర ఉండదన్న ఉద్దేశంతో దాన్ని తీసుకురాకుండా ఎక్కువ బరువుండే తాజా స్టాక్‌నే తీసుకొస్తున్నారు. మహారాష్ట్ర నుంచి 10 లారీలు వస్తుంటే అందులో 3 పాత స్టాక్ లారీలయితే 7 కొత్త స్టాక్‌వి ఉంటున్నాయి. కొత్త స్టాక్‌కు ధర పెంచేసి విక్రయాలు చేస్తున్నారు. ఉల్లి అక్రమ నిల్వలను అరికట్టేందుకు రిటైలర్లు 100 క్వింటాళ్లు, హోల్‌సేల్ వ్యాపారులు 500 క్వింటాళ్లకు మించి నిల్వ చేసుకోరాదని కేంద్రం స్పష్టం చేసినా ఎక్కడా దీనిపై నిఘా ఉన్నట్లు కనిపించట్లేదు.

**రాష్ట్రంలో పడిపోతున్న దిగుమతులు, పెరుగుతున్న ధర ఇలా..**
**(దిగుమతులు క్వింటాళ్లలో), (ధర రూపాయల్లో)**

| తేదీ | ఎర్ర ఉల్లి దిగుమతి | తెల్ల ఉల్లి | గరిష్ట ధర | గత ఏడాది ధర |
|---|---|---|---|---|
| డిసెంబర్ 1 | – | – | 90 | 15 |
| 2 | 6,471 | 945 | 110 | 25 |
| 3 | 4,429 | 332 | 110 | 25 |
| 4 | 4,144 | 0 | 130 | 15 |
| 5 | 3,000 | 150 | 160–170 | 15 |

### మృతి చెందిన ఆర్టీసీ కార్మికుల కుటుంబాలకు సాయం

**సాక్షి, హైదరాబాద్:** సమ్మె కాలంలో మృతిచెందిన ఆర్టీసీ కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం పంపిణీ మొదలైంది. చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు రూ.2 లక్షలు చొప్పున ఆర్థిక సాయం చేయనున్నట్టు సీఎం కేసీఆర్, గత ఆదివారం కార్మికులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ప్రకటించారు. ఆర్టీసీ వద్ద ప్రస్తుతం నిధులు లేనందున ప్రభుత్వం నుంచే ఆ మొత్తాన్ని విడుదల చేయనున్నట్టు పేర్కొన్నారు. 38 మంది కార్మికులు మృతి చెందినట్టు అధికారులు గుర్తించారు. ఆయా కుటుంబాలకు సంబంధించిన మొత్తాన్ని జిల్లా కలెక్టర్లకు అందజేశారు. గురువారం కొంతమందికి చెక్కులు అందజేశారు. జిల్లా కలెక్టర్లు, కొన్ని చోట్ల స్థానిక ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### ఇదంజగత్




‘పెద్దోళ్లు’ ఎవరి దగ్గరికొచ్చిన నోట్లు వాళ్లే నిలిపేసుకున్నారు! నిలిపివేయడానికి ఇంకేం మిగిలాయని!!

## క్లుప్తంగా...

### దొడ్డిదారిన వెళ్లలేదు: దానం

**కాంగ్రెస్‌ను వీడటంపై ఎమ్మెల్యేలు నాగేందర్, జగ్గారెడ్డిల మధ్య ఆసక్తికర చర్చ**


దానం నాగేందర్


జగ్గారెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీని వీడి వెళ్లడంపై అసెంబ్లీ ప్రాంగణం వేదికగా ఆసక్తికర చర్చ జరిగింది. గురువారం జరిగిన సీఎల్పీ సమావేశానికి హాజరయ్యేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, సీతక్కలు అసెంబ్లీ ప్రాంగణానికి వచ్చారు. ఆ సమయంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా అక్కడకు వచ్చారు. ముగ్గురు నేతలు ఎదురుపడగా నాగేందర్‌ను చూసి 'అమ్మో మనం ఇక్కడ వద్దులే.. మీటింగ్‌కు వెళ్దాం'అంటూ సీతక్కతో జగ్గారెడ్డి వ్యాఖ్యానించగా..'తానేమీ దొడ్డిదారిన పార్టీ వీడి వెళ్లలేదని, తనను చూసి పారిపోవాల్సిన అవసరం లేదని' దానం అన్నారు. ఇందుకు జగ్గారెడ్డి స్పందిస్తూ.. గతంలోనూ, ఇప్పుడూ రాజమార్గంలోనే పార్టీ మారావనన్నారు. మళ్లీ నాగేందర్ మాట్లాడుతూ.. 'ఈ విషయాన్ని నువ్వు గుర్తించావు కానీ కాంగ్రెస్ పార్టీలో చాలా మంది గ్రహించలేద'న్నారు. దీనికి స్పందించిన జగ్గారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా పులులు, సీతక్క ఒక్కరే సింహం అని అన్నారు.

### 11, 12 తేదీల్లో డీకే అరుణ నిరాహార దీక్ష

**మద్య నిషేధం అమలు చేయాలని డిమాండ్**



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో మద్య నిషేధం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11, 12 తేదీల్లో ఇందిరా పార్కు వద్ద మహిళా సంకల్ప దీక్ష పేరుతో నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు మాజీ మంత్రి, బీజేపీ నేత డీకే అరుణ తెలిపారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ఆదాయం పెంచుకోవడమే పరమావధిగా మద్యం అమ్మకాలు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. విచ్చలవిడి మద్యం అమ్మకాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఇప్పుడు మద్య నిషేధం కోసం పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న దారుణాలకు మద్యం కూడా కారణమని పేర్కొన్నారు. దిశపై జరిగిన అఘాయిత్యానికి దేశమంతా చలించినా సీఎం కేసీఆర్ మాత్రం ఇప్పటి వరకు స్పందించలేదని మండిపడ్డారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్

### పుస్తకంగా తీసుకురావటం హర్షణీయం

**'కాళేశ్వరం ప్రాజెక్టు–తెలంగాణ ప్రగతిరథం' పుస్తకావిష్కరణలో సీఎం కేసీఆర్**

**సాక్షి, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్ల రికార్డు సమయంలోనే రైతాంగానికి నీటిని సరఫరా చేసే దశకు చేరుకున్న నిర్మాణ ఘట్టాలన్నింటినీ ఒక దగ్గర చేర్చి పుస్తకరూపంగా తీసుకురావటం హర్షణీయమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. ప్రగతిభవన్‌లో సీఎం ఓఎస్డీ (నీటి పారుదల శాఖ) శ్రీధర్‌రావు దేశ్‌పాండే రాసిన 'కాళేశ్వరం ప్రాజెక్టు–తెలంగాణ ప్రగతిరథం' పుస్తకాన్ని గురువారం సీఎం కేసీఆర్ ఆవిష్కరించారు. సీఎం మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు సమగ్ర సమాచారాన్ని, చరిత్రను అందించాలన్న సంకల్పంతోనే ఈ గ్రంథాన్ని రాశారన్నారు.

### 10న చలో ఢిల్లీతో సంబంధం లేదు

**మాజీ ఎంపీ బాబూరావు స్పష్టీకరణ**

**సాక్షి, హైదరాబాద్:** ఈ నెల 10న చలో ఢిల్లీ పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమంతో తమకు ఎలాంటి సంబంధం లేదని మాజీ ఎంపీ మిడియం బాబూరావు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సుగాలి, లంబాడా, బంజారా తెగలను ఎస్టీ జాబితా నుంచి మినహాయించాలని కోరుతూ కొన్ని గిరిజన సంఘాలు 'యునైటెడ్ ఫోరం ఫర్ ఆదివాసీస్'అనే సంస్థ ఇచ్చిన చలో ఢిల్లీ ఆహ్వాన పత్రంలో అనుమతి లేకుండా తన పేరు ప్రచురించినట్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యేలు కుంజా బొజ్జి, సున్నం రాజయ్య పేర్లను కూడా అనుమతి లేకుండా ప్రచురించారని పేర్కొన్నారు. ఆదివాసీ హక్కులను కాలరాస్తున్న బీజేపీ నేతలతో కలసి తమ పేర్లు ప్రచురించడాన్ని ఆయన ఖండించారు.

### పారదర్శకంగా ఖర్చయ్యేలా చూడాలి

**ప్రజాపద్దుల కమిటీకి స్పీకర్ పోచారం సూచన**

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ ధనాన్ని పారదర్శకంగా ఖర్చయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ)పై ఉంటుందని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో గురువారం ఎంఐఎం శాసనసభాపక్ష నేత, పీఏసీ చైర్మన్ అక్బరుద్దీన్ ఒవైసీ అధ్యక్షతన జరిగిన ప్రజా పద్దుల కమిటీ సమావేశంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ పాల్గొన్నారు. ఇతర అసెంబ్లీ కమిటీలతో పోలిస్తే పీఏసీ కమిటీ చాలా భిన్నమైందని, ప్రభుత్వాల పనితీరు, ప్రభుత్వ ధనం పారదర్శకంగా ఖర్చయ్యేలా చూడటంలో కీలక పాత్ర పోషిస్తుందని పోచారం పేర్కొన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్ ప్రతిపాదనలకు అనుగుణంగా ఆయా ప్రభుత్వ శాఖలు కేటాయింపులను సక్రమంగా ఖర్చు చేస్తున్నాయో లేదో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సిన బాధ్యత పీఏసీపై ఉందని పేర్కొన్నారు.

### నేతన్నల వస్త్రాలనే మార్కెట్‌లో అమ్మాలి

**నేతన్నల ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం డిమాండ్**

**సాక్షి, హైదరాబాద్:** చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలనే మార్కెట్‌లో విక్రయించాలని నేతన్నల ఐక్య కార్యాచరణ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ప్రస్తుత మార్కెట్‌కు అనుగుణంగా నేతన్నలకు అవసరమైన యంత్రాలను ప్రభుత్వమే సబ్సిడీ కింద కేటాయించాలని కోరింది. వివిధ షాపింగ్ మాల్స్‌లో చేనేత మగ్గంతో నేసిన వస్త్రాల పేరుతో మిల్లుల్లో తయారైన దుస్తులు అమ్ముతున్నారని ఆరోపించింది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిసేలా జంతర్‌మంతర్ వద్ద ఈ నెల 9న 'చలో ఢిల్లీ'కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపింది. గురువారం హైదరాబాద్ సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో జాతీయ నేతన్నల ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మన్ దాసు సురేష్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి బీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, మాజీ మంత్రి ఎల్.రమణ, గుజ్జకృష్ణ, జాతీయ ఐక్య కార్యాచరణ కమిటీ గౌరవ అధ్యక్షుడు వన్నాల శ్రీరాములు తదితరులు హాజరయ్యారు.

### కరదీపిక తరహాలో స్టాటిస్టికల్ ఇయర్ బుక్

**సాక్షి, హైదరాబాద్:** కరదీపిక తరహాలో స్టాటిస్టికల్ ఇయర్ బుక్–2020 రూపొందించాలని అధికారులను రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆదేశించారు. రాష్ట్రంలోని 33 జిల్లాలు, 10,854 రెవెన్యూ గ్రామాలు, 12,751 గ్రామ పంచాయతీలు, 141 మున్సిపాలిటీలతో పాటు 32 ప్రభుత్వ శాఖలు, 210 హెచ్‌వోడీ విభాగాలకు సంబంధించిన గణాంకాలను పక్కాగా సేకరించాలన్నారు. స్టాటిస్టికల్ ఇయర్ బుక్–2020 రూపకల్పనపై గురువారం హైదరాబాద్‌లో ఆర్థిక, ప్రణాళిక, గణాంక శాఖల ఉన్నతాధికారులతో వినోద్‌కుమార్ సమావేశం నిర్వహించారు.

# కరోడ్ కీ 'రాణి'

- ఐఎంఎస్ కేసు నిందితురాలు దేవికారాణి, బంధువుల ఇళ్లపై ఏసీబీ దాడులు
- హైదరాబాద్, తిరుపతి, కడపల్లో ఏకకాలంలో సోదాలు
- ఆమె భర్త గురుమూర్తిని అరెస్టు చేసిన ఏసీబీ
- కుటుంబసభ్యుల పేరిట భారీగా ఆస్తుల కొనుగోలు
- ఐఏఎస్ అధికారి పాత్రపైనా త్వరలో విచారణ?

**సాక్షి, హైదరాబాద్:** ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) కుంభకోణంలో మరో సంచలనం వెలుగుచూసింది. ఈ కేసులో ప్రధాన నిందితురాలు, ఐఎంఎస్ మాజీ డైరెక్టర్ దేవికారాణి, ఆమె బంధువుల ఇళ్లపై ఏసీబీ ఏకకాలంలో చేసిన దాడుల్లో భారీగా అక్రమాస్తులు వెలుగు చూశాయి. ఈ ఆస్తులన్నీ దేవికారాణి, ఆమె భర్త గురుమూర్తి కుటుంబసభ్యుల పేరిట ఉన్నాయి. గురువారం హైదరాబాద్, తిరుపతి, కడపలోని ఆమె బంధువుల ఇళ్లల్లో అధికారులు సోదాలు చేసి పలు కీలక డాక్యుమెంట్లు, భూముల పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ దాదాపు రూ.25 కోట్లుగా లెక్కగట్టారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.250 కోట్ల కంటే ఎక్కువగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఐఎంఎస్ డైరెక్టర్‌గా పనిచేసిన సమయంలో పలు ఫార్మా కంపెనీలతో కుమ్మక్కయి అర్హత లేని కంపెనీలకు కాంట్రాక్టులు అప్పగించి రూ.కోట్లల్లో ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలకు ఏసీబీ అధికారులు భారీగా ఆధారాలు సంపాదించారు.

**దిమ్మతిరిగేలా ఆస్తులు..**

ఐఎంఎస్‌లో కోట్ల రూపాయల అవినీతి జరిగిన కేసులో ఇప్పటి దాకా మాజీ డైరెక్టర్ దేవికారాణి, మాజీ జేడీ పద్మలతోపాటు పలువురు ఫార్మా కంపెనీల యజమానులు, వారి బినామీలను ఏసీబీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. బుధవారం దేవికారాణి భర్త గురుమూర్తి అరెస్టుతో ఈ సంఖ్య 18కి చేరింది. అనంతరం అతడిని చంచల్‌గూడ జైలుకు రిమాండ్ కోసం తరలించారు. ఏసీబీ దాడుల్లో ఆమె విలాసవంతమైన ఆస్తులు చూసి అధికారులే విస్తుపోయారని విశ్వసనీయ సమాచారం. విల్లాలు, అపార్ట్‌మెంట్లు, స్థలాలు, ఇళ్లు, నగలు, లగ్జరీ కార్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, కోట్ల రూపాయల డిపాజిట్లను గుర్తించారు. లగ్జరీ కార్లను కుటుంబసభ్యుల పేరిట కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఏపీలో అమరావతి, తిరుపతి, వైజాగ్‌లో, తెలంగాణలోని ఉమ్మడి మెదక్ జిల్లా రామాయంపేట, చేగుంట, రంగారెడ్డి ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో వ్యవసాయ భూములు ఉన్నాయని వెల్లడించారు.

**ఐఏఎస్ అధికారి పాత్రపైనా ఆధారాలు?**

ఆమెకు చెందిన స్థిరాస్తుల డాక్యుమెంట్ విలువ రూ.25 కోట్లు ఉండగా.. బహిరంగ మార్కెట్లో రూ.250 కోట్లకు పైగానే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు దాడుల్లో దొరికిన వివరాలన్నీ చూస్తే దేవికారాణి ఆస్తులు రూ.350 కోట్లు దాటినా ఆశ్చర్యపోనవసరం లేదని ఓ అధికారి వ్యాఖ్యానించారు. ఒక్క పీఎంజే జ్యువెల్లరీస్‌కే నగల కోసం ఏకంగా రూ.7.3 కోట్లు చెల్లించినట్లు తేలింది. ఈ కేసులో దేవికారాణి బినామీలైన నాగలక్ష్మి, వీరన్న ఆస్తుల లెక్క తేలాల్సి ఉంది. మరో బినామీని త్వరలోనే ఏసీబీ అరెస్టు చేయనున్నట్లు సమాచారం. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి పాత్రపైనా ఏసీబీ కొన్ని ఆధారాలు సంపాదించినట్లు సమాచారం. సదరు ఐఏఎస్‌కు కూడా ముడుపులు అందాయని మొదటి నుంచీ పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. ఆయన పాత్రపై మరిన్ని ఆధారాలు లభించి, స్పష్టత వస్తే ఈ కేసు మరో మలుపు తిరగనుంది.


దేవికా రాణి భర్త గురుమూర్తి

**గుర్తించిన ఆస్తులివే**

1. షేక్‌పేట, జూబ్లీహిల్స్‌లో విల్లాలు
2. ఆర్ఆర్ఎస్ టవర్స్, సోమాజిగూడలో ఫ్లాట్
3. షేక్‌పేటలో ఆదిత్య ఎంప్రెస్ టవర్స్‌లో 3 ఫ్లాట్లు
4. తిరుపతిలో బహుళ అంతస్తుల భవనం
5. రాజేంద్రనగర్, లక్ష్మీగూడలో ఇల్లు
6. హైదరాబాద్ సహా తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో 11 ఓపెన్ ప్లాట్లు
7. తెలంగాణలో 32 ఎకరాల వ్యవసాయ భూమి
8. హైదరాబాద్‌లో 16 వాణిజ్యషాపులు
9. వైజాగ్ మధురవాడలో ఇల్లు
10. కన్‌స్ట్రక్షన్ కంపెనీలో సెక్యూరిటీ డిపాజిట్లు
11. నారాయణగూడ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్లు
12. 23 బ్యాంకుల్లో ఉన్న నగదు
13. గృహోపకరణాలు
14. బంగారు వెండి ఆభరణాలు
15. ఇంట్లో లభించిన నగదు
16. ఇంట్లోని ఎలక్ట్రానిక్ వస్తువులు
17. ఇన్నోవా క్రిస్టా కారు
18. మోటారు సైకిల్

## కేంద్రంపై కేటీఆర్ వ్యాఖ్యలు సరైనవే

**ప్రభుత్వ విప్ గువ్వల, ఎమ్మెల్యే కిషోర్**


గువ్వల బాలరాజు


గ్యాదరి కిషోర్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రం అభివృద్ధికి కేంద్రం సహకరించట్లేదంటూ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరైనవేనని, కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు రావట్లేవని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్ విమర్శించారు. కేటీఆర్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. గురువారం అసెంబ్లీ టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో వెయ్యి కిలోమీటర్ల మేర జాతీయ రహదారులుగా అభివృద్ధి చేస్తామని కేంద్రం ఇచ్చిన హామీని నెరవేర్చలేదని పునరుద్ఘాటించారు. లక్ష్మణ్ తన పదవిని కాపాడుకునేందుకే కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని బాలరాజు హెచ్చరించారు. 'నిధుల కోసం రాష్ట్ర మంత్రులు, టీఆర్ఎస్ ఎంపీలు కేంద్ర మంత్రులను కలసి వినతిపత్రాలు ఇస్తున్న తీరు లక్ష్మణ్‌కు కనిపించట్లేదా.. కాళేశ్వరానికి జాతీయ హోదా కోసం బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఎందుకు ప్రయత్నించట్లేదు'అని ప్రశ్నించారు. కులాలు, మతాలను విభజించి పాలించడం టీఆర్ఎస్ ప్రభుత్వం చేయదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకంగా మాట్లాడితే తన ఉనికి ఉంటుందనే భ్రమల నుంచి లక్ష్మణ్ బయటకు రావాలని సూచించారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో బీజేపీకి కనీసం డిపాజిట్లు కూడా దక్కలేదని కిషోర్ విమర్శించారు. దిశ ఘటనలో సీఎం కేసీఆర్‌పై విమర్శలు చేయడం సరికాదని, ట్విట్టర్ మాత్రమే కాకుండా కేటీఆర్‌కు చాలా పనులు ఉన్నాయని పేర్కొన్నారు. బెల్ట్ షాపుల విషయంలో కాంగ్రెస్ నేతలు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని, డీకే అరుణ మద్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని కిషోర్ ఎద్దేవా చేశారు.

## ఢిల్లీలో కాళ్లు.. హైదరాబాద్‌లో కన్నీళ్లు

- ఇదీ కేటీఆర్ తీరన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్
- దమ్ముంటే చర్చకు రావాలని సవాల్


మాట్లాడుతున్న కె.లక్ష్మణ్. చిత్రంలో కొల్లి మాధవి

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు తీరు ఢిల్లీలో కాళ్లు.. హైదరాబాద్‌లో కన్నీళ్లు అనే విధంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం ఇస్తున్న నిధులు సక్రమంగా వినియోగించుకోవడం చేతకాక కేంద్రంపై నిందలు మోపడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రం తెలంగాణకు ఏం ఇచ్చిందో.. వాటిని సద్వినియోగం చేసుకోవడంలో టీఆర్ఎస్ ఎలా వైఫల్యం చెందిందో దమ్ముంటే చర్చకు రావాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. కేటీఆర్ ఢిల్లీ వెళ్లి నిధులు తెచ్చుకుంటారని, పథకాలు, ప్రాజెక్టులు మంజూరు చేయించుకుంటారని.. తిరిగి హైదరాబాద్ వచ్చిన తర్వాత కేంద్రం ఏమీ ఇవ్వడం లేదంటూ కన్నీళ్లు పెట్టుకుంటారని విమర్శించారు. ఢిల్లీ వెళ్లినప్పుడు వంగి దండాలు పెడతారని, రాష్ట్రానికి వచ్చి అడ్డగోలుగా మాట్లాడతారని ధ్వజమెత్తారు. పూర్తిస్థాయిలో వెనుకబడిన బుందేల్‌ఖండ్‌కు కేంద్రం ఒక ప్రాజెక్టును మంజూరు చేసినా దానిని జీర్ణించుకోలేని స్థితికి కేటీఆర్ దిగజారారని విమర్శించారు. హైదరాబాద్‌లోని రక్షణ శాఖ భూములను స్వాహా చేయడానికి కుట్రలు చేస్తున్నారని, వాటిని చేజిక్కించుకోవడానికి రకరకాల పథకాలు వేస్తున్నారని ఆరోపించారు. వాటిని ఇవ్వకపోయేసరికి రక్షణ పథకాలు హైదరాబాద్‌లో కాకుండా మరోచోట పెడుతున్నారంటూ ఎదురుదాడి చేస్తున్నారన్నారు. ఏయే సంస్థలను ఎక్కడ ఏర్పాటు చేయాలో కేంద్రానికి తెలుసని, వాటి గురించి కేటీఆర్ సలహాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు.

## శాంతి భద్రతలు అదుపు తప్పాయి

- రోజుకు ఇద్దరు అమ్మాయిల మిస్సింగ్ కేసులే ఇందుకు నిదర్శనం
- మద్యం అమ్మకాలపై నియంత్రణ విధించాలి.. దిశా నిందితులకు ఉరిశిక్ష పడాలి


మాట్లాడుతున్న భట్టి విక్రమార్క. చిత్రంలో శ్రీధర్‌బాబు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి అదుపు తప్పిందని, పోలీసు యంత్రాంగం ప్రజల అవసరాల కోసం పని చేయడం లేదని కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ఒక్క హైదరాబాద్‌లోనే రెండేళ్లలో వేలమంది అమ్మాయిల మిస్సింగ్ కేసులు నమోదయ్యాయని, రోజుకు ఇద్దరు అమ్మాయిలు అదృశ్యం అవుతున్నారంటే రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. భట్టి అధ్యక్షతన గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో సీఎల్పీ సమావేశం జరిగింది. అనంతరం పార్టీ ఎమ్మెల్యేలతో కలసి భట్టి విలేకరులతో మాట్లాడుతూ.. దిశా అత్యాచారం, హత్య ఘటన తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఆసిఫాబాద్, వరంగల్‌లో మహిళలపై జరిగిన ఘటనలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్న నిందితులకు ఉరిశిక్ష పడాలని అభిప్రాయపడ్డారు. మహిళలపై దాడులు తీవ్రమైనవిగా కాంగ్రెస్ పార్టీ భావిస్తోందని, మహిళలపై దాడుల ఘటనకు మద్యమే ప్రధాన కారణంగా కనిపిస్తోందన్నారు. మద్యం అమ్మకాల ద్వారా ఆదాయం వస్తే చాలన్న రీతిలోనే ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు.

**మద్యాన్ని నియంత్రించాలి**

రాష్ట్రంలో మద్యాన్ని నియంత్రించాలని, దీనిపై కాంగ్రెస్ పార్టీ ఉద్యమిస్తుందని భట్టి చెప్పారు. మద్య నియంత్రణ కోసం శనివారం ట్యాంక్‌బండ్ నుంచి రాజ్‌భవన్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టి గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. పోలీసులు ప్రజల కోసం పనిచేయకుండా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్యకర్తల రక్షణలో ఉంటున్నారని భట్టి ఆరోపించారు. సమావేశంలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క, జగ్గారెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.

## మద్యంపై 'యుద్ధం'.. కాంగ్రెస్ సన్నద్ధం

**సాక్షి, హైదరాబాద్:** మద్యంపై యుద్ధం ప్రకటించాలని ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ప్రజల ఆర్థిక స్థితిగతులను ప్రభావితం చేయడంతో పాటు పెద్ద ఎత్తున జరుగుతున్న అఘాయిత్యాలకు మద్యమే కారణమని, మద్య నియంత్రణే ఎజెండాగా ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతోంది. బెల్టుషాపులు, పర్మిట్ రూంల ఎత్తివేత, హైవేలపై మద్య నిషేధమనే 3 డిమాండ్లతో నిర్వహించనున్న ఈ ఉద్యమం కోసం ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇటీవల జరిగిన పార్టీ కోర్‌కమిటీ సమావేశంతో పాటు గురువారం జరిగిన సీఎల్పీ సమావేశంలోనూ ఇదే ప్రధాన ఎజెండాగా ఆ పార్టీ నేతలు చర్చించారు.

**నిషేధం సాధ్యం కాదు కానీ...**

'దిశ'హత్య అనంతరం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన పార్టీ కోర్‌కమిటీ సమావేశంలో మద్య నిషేధంపై చర్చించారు. ఏపీలో అమలవుతున్న మద్యం పాలసీ విధివిధానాలపై కూడా చర్చించారు. మద్య నిషేధం సాధ్యం కాని పరిస్థితుల్లో ఆదాయం బేరీజుగా కాకుండా ప్రజల మాన ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని మద్యాన్ని నియంత్రించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు.


కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీకి జ్ఞాపికను బహూకరిస్తున్న మంత్రి సత్యవతి, ఎంపీ కవిత తదితరులు

## 18 ఏళ్ల వరకూ పౌష్టికాహారం అవసరమే

- వయోపరిమితి పెంచండి
- కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీని కోరిన మంత్రి సత్యవతి

**సాక్షి, న్యూఢిల్లీ:** బాలికలకు పౌష్టికాహారం అందించే వయో పరిమితిని 18 ఏళ్లకు పెంచాలని కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీని రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ కోరారు. ఈ మేరకు ఆమె గురువారం ఢిల్లీలో పార్టీ ఎంపీలు బండ ప్రకాశ్, మాలోతు కవితతో సహా కేంద్ర మంత్రిని కలిశారు. ప్రస్తుతం కేంద్రం 11 నుంచి 14 ఏళ్లలోపు వారికి మాత్రమే పౌష్టికాహారం ఇస్తున్నారని , కానీ రాష్ట్రంలో 18 ఏళ్లలోపు ఉన్న బాలికలకు కూడా పౌష్టికాహార లోపం ఉందని సర్వేలు చెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వం వారికీ అందిస్తోందని వివరించారు. కేంద్రం కూడా ఈ వయో పరిమితిని 18 ఏళ్లకు పెంచాలని కోరారు. తెలంగాణకు 15 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఇవ్వమని కోరగా, కేవలం 5 మంజూరు చేశారని, మిగిలినవి కూడా వెంటనే మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలో కొత్త జిల్లాలకు సఖీ కేంద్రాలను ఇవ్వాలని, 'బేటీ బచావో–బేటీ పడావో'కార్యక్రమాన్ని 8 జిల్లాలకు పరిమితం చేయకుండా లింగ నిష్పత్తిలో వ్యత్యాసాన్ని నివారించేందుకు ఈ పథకాన్ని మిగిలిన 25 జిల్లాలకు కూడా విస్తరించాలని, శిశువుల సంరక్షణ కోసం 2 చిల్డ్రన్ హోమ్స్ మంజూరు చేయాలని కోరారు.

# మోడల్ స్కూళ్లలో కెరీర్ గైడెన్స్ మొదలు

- విద్యార్థుల అభిరుచుల మేరకు ఆయా రంగాలపై ప్రోత్సాహం
- 194 స్కూళ్లలోని 18 వేల మంది విద్యార్థులకు దిశానిర్దేశం
- ఇటు ప్రభుత్వ స్కూళ్లలోనూ కెరీర్ గైడెన్స్ నిర్వహణకు కసరత్తు
- త్వరలోనే 'మై చాయిస్.. మై ఫ్యూచర్' సర్వే



**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసే కార్యక్రమాన్ని విద్యాశాఖ చేపట్టింది. తొలుత రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలోని 18 వేల మంది విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ప్రారంభించింది. ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు దిశానిర్దేశం చేయడం ప్రారంభించింది. మై చాయిస్, మై ఫ్యూచర్ పేరుతో విద్యార్థుల ప్రతిభ, ఆసక్తులు, వారి భవిష్యత్తు అంచనాలపై నిర్వహించిన సైకోమెట్రిక్ టెస్టు ఫలితాల ఆధారంగా విద్యార్థులను సరైన దిశలో నడిపించే కార్యక్రమాన్ని గురువారం నుంచి అమల్లోకి తెచ్చినట్లు మోడల్ స్కూల్స్ అదనపు డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి వెల్లడించారు. ఐఐటీ మద్రాసు ప్రొఫెసర్లు రూపొందించిన ఈ ప్రత్యేక కార్యాచరణను పైలట్ ప్రాజెక్టుగా 194 మోడల్ స్కూళ్లలోని 18 వేల మంది విద్యార్థులకు వారి భవిష్యత్తుపై అవగాహన కల్పించేందుకు టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి అమల్లోకి తెచ్చిన విద్యాశాఖ ఆయా స్కూళ్లల్లోని మిగతా విద్యార్థులకు త్వరలోనే నిర్వహించేందుకు కసరత్తు ప్రారంభించింది. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వారి భవిష్యత్‌పై మార్గదర్శనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

**దిశ లేని వారికి మార్గదర్శిగా..**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా పేద కుటుంబాలకు చెందిన వారే. వ్యవసాయ పనులు, రోజువారీ కూలీ చేసుకొని బతికే కుటుంబాలకు చెందిన ఆయా విద్యార్థులు ఏ రంగంపై దృష్టి సారించాలో, దానికోసం ఎలాంటి కృషి చేయాలో, అందులో ఎలాంటి భవిష్యత్ ఉంటుందో తెలియదు. వారిని సరైన దిశలో వెళ్లేలా ప్రోత్సహించే వారు తక్కువ. అలాంటి వారెలా ముందుకెళ్లాలి.. తమకున్న ప్రతిభాపాటవాలేంటి? ఏ రంగంలో కృషి చేస్తే సక్సెస్ అవుతామన్న అంశాలపై అవగాహన కల్పించి, వారిని ఆ వైపు ప్రోత్సహించేందుకు 'మై చాయిస్.. మై ఫ్యూచర్'కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమల్లోకి తెచ్చింది. క్రమంగా దీనిని విద్యాశాఖ పరిధిలోని 26 వేల పాఠశాలల్లోని 29 లక్షల మంది విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చే కార్యాచరణను సిద్ధం చేస్తోంది.

**ఇందులో ఏం చేశారంటే..**

వ్యక్తిత్వం, కెరీర్ సంబంధమైన 12 కేటగిరీల్లో 72 ప్రశ్నలతో విద్యార్థులందరికీ సైకోమెట్రిక్ టెస్టు (మై చాయిస్.. మై ఫ్యూచర్) నిర్వహిస్తారు. అందులో ఫలితాల ఆధారంగా ప్రతి విద్యార్థి ఆసక్తుల్ని తెలుసుకుంటారు. మోడల్ స్కూళ్లలో నిర్వహించిన ఈ టెస్టులో.. 27 శాతం మంది బాలురు పోలీసు కావాలని, అగ్రికల్చర్ అండ్ ఫుడ్ రంగంలో స్థిరపడాలని 15 శాతం మంది ఆసక్తి చూపుతున్నట్లు తేలింది. బాలికల్లో అగ్రికల్చర్ అండ్ ఫుడ్ రంగాల్లో స్థిరపడాలని 20 శాతం మంది, మెడిసిన్ అండ్ హెల్త్‌కేర్ వైపు వెళ్లాలని 17 శాతం మంది లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడైంది.

**ఇప్పుడేం చేస్తారంటే...**

ప్రతి విద్యార్థిపై చేసిన సైకోమెట్రిక్ టెస్టు ఆధారంగా ఆ విద్యార్థి ఎంచుకున్న కెరీర్‌కు సరిపడా సామర్థ్యాలుంటే అందుకోసం పాఠశాల స్థాయి నుంచే చేయాల్సిన కృషిని వివరించడం, ఆ రంగంలో పరిస్థితులను తెలపడం, వాటిని ఎదుర్కొని ముందుకు సాగేలా ప్రోత్సహించడం వంటి చర్యలు చేపడతారు. కెరీర్ గైడెన్స్‌పై ప్రత్యేక శిక్షణ పొందిన టీచర్ వారికి ఎప్పటికప్పుడు మార్గదర్శనం చేస్తుంటారు. అయితే ఆసక్తి ఉన్న రంగానికి సరిపడా సామర్థ్యాలు లేకపోతే వాటిని సాధించేలా విద్యార్థికి కౌన్సెలింగ్‌తోపాటు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. దీనిపై విద్యార్థి తల్లిదండ్రుల్లోనూ అవగాహన కల్పించి, అందుకు అనుగుణమైన పరిస్థితులను ఏర్పరచేలా కృషి చేస్తారు. ఇక విద్యార్థికి ప్రభుత్వోద్యోగంపై ఆసక్తి ఉన్నా అతనికి స్కిల్స్ మాత్రం ప్రైవేటు మార్కెటింగ్‌లో రాణించేలా ఉంటే.. వాటిని ఆ విద్యార్థికి వివరించి, ఆ స్కిల్స్, ప్రతిభ ఆధారంగా ఆ రంగంలోకి వెళ్లేలా ప్రోత్సహిస్తామని మోడల్ స్కూల్స్ అదనపు డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి వివరించారు.

## క్లుప్తంగా...

### సంపన్నులకు ఒక న్యాయం.. పేదలకో న్యాయమా?

**'దిశ' ఘటనపై చూపిన శ్రద్ధ లక్ష్మిపై ఎందుకు లేదు: మంద కృష్ణ**



**హన్మకొండ:** మహిళలపై లైంగిక దాడి, హత్య సంఘటనల్లో సంపన్నులకు ఒక న్యాయం.. పేదలకు మరో న్యాయమా అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ప్రశ్నించారు. గురువారం వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 'దిశ'ఘటనపై చూపుతున్న శ్రద్ధ.. అంతకు మూడు రోజుల ముందు జరిగిన లక్ష్మి సంఘటనపై ఎందుకు కనబరచడం లేదని ఆయన ప్రశ్నించారు. ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ పంచాయతీ పరిధిలోని తండాకు చెందిన బుడగ జంగాల సామాజిక వర్గానికి చెందిన లక్ష్మిపై ముగ్గురు లైంగిక దాడికి పాల్పడి హత్య చేశారని, ఆ తర్వాత హైదరాబాద్‌లో 'దిశ' సంఘటన, మధ్యలో హన్మకొండలో మానస సంఘటన జరిగిందన్నారు.

### 'దిశ'పై అసభ్యకర పోస్టు పెట్టిన వ్యక్తిపై కేసు

**జగిత్యాల క్రైం:** శంషాబాద్ శివారులో అత్యాచారం, హత్యకు గురైన దిశపై ఫేస్‌బుక్‌లో అసభ్యకరంగా పోస్టు పెట్టిన జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన కట్ట శివ అలియాస్ శంకుపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫేస్‌బుక్‌లో దిశపై అసభ్యకరంగా పోస్టు చేయడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

### భగీరథ ప్లాంటులో క్లోరిన్ గ్యాస్ లీక్

**9 మందికి అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు**

**రామగుండం:** నీటిని శుద్ధి చేసేందుకు వినియోగించే క్లోరిన్ సిలిండర్‌ను పైపునకు బిగించే వాల్వు లీకవడంతో 9 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటన పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్/బ్రాహ్మణపల్లి శివారులోని మిషన్ భగీరథ ప్లాంటులో గురువారం జరిగింది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వచ్చే నీటిని శుద్ధి చేసేందుకు క్లోరిన్ గ్యాస్‌ను వినియోగిస్తారు. మరో సిలిండర్‌ను ఎలక్ట్రికల్ ఆపరేటెడ్ ట్రావెలింగ్ (ఈఓటీ) క్రేన్ సహాయంతో బిగించే ప్రయత్నం చేస్తుండగా.. వాల్వులో నుంచి క్లోరిన్ లీకైంది.

### మంటల్లో చిక్కుకున్న కారు.. మహిళ సజీవ దహనం

**జహీరాబాద్:** కారు మంటల్లో చిక్కుకోవడంతో ఓ మహిళ సజీవ దహనమైంది. హైదరాబాద్‌కు చెందిన ఉదయ్ కుమార్ భార్య, కుమారులతో కలసి మహారాష్ట్రలోని ఉద్గీర్‌కు వైద్యం కోసం వెళ్లాడు. అక్కడ వైద్యం చేయించుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అయ్యాడు. నిర్జ సమీపంలో 65వ జాతీయ రహదారిపై ఉదయం వీరు ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఉదయ్‌కుమార్ వెంటనే కారును నిలిపి వెనుక సీట్లో ఉన్న కుమారులు జీవన్‌కుమార్, గగన్‌కుమార్‌లను బయటకు తీశాడు. భార్య కల్యాణి (39)ను కూడా బయటకు తీసే ప్రయత్నం చేయగా ఆమె సీటు బెల్టు ధరించి ఉండటంతో సజీవ దహనమైంది.

### రీజనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు 'జయ' విద్యార్థులు



రేవక్ సాయి శ్రీమన్నారాయణ

సూర్యాపేటటౌన్: సూర్యాపేటలోని జయ పాఠశాల విద్యార్థులు పి.రేవక్ సాయి, ఎం.శ్రీమన్నారాయణ రీజనల్ మ్యాథ్స్ ఒలిలింపియాడ్‌కు అర్హత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించిన లెవల్ టూ పోటీల్లో వీరు రీజనల్ ఒలింపియాడ్‌కు ఎంపికైనట్లు చెప్పారు. కాగా, వేణుగోపాల్, డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి విద్యార్థులను అభినందించారు.



## అదిరేట్టు.. 'పంబారట్టు'

జనగామ జిల్లా కేంద్రంలోని బాణాపురం శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పల్లివేట అనంతరం బతుకమ్మ కుంటలో స్వామి వారికి పంబారట్టు (జలక్రీడ) నిర్వహించారు. నీటి కుంటలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అయ్యప్ప స్వామికి పండ్లు, పూలు, పంచామృత కనకాభిషేకాలు నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు పంబారట్టు వేడుకను తిలకించి పులకించి పోయారు. కార్యక్రమంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– జనగామ

# ఊరూరా మహిళా కమిటీలు

- గ్రామస్థాయి నుంచే పటిష్ట వ్యవస్థ
- తాగుబోతెవరో.. తిరుగుబోతెవరో ముందే పోలీసులకు సమాచారం
- వేములవాడలో మంత్రి ఎర్రబెల్లి



వేములవాడలో ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి ఎర్రబెల్లి. చిత్రంలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు

**సిరిసిల్ల:** తెలంగాణలో అరాచక శక్తులను కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన ప్రణాళిక అమలు చేస్తోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలంలో గురువారం ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'దిశ'ఘటన దారుణమైందని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ పటిష్టమైన ప్రణాళిక అమలు చేసేందుకు సిద్ధమయ్యారని వివరించారు. ఊరూరా మహిళా కమిటీలు వేస్తామని, తాగుబోతులు ఎవరు, తిరుగుబోతులు ఎవరో గుర్తించి ముందే పోలీసులకు పట్టిచ్చే విధంగా సీఎం ఆలోచన చేస్తున్నారని చెప్పారు. తమ ప్రభుత్వం మహిళలు, వృద్ధుల గౌరవాన్ని పెంచిందన్నారు. మహిళలకు రూ.50 వేల నుంచి రూ.3 లక్షలకు రుణాలు పెంచారని, ఆసరా పింఛన్లు రూ.200 నుంచి రూ.2,016 పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. స్వశక్తి సంఘాలకు వడ్డీ మాఫీ కోసం రూ.2,196 కోట్లు ప్రభుత్వం చెల్లించిందని ఆయన వివరించారు.

## డ్రోన్‌తో నిఘా

- అసాంఘిక కార్యకలాపాలకు చెక్
- పరకాలలో తొలి ప్రయోగం



డ్రోన్ తీసిన చిత్రం

**పరకాల:** బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం చట్టపరంగా నేరమని తెలిసినా పట్టించుకోకుండా బాటిళ్లకు బాటిళ్లు తాగేస్తున్నారు. విచ్చల విడిగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. అయితే ఇక నుంచి అలాంటి ఆటలు సాగవు. 'దిశ'ఘటనతో వరంగల్ రూరల్ జిల్లా పరకాల పోలీసులు ఆకతాయిల ఆగడాలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంతో పాటు బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించే వారిపై ప్రత్యేక దృష్టి సారించింది. పరకాల ఏసీపీ పి.శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో పట్టణంలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిని కనిపెట్టడానికి డ్రోన్‌ను వినియోగానికి గురువారం శ్రీకారం చుట్టారు. ఆర్టీసీ డిపో సమీప తాటి వనంలో చాలా మంది మద్యం సేవిస్తున్నారనే సమాచారంతో డ్రోన్‌ను తిప్పగా గమనించిన కొందరు అక్కడి నుంచి పరారయ్యారు. డ్రోన్ చూపించిన బహిరంగ ప్రదేశాలకు సీఐ మహేందర్, ఎస్సై రవికిరణ్ పోలీసు సిబ్బందితో బైక్‌లపై చేరుకుని మద్యం తాగే వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

### మహిళా సర్పంచ్ కుల బహిష్కరణ

**మిరుదొడ్డి:** సర్పంచ్ ఎన్నికలకు ముందు తమ కులానికి ఇస్తానన్న డబ్బులు ఏడాది దాటినా ఇవ్వడం లేదని ఆరోపిస్తూ అదే వర్గానికి చెందిన కులస్తులంతా కలసి ఏకంగా మహిళా సర్పంచ్ కుటుంబాన్ని కులం నుంచి బహిష్కరించారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం బేగంపేట సర్పంచ్ పదవిని బీసీ మహిళకు రిజర్వ్ చేశారు. అయితే అక్కడ ఎలాంటి ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని గ్రామస్తులు అప్పట్లో తీర్మానించారు. ఈ మేరకు అనసూయ ను గ్రామస్తులు సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. కాగా సర్పంచ్‌గా అనసూయ ఏకగ్రీవం కావడానికి సహకరిస్తే మహంకాళమ్మ గుడినిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తానని సర్పంచ్ భర్త ప్రతాప్ హామీ ఇచ్చారు. కానీ ఆ సొమ్ము ఇప్పటి వరకు ఇవ్వడం లేదని అదే వర్గానికి చెందిన కులస్తులు గురువారం ఒక చోట సమావేశమయ్యారు. సర్పంచ్ అనసూయ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేస్తున్నట్లు తీర్మానించారు.

## ముంచెత్తిన మురుగునీరు

- డ్రైనేజీలో ఇరుక్కుపోయిన కార్మికుడు
- శ్వాస ఆడక గంటపాటు నరకయాతన
- రోడ్డును తవ్వి రక్షించిన తోటి కార్మికులు
- ఊపిరి పీల్చుకున్న జనం



డ్రైనేజీలో ఇరుక్కున్న గంగాధర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం. (ఇన్‌సెట్‌లో గంగాధర్)

**చంద్రశేఖర్ కాలనీ:** వరద నీరు వెళ్లేందుకు నిర్మించిన డ్రైనేజీలో చెత్తను తొలగించేందుకు దిగిన ఓ పారిశుద్ధ్య కార్మికుడు అందులో చిక్కుకుపోయాడు. సరిగా శ్వాస ఆడక గంటపాటు విలవిల్లాడాడు. స్థానికులు సకాలంలో స్పందించడంతో అతను ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఈ ఘటన గురువారం నిజామాబాద్‌లో చోటుచేసుకుంది. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వర్ని రోడ్డులో దశాబ్దాల క్రితం స్టాామ్ వాటర్ డ్రైనేజీ నిర్మించారు. కోటగల్లి పరిసర ప్రాంతాలకు చెందిన మురుగునీరు ఈ డ్రైనేజీ ద్వారానే పూలాంగ్ వాగులోకి వెళుతోంది. అయితే, డ్రైనేజీలో చెత్త పేరుకు పోవడంతో మురుగు నీరు నిలిచి పోయింది. ఆ చెత్తను తొలగించేందుకు కార్పొరేషన్ సిబ్బంది గురువారం ప్రయత్నించారు. రోడ్డు కింద నిర్మించిన డ్రైనేజీ లోపలికి వెళ్లిన తాత్కాలిక పారిశుద్ధ్య కార్మికుడు గంగాధర్ (35) కర్ర సాయంతో చెత్తను తొలగిస్తుండగా, మురుగు నీరు ఒక్కసారిగా ముంచెత్తింది. ఈ క్రమంలో గంగాధర్ కుడి చేయి కేబుల్ పైపులైన్లలో చిక్కుకోవడంతో అతడు డ్రైనేజీలో ఉండిపోయాడు. శ్వాస సరిగా ఆడక విలవిల్లాడాడు. ఇది గమనించిన మరో కార్మికుడు ఉన్నతాధికారులకు సమాచారమిచ్చాడు. మరోవైపు గంగాధర్‌కు శ్వాస ఆడేందుకు ముందు జాగ్రత్తగా స్థానికులు నీటి పైపును అందించారు. అనంతరం జేసీబీతో రోడ్డును తవ్వి డ్రైనేజీ నీటిని వేరే వైపు మళ్లించారు. గంట పాటు డ్రైనేజీలో ఇరుక్కుని తల్లడిల్లిన గంగాధర్‌ను తోటి కార్మికులు బయటకు తీసి, ఆస్పత్రికి తరలించారు. గంగాధర్ ఎలాంటి ప్రమాదం లేదని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సాజిద్ అలీ తెలిపారు.

## బాలికపై మారుతండ్రి అఘాయిత్యం

**రెండేళ్లుగా అత్యాచారం.. నిందితుడి అరెస్టు**

**సూర్యాపేట క్రైం :** దిశ ఘటనను మరువక ముందే సూర్యాపేట జిల్లా కేంద్రంలో మరో దారుణం వెలుగుచూసింది. బాలికపై మారుతండ్రి రెండేళ్లుగా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం సూర్యాపేటలో వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేటలోని గొల్లబజారులో నివాసముంటున్న మోతె శారదకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. శారద భర్త పన్నెండేళ్ల క్రితమే మృతి చెందాడు. ఈ క్రమంలో చివ్వెంల మండలం మున్యానాయక్ తండాకు చెందిన బానోతు శ్రీనుతో ఆమెకు పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఇద్దరు వివాహం చేసుకున్నారు. పదేళ్లుగా శారదతో ఉంటున్న శ్రీను.. కుమార్తె వరుస అయిన బాలిక (16)పై కన్ను వేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమెపై అత్యాచారానికి పాల్పడుతున్నాడు. ఈ నెల ఒకటవ తేదీన శారద కూలి పనికి వెళ్లింది. ఇంట్లోనే ఉన్న శ్రీను ఆ బాలికపై అత్యాచారానికి దిగాడు. సాయంత్రం శారద ఇంటికి వచ్చి చూడగా బాలిక రోదిస్తూ కనిపించింది. ఏమైందని అడగ్గా జరిగిన విషయం చెప్పడంతో శారద పోలీసులకు ఫిర్యాదు చేసింది. గురువారం నిందితుడిని అరెస్టు చేశారు. బాలికను సఖి కేంద్రానికి పంపించారు.

### జపాన్‌తో ఐఐటీహెచ్ ఒప్పందం

**భూకంపాలపై పరిశోధనలకు 4 విద్యాసంస్థలతో ఎంఓయూ**

**సాక్షి, సంగారెడ్డి:** భూకంపాలపై విస్తృత పరిశోధనలకోసం జపాన్‌లోని విద్యాసంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీహెచ్) డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి తెలిపారు. ఈ మేరకు ఐఐటీ హైదరాబాద్ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇటీవల జపాన్‌లో పర్యటించిన సందర్భంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెటీరియల్ సైన్స్ ప్రెసిడెంట్ కాజుహితి హషిమోటోతో ఈ ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. 'జపనీస్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆన్ ఎర్త్‌క్వేక్ ఇంజనీరింగ్, డాక్టోరల్ ప్రోగ్రామ్స్‌లో పరస్పర సహకారం ఒప్పందంలో భాగమన్నారు.

### 100'కు ఫోన్.. 10 నిమిషాల్లోనే కాపాడిన పోలీసులు

**కరీమాబాద్:** ఓ యువతి రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేసుకుంటున్నట్లు 'డయల్ 100'కు కాల్ వచ్చింది. రంగంలోకి దిగిన పోలీసులు.. కేవలం పది నిమిషాల్లో ఆమెను రక్షించారు. ఈ ఘటన వరంగల్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. జీఆర్‌పీ పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ రూరల్ జిల్లా శాయంపేట నియోజకవర్గం మాందారిపేటకు చెందిన మమత (24) తాను వరంగల్ రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు బంధువులకు కాల్ చేసింది. అయితే మమత ఫోన్ కాల్ స్వీకరించిన వ్యక్తి.. రాత్రి 7.53 గంటలకు 100 నంబర్‌కు డయల్ చేసి విషయం చెప్పాడు. దీంతో అప్రమత్తమైన మిల్స్‌కాలనీ, ఇంతెజార్‌గంజ్, జీఆర్‌పీ పోలీసులతో పాటు బ్లూకోట్స్ పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడ్డారు. మమత రైల్వేస్టేషన్‌లో విజయవాడ వైపు ఉన్న ట్రాక్ చివర పొదల్లో దాగి ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. ఆమెను కాపాడారు. అనంతరం ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కుటుంబ సమస్యల కారణంగా యువతి ఆత్మహత్య చేసుకోవడానికి నిర్ణయించుకుందని, ఆమెను తన అక్కా బావలకు అప్పగించినట్లు చెప్పారు. ఈ విషయమై వరంగల్ ఏసీపీ ఎస్ఎస్.పాణి మాట్లాడుతూ డయల్ 100 కాల్ రాగానే 10 నిమిషాలలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువతి మమతను రక్షించినట్లు తెలిపారు.

## యాదాద్రిలో వేంచేపు మండపం పూర్తి

**పూర్తికావస్తున్న బ్రహ్మోత్సవ మండపం**

**యాదగిరి గుట్ట :**యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్‌నిర్మాణంలో భాగంగా పడమటి మహా రాజగోపురం ఎదురుగా నిర్మిస్తున్న వేంచేపు మండపం పనులు పూర్తయ్యాయి. తూర్పు రాజగోపురం వైపు నిర్మిస్తున్న బ్రహ్మోత్సవ మండపం సైతం పూర్తి కావొస్తోంది. మరో రెండు, మూడు రోజుల్లో ఈ పనులు కూడా పూర్తవుతాయని శిల్పులు పేర్కొన్నారు. ఇప్పటికే తూర్పు, పడమర, దక్షిణ రాజగోపురాల ప్రాంతాల్లో ఫ్లోరింగ్ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఉత్తర రాజగోపురం వైపు ఫ్లోరింగ్ వేయడానికి స్టీల్, కంకర పరిచే పనులు చేస్తున్నారు.

**ఆలయ నిర్మాణ పనుల పరిశీలన**

ఆలయం పనులను వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఆర్కిటెక్ట్ ఆనందసాయి, స్థపతి ఆనంద వేలు గురువారం పరిశీలించారు. ప్రధాన ఆలయంలో జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు సాంకేతిక నిపుణుల కమిటీ సభ్యుడు బీఎల్ఎన్ రెడ్డి కూడా ఆలయాన్ని పరిశీలించారు. మాడ వీధుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రతలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిర్ణీత సమయానికి ప్రధాన ఆలయం పనులు పూర్తి చేయాలన్నారు.

**7న మస్కట్‌లో యాదాద్రీశుడి కల్యాణం**

ఈ నెల 7వ తేదీన మస్కట్‌లోని దార్‌సెట్ శ్రీకృష్ణ ఆలయంలో ఒమన్ తెలంగాణ సమితి ఆధ్వర్యంలో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఆచార్యులు గురువారం తెలిపారు. ఇందుకోసం యాదాద్రి దేవస్థానం ఆలయ ఆచార్యులు మస్కట్‌కు బయల్దేరారు.


**రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం**

**ప్రకటన**

**న్యూఢిల్లీ, 30 అక్టోబర్, 2019**

**S.O. 3929(E) :-** జాతీయ రహదారుల చట్టం, 1956 (48 ఆఫ్ 1956)లోని సెక్షను 3ఎలోని సబ్–సెక్షన్ (1) (ఇకమీదట చట్టంగా నిర్దేశించబడును) ద్వారా సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాలో కి.మీ 157.707 నుండి కి.మీ 187.723 వరకు (రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కార్యాలయం మిర్యాలగూడ) వరకు భూమి స్ట్రెచ్‌లో జాతీయ రహదారి నం.167 నిర్మాణం (వెడల్పు చేయుట/ పేవ్డ్ షోల్డర్‌తో రెండు లేన్/ నాలుగు లేనింగ్ మొ॥) నిర్వహణ, మేనేజ్‌మెంట్ మరియు ఆపరేషన్ కోసం షెడ్యూలులో ఇవ్వబడిన సంక్షిప్త వివరణగల భూమి ప్రజోపయోగార్థం కావలసివున్నదని సంతృప్తి చెందిన తర్వాత సదరు అవసరానికి సదరు భూసేకరణకు తన ఉద్దేశాన్ని ఇందుమూలంగా ప్రకటిస్తోంది.

సదరు భూమిలో ప్రయోజనం గల ఏ వ్యక్తి అయినా అధికారిక గెజిట్‌లో ఈ ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి 21 రోజులలోగా సదరు చట్టంలోని సెక్షన్ 3(సి)లోని సబ్ సెక్షన్ (1) క్రింద పైన తెలిపిన అవసరార్థం సదరు భూమి ఉపయోగానికి ఆక్షేపణ తెలియచేయవచ్చును.

అట్టి ప్రతి ఆక్షేపణ సమర్థప్రాధికారికి అంటే రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మిర్యాలగూడ వారికి వ్రాతపూర్వకముగా దానికి గల కారణాలతో తెలియచేయవలెను మరియు సమర్థప్రాధికారి ఆక్షేపణదారుకు స్వయంగా లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా విచారించబడేందుకు అవకాశం కల్పిస్తారు మరియు అట్టి ఆక్షేపణలన్నీ విచారించిన తర్వాత మరియు సమర్థప్రాధికారి అవసరమని భావిస్తే తదుపరి విచారణ జరిపిన తర్వాత ఆక్షేపణలను అనుమతిస్తూ లేదా అనుమతించకుండా ఉత్తర్వు జారీ చేస్తారు.

సదరు చట్టంలోని సెక్షన్ 3సిలోని సబ్ సెక్షన్ (2) క్రింద సమర్థప్రాధికారిచే చేయబడే ఏ ఉత్తర్వు అయినా తుదిగా ఉంటుంది. తమ ప్రకటన క్రింద సేకరించబడే భూమి యొక్క భూమి ప్లాన్లు మరియు భూమి ఇతర వివరాలు సమర్థప్రాధికారి యొక్క పైన తెలిపిన కార్యాలయంలో లభిస్తాయి మరియు ఆసక్తిగల వ్యక్తులు తనిఖీ చేసుకోవచ్చును.

**షెడ్యూలు**

తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాలో NH 167 (రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కార్యాలయం మిర్యాలగూడ) నుండి భూమి స్ట్రెచ్‌లో NH-167 పరిధిలోకి వచ్చే కట్టడాలతో లేదా కట్టడాలు లేకుండా సేకరించబడే భూమి సంక్షిప్త వివరణ.

రాష్ట్రం: తెలంగాణ జిల్లా: నల్గొండ

| క్ర. సం. | సర్వే/ ప్లాట్ నంబర్ | భూమి రకం | భూమి స్వభావం | విస్తీర్ణం (స్థానిక యూనిట్‌లో) (చ.మీ) | విస్తీర్ణం (హెక్టార్లలో) |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| తాలూకా: అనుముల | | | | | గ్రామం: ఇబ్రహీంపేట |
| 1. | 191 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 3,844.8020000 | 0.3844800 |
| 2. | 181 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 303.5370000 | 0.0303537 |
| 3. | 197 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 202.3580000 | 0.0202358 |
| 4. | 148 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 50.5900000 | 0.0050590 |
| 5. | 204 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 50.5890000 | 0.0050589 |
| 6. | 180 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 1,315.3270000 | 0.1315330 |
| 7. | 192 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 101.1790000 | 0.0101179 |
| 8. | 194 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 1,416.5060000 | 0.1416510 |
| 9. | 198 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 2,023.5800000 | 0.2023580 |
| 10. | 147 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 15.0480000 | 0.0015048 |
| 11. | 178 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 2,630.6540000 | 0.2630650 |
| 12. | 193 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 11,230.2610000 | 1.1230300 |
| 13. | గ్రామం | ప్రభుత్వం | వ్యవసాయం | 101.1790000 | 0.0101179 |
| 14. | గ్రామం | ప్రభుత్వం | వ్యవసాయం | 25.0800000 | 0.0025080 |
| 15. | గ్రామం | ప్రభుత్వం | వ్యవసాయం | 202.3580000 | 0.0202358 |
| 16. | గ్రామం | ప్రభుత్వం | వ్యవసాయం | 151.7680000 | 0.0151768 |
| తాలూకా : మిర్యాలగూడ | | | | | గ్రామం : తుంగ పహాడ్ |
| 1. | 212 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 83.6000000 | 0.0083600 |
| 2. | 218 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 297.6630000 | 0.0297663 |
| తాలూకా : నిడమనూర్ | | | | | గ్రామం : నిడమనూర్ |
| 1. | 40 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 1,020.1000000 | 0.1020100 |
| 2. | 157 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 44.3080000 | 0.0044308 |
| 3. | 24 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 95.3040000 | 0.0095304 |
| 4. | 155 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 210.7180000 | 0.0210718 |
| 5. | 158 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 45.9800000 | 0.0045980 |
| 6. | 22 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 214.8990000 | 0.0214899 |
| 7. | 28 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 107.1790000 | 0.0107179 |
| 8. | 42 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 124.5870000 | 0.0124587 |
| 9. | 162 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 110.3750000 | 0.0110375 |
| 10. | 164 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 30.0960000 | 0.0030096 |
| 11. | 165 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 429.7960000 | 0.0429796 |
| 12. | 166 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట కమర్షియల్ | 36.7840000 | 0.0036784 |
| 13. | 167 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 25.0800000 | 0.0025080 |
| 14. | 2 | ప్రైవేట్ (పట్టా) | మాగాణి (వ్యవసాయ భూమి) | 15.8840000 | 0.0015884 |
| 15. | 29 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 10.0320000 | 0.0010032 |
| 16. | 37 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 234.1260000 | 0.0234126 |
| 17. | 38 | ప్రైవేట్ (పట్టా) | మెట్ట (వ్యవసాయ భూమి) | 45.1440000 | 0.0045144 |
| 18. | 41 | ప్రభుత్వ | వ్యవసాయ | 1,466.6660000 | 0.1466670 |
| 19. | 59 | ప్రభుత్వ | వ్యవసాయ | 352.0250000 | 0.0352025 |
| 20. | గ్రామం | ప్రభుత్వ | కమర్షియల్ | 101.1790000 | 0.0101179 |
| 21. | గ్రామం | ప్రభుత్వ | కమర్షియల్ | 35.1120000 | 0.0035112 |
| 22. | గ్రామం | ప్రభుత్వ | వ్యవసాయ | 132.1110000 | 0.0132111 |
| 23. | గ్రామం | ప్రభుత్వ | వ్యవసాయ | 28.4240000 | 0.0028424 |
| | | | మొత్తం | 28,961.9880 | 2.8962 |

**[F.No.NH-167/TS-2017-18-44/3A]**
**రాజేష్ గుప్తా, డిప్యూటీ సెక్రటరీ.,**



తెలంగాణ ప్రభుత్వం
**రహదారులు మరియు భవనముల శాఖ**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

**"e"NIT No.112 to 115/SE/R&B/Elec/Hyd/2019-2020,** తేది: 05.12.2019

పనుల సంఖ్య (4). పనుల పేరు: సెంట్రల్ లైట్లు కొనుగోలు చేయుట, సరఫరా మరియు బిగించుట, రోడ్డుకు ఇరువైపులా సైడ్ లైటింగ్ ఏర్పాటు చేయుట. మొత్తం ECV: రూ. 96.88 లక్షలు. టెండరు స్వీకరణకు ఆఖరు తేది/సమయం: 20.12.2019న మ.1.00 గం. బ్రైబ్యాక్ ప్రాతిపదికపై పాత DG సెట్ రీప్లేస్‌మెంట్ చేస్తూ కొత్త 250KVA DG సెట్ ఏర్పాటు చేయుట, విద్యుత్ స్థాపనలకు ప్రత్యేక మరమ్మతులు మొత్తం ECV: రూ. 26.70 లక్షలు. టెండరు స్వీకరణకు ఆఖరు తేది: 13.12.2019న మ.1.00 గం. కోసం దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ tender.telangana.gov.inలో చూడవచ్చును సంప్రదించు సెల్ నెం. 9440818170.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, R&B ఎలక్ట్రికల్ సర్కిల్, హైదరాబాద్

DIPR Ro.No.1862-DP/CL/Advt/1/2019-20, Dt: 05.12.2019



తెలంగాణ ప్రభుత్వం
**అటవీ శాఖ**

Rc. No.276/2019/D1 ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది :03-12-2019

పనుల పేరు: WLM కిన్నెరసాని, మణుగూరు, భద్రాచలం మరియు ఎల్లందు వద్ద నాలుగు (4) ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ క్వార్టర్స్ నిర్మాణం కోసం దిగువ సంతకందారుచే బిడ్లు కోరబడుచున్నవి. పనుల సంఖ్య : 4. మొత్తం ECV: రూ. 1.08 కోట్లు. బిడ్ దాఖలు ప్రారంభ తేది & సమయం : 09-12-2019న ఉ. 10.30 గంటలకు. బిడ్ దాఖలు ముగింపు తేది & సమయం : 30-12-2019న మ. 3.00 గంటలకు. తెరుచు తేది : 30-12-2019న మ. 3.10 గంటలకు. తదుపరి వివరాలను www.eprocurement.gov.in వద్ద 'e' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో చూడవచ్చును. ఫోన్ నంబరు 08744-295050.

సం/- జిల్లా అటవీ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

DIPR RO. No.1863-DP/CL/ADVT/1/2019-20, Dt: 05-12-2019



**AP CAPITAL REGION DEVELOPMENT AUTHORITY**
Lenin Centre, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

**E PROCUREMENT TENDER NOTICE**

**NIT No. 17/PROC (19) /MAU 61 - USI0HB (BG) / 35 / 2019 APCRDA** **Dated: 05-12-2019**

**Name of Work:** APCRDA-"Balance work of "Construction of Amaravati **"HAPPY NEST"** Residential Housing Project Consisting of Total 1200 Apartment units in 12 towers of G + 18 Floors Pattern with Sub Structure, RC wall Super Structure using shear wall technique with Aluminum form work, Podium, Architectural Finishes, Internal & External Electrical, Plumbing& Sanitary, Landscape, Fire Fighting, Lifts, DG Sets , HVAC, Security Systems, External development and LPG on Item Wise basis (Design Built) including Three (3) Years Defect Liability Period near, Nelapadu, Amaravati, Andhra Pradesh" - Tender cum E-Auction (Reverse Tendering). **Estimate Value of Rs. 656.44 Crores.** The bid can be downloaded on AP e-procurement portal **from 07-12-2019 to 24-12-2019 up to 14:00 Hrs.** Due date for submission of bid **24-12-2019 @ 15.00 Hrs.** Technical bid opening **24-12-2019 @ 16:00 Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** or **www.crda.ap.gov.in** for details.

Sd/- Commissioner, APCRDA



తెలంగాణ ప్రభుత్వం
**తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ**
సంక్షిప్త టెండరు ప్రకటన

**Rc.No.Academics/Sports/17532/TMREIS/2019** **తేది: 05.12.2019**

TMREI సొసైటీ **"ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్–2020"** నిర్వహిస్తున్న దృష్ట్యా, GMC బాలయోగి స్టేడియం, గచ్చిబౌలి, హైదరాబాద్ వద్ద 2 నుండి 7 జనవరి–2020 వరకు 5000 నం.ల పార్టిసిపెంట్స్ కోసం **బ్రేక్‌ఫాస్ట్, లంచ్** మరియు **డిన్నర్** కోసం ఇన్–హౌస్ ఏర్పాట్లతో కేటరింగ్ మరియు సరఫరా చేయుటకు గత స్పోర్ట్స్ మీట్స్/ లీగ్స్‌లో రెసిడెన్షియల్ సొసైటీలకు ఇన్–హౌస్ ఏర్పాట్లతో ఆహార పదార్థాలను కేటరింగ్ మరియు సరఫరా చేయుటలో కనీసం 3 సంవత్సరాల ఇదేతరహా అనుభవంగల అర్హతగల కేటరర్స్/ ఏజెన్సీలు/ సొసైటీలు/ NGOs/ వాలంటరీ సంస్థల నుండి రెండు భాగాల (సాంకేతిక బిడ్ మరియు ఆర్థిక బిడ్)లో TMREI సొసైటీ ఇ- టెండర్లు కోరుతోంది. ఇందునిమిత్తం ఇ-టెండర్ 06.12.2019 నుండి 13.12.2019 వరకు **https://tender.telangana.gov.in** వెబ్‌సైట్‌లో లభ్యమగును. 1) ఇ-టెండరు ప్రచురణ తేది: **06.12.2019.** 2) ప్రి- బిడ్ సమావేశం తేది: **09.12.2019 మ.03.గం.కు.** 3) ఇ-టెండర్ల దాఖలుకు చివరి తేది: **13.12.2019 సా. 05.గం.కు.** 4) సాంకేతిక బిడ్లు తెరుచుట: **16.12.2019 మ.03.గం.కు.** 5) ఆర్థిక బిడ్లు తెరుచుట: **17.12.2019 మ.03.గం.కు.**

DIPR RO.No.526-PP/CL/Advt/1/2019-20, Dt: 05.12.2019 సం/- సెక్రటరీ, TMREIS


గురువారం ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి బాధితురాలిని తీసుకొస్తున్న దృశ్యం

# ఆరని మంటలు

- అత్యాచార బాధితురాలి సజీవ దహనానికి యత్నం
- యూపీలో దారుణం • మంటల్లో కాలిపోతూనే పోలీసులకు ఫోన్
- 90 శాతం గాయాలతో ఆస్పత్రిలో మృత్యుపోరాటం • నిందితుల అరెస్టు

> యూపీలో శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని కేంద్ర హోంమంత్రి, యూపీ సీఎం నిన్న అబద్ధమాడారు. నిత్యం ఇలాంటి ఘటనలను చూస్తుండటం ఆగ్రహం తెప్పిస్తోంది. - ట్విట్టర్‌లో ప్రియాంకా గాంధీ

**లక్నో/న్యూఢిల్లీ:** 'దిశ' ఘటనపై దేశవ్యాప్తంగా జనాగ్రహం వెల్లువెత్తుతున్నా నేరగాళ్ల ఆగడాలకు అంతులేకుండాపోతోంది. కోర్టు కేసుకు హాజరయ్యేందుకు వెళ్తున్న అత్యాచార బాధితురాలిని సజీవంగా దహనం చేసేందుకు ప్రయత్నించారు. తీవ్రంగా కాలిన గాయాలతో ఆమె మృత్యువుతో పోరాడుతోంది. ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లాలో గురువారం ఈ దారుణం జరిగింది. రాయ్‌బరేలీ కోర్టులో విచారణకు హాజరయ్యేందుకు వెళ్తున్న ఉన్నావ్ అత్యాచార బాధితురాలిపై గురువారం వేకువజామున దుండగులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. అగ్నికీలలు దహించి వేస్తుండగానే రక్షించాలంటూ ఆమె దాదాపు కిలోమీటరు దూరం పరుగులు పెట్టారు. చివరకు బాధితురాలే 112 నంబర్‌కు పోలీసులకూ ఫోన్ చేసింది. ఆమె ఫోన్ చేసిన తర్వాతే అంబులెన్స్ ఘటనాస్థలానికి చేరుకొంది. 90 శాతం కాలిన గాయాలతో ఉన్న ఆమెను ప్రభుత్వం ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి ఎయిర్ అంబులెన్స్‌లో తరలించింది. బాధితురాలి వాంగ్మూలం మేరకు పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. నిందితుల్లో ఒకరు..ఏడాది క్రితం ఆమెను రేప్ చేసి, అరెస్టయి, ప్రస్తుతం బెయిల్‌పై వచ్చిన వ్యక్తి కావడం గమనార్హం.

**బాధితురాలి పరిస్థితి విషమం**

బాధితురాలిని మొదట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు, తర్వాత జిల్లా ఆస్పత్రికి, ఉదయం పదింటికి లక్నో ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్లు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ అశుతోష్ దుబే చెప్పారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం యూపీ ప్రభుత్వం ఎయిర్ అంబులెన్స్‌లో ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించింది. ఆమెను సత్వరమే ఆస్పత్రిలో చేర్పించేందుకు వీలుగా అధికారులు లక్నో ఆస్పత్రి– అమౌసీ ఎయిర్‌పోర్టు, ఢిల్లీ ఎయిర్‌పోర్టు– సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి మార్గాల్లో గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేశారు. గత ఏడాది డిసెంబర్‌లో తనపై జరిగిన అత్యాచారం కేసులో రాయ్‌బరేలీ కోర్టులో విచారణకు హాజరయ్యేందుకు వెళ్తుండగా ఈ ఘోరం జరిగినట్లు సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ దయాశంకర్ ఎదుట బాధితురాలు వాంగ్మూలమిచ్చారు. 4.30 గంటలపుడు తన ఇంటి దగ్గర్లోని గౌరా మలుపు వద్ద హరిశంకర్ త్రివేది, రామ్‌కిశోర్ త్రివేది, ఉమేష్ బాజ్‌పాయ్, శివం త్రివేది, శుభం త్రివేదిలు పెట్రోల్ పోసి నిప్పు అంటించినట్లు పేర్కొన్నారు. వీరిలో శివం, శుభం 2018 డిసెంబర్‌లో తనపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆమె ఆరోపించగా ఈ ఏడాది మార్చిలో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిందితుల్లో ఒకరు పరారీలో ఉండగా మరొకరు నవంబర్ 25న బెయిల్‌పై బయటకు వచ్చారు.

**ఖండించిన రాజ్యసభ**

ఉన్నావ్ రేప్ బాధితురాలిపై జరిగిన దాడి ఘటన రాజ్యసభలో దుమారం రేపింది. గురువారం రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యుల నిరసనలతో అరగంటపాటు వాయిదాపడింది. ఈ ఘటనను రాజ్యసభ చైర్మన్ వెంకయ్య ఖండించారు. 'యూపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నా. నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా సరైన చర్యలుతీసుకోవాలి' అని అన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతోన్న హింసకు సంబంధించిన వివరాలను అందించాల్సిందిగా జాతీయ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ రేఖా శర్మ రాష్ట్ర డీజీపీకి లేఖ రాశారు. ఈ ఘటనపై వెంటనే నివేదిక అందించాలని, బాధితురాలికి సరైన వైద్యం అందించాలని యూపీ సీఎం ఆదిత్యనాథ్ అధికారులను ఆదేశించారు. ఉన్నావ్ బాధితురాలిపై హత్యాయత్నంపై 12వేల మంది ట్విట్టర్‌లో ఆగ్రహం వెలిబుచ్చారు. రేపిస్టులు బెయిలుపై దర్జాగా తిరగడాన్ని కొందరు తప్పుబట్టారు.


ఘటనాస్థలి వద్ద ఆధారాల సేకరణ

## క్లుప్తంగా...

### 'సూడాన్' బాధితుల్లో తమిళులే అధికం

**ఖార్టోమ్:** సూడాన్ రాజధాని ఖార్టోమ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో తప్పిపోయిన, గాయపడిన వారిలో తమిళులు, బిహారీలే ఎక్కువ మంది ఉన్నారని అక్కడి భారత ఎంబసీ వెల్లడించింది. తప్పిపోయిన, గాయపడిన వారిలో తమిళనాడుకు చెందిన వారు ఆరుగురు, బిహార్‌కు చెందిన వారు ఐదుగురు, రాజస్తాన్‌కు చెందిన వారు నలుగురు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు నలుగురు, హరియాణాకు చెందిన వారు ఇద్దరు, ఢిల్లీ, గుజరాత్‌ల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారని పేర్కొంది. ఎల్పీజీ ట్యాంకర్ పేలిన కారణంగా బహ్రీ ఏరియాలోని షీలా సిరామిక్ ఫ్యాక్టరీలో మంగళవారం ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 18 మంది భారతీయులు మృతిచెందారు.

### 9న సభకు పౌరసత్వ బిల్లు

**న్యూఢిల్లీ:** వివాదాస్పద పౌరసత్వ (సవరణ) బిల్లును ప్రభుత్వం ఈ నెల 9వ తేదీన లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. ఆ మరునాడే సభలో బిల్లుపై చర్చ, ఓటింగ్ జరగనుంది. గురువారం వివిధ పార్టీల నేతలతో జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ప్రభుత్వం ఈ విషయం వెల్లడించింది. గతంలో మాదిరిగా కొన్ని ఎన్డీయేతర పార్టీల మద్దతుతో రాజ్యసభలో కూడా బిల్లు గట్టెక్కుతుందని ప్రభుత్వం నమ్మకంతో ఉంది. పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్ తదితర పొరుగుదేశాల నుంచి మత వివక్ష కారణంగా వలస వచ్చిన ముస్లిమేతరులకు పౌరసత్వం కల్పించడమే లక్ష్యంగా రూపొందించిన ఈ బిల్లును కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదించింది.

### క్విజ్‌లో గెలవండి.. ప్రధానితో చర్చించండి

**న్యూఢిల్లీ:** పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రిపేర్ కావాలని ప్రధాని మోదీ సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు ప్రధాని మోదీ నిర్వహిస్తున్న 'పరీక్షపై చర్చ–2020' కార్యక్రమానికి సంబంధించి ఓ క్విజ్ పోటీని ఆయన ప్రకటించారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినవారిని ఎంపిక చేసి మోదీ నిర్వహించే పరీక్షపై చర్చా కార్యక్రమానికి పంపిస్తారు. ఈ క్విజ్ కాంపిటీషన్‌కి సంబంధించిన లింక్‌ను మోదీ తన ట్విట్టర్ ఖాతాలో షేర్ చేశారు. వచ్చే ఏడాది మొదట్లో జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు 9 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు.

### వాట్సాప్ నుంచి కశ్మీరీల తొలగింపు

**శ్రీనగర్:** ప్రముఖ సామాజిక మాధ్యమం వాట్సాప్ గ్రూపుల నుంచి కశ్మీర్ వినియోగదారులు తొలగిపోతున్నారు. కశ్మీర్ లోయలో గత 4 నెలలుగా ఇంటర్నెట్ సేవలు నిలిపివేయడంతో ఇలాంటి పరిస్థితి నెలకొంది. చాలా రోజులుగా వాట్సాప్ అకౌంట్‌ను వాడకపోవడంతో కశ్మీరీలు గ్రూప్‌ల నుంచి తొలగిపోతున్నారని వాట్సాప్ స్పష్టం చేసింది. డీ యాక్టివేట్ అయిన 30 రోజుల్లోగా వినియోగదారులు వాట్సాప్ ఖాతాలను పునరుద్ధరించుకోకపోతే వారికి సంబంధించిన డేటా, ఫొటోలు, వీడియోలు, చాట్ వివరాలన్నీ కోల్పోయే అవకాశం ఉందని పేర్కొంది.


గురువారం మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఉన్న రైల్వే స్టాఫ్ రూమ్‌లో వాలిన తెల్లని గుడ్లగూబను సంరక్షిస్తున్న ఓ రైల్వే ఉద్యోగి

# లోక్‌సభనూ తాకిన ఉల్లి ఘాటు

- కిలో రూ.150కి చేరిన ధర
- నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలకు చిదంబరం కౌంటర్
- పార్లమెంటులో కాంగ్రెస్ నిరసన

**న్యూఢిల్లీ:** ఉల్లి కొయ్యకుండానే కంట కన్నీరు తెప్పిస్తోంది. నిరుపేదలకు ఏమున్నా లేకపోయినా గంజన్నం, ఉల్లిపాయ ముక్క ఉంటే చాలు. అదే పంచభక్ష్య పరమాన్నాలతో సమానం. కానీ దేశంలోని చాలా ప్రాంతాల్లో కిలో ఏకంగా రూ.150 కి చేరుకుంది. దీంతో విపక్షాలు ఈ అంశాన్ని లోక్‌సభలో లేవనెత్తాయి. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సుదీప్ బంద్యోపాధ్యాయ జీరో అవర్‌లో ఉల్లిపాయ ధరల అంశాన్ని లేవనెత్తారు. అక్రమ నిల్వల కారణంగా ఉల్లి ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, కేంద్రం దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు పార్లమెంటు ఆవరణలో కాంగ్రెస్ ఎంపీలు చిదంబరం, అధీర్ చౌదరి, గౌరవ్ గొగోయ్ ఇతర కాంగ్రెస్ నాయకులు ఉల్లి ధరలపై నిరసనకు దిగారు. నిరుపేదలు నిత్యం ఆహారంలో వాడే ఉల్లి ధరల్ని తగ్గించడానికి కేంద్రమే చర్యలు తీసుకోవాలని ఎంపీలు డిమాండ్ చేశారు.

**నేను ఉల్లిపాయలు ఎక్కువగా తినను: నిర్మలా సీతారామన్**

అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోతున్న ఉల్లి ధరల్ని ప్రస్తావిస్తూ ఒక ఎంపీ మీరు ఉల్లిపాయలు తింటారా అన్న ప్రశ్నకు నిర్మలా సీతారామన్ 'నేను ఉల్లి, వెల్లుల్లి ఎక్కువగా తినను. అందుకే ఎవరూ పెద్దగా విచారించాల్సిన పని లేదు' అని అన్నారు. దీంతో విపక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశాయి. వెంటనే ఆమె తనను తాను సరిదిద్దుకొని ఉల్లి ధరలకు కేంద్రం పలు చర్యలు తీసుకుందని, ఎగుమతులకు అడ్డుకట్టవేసి దిగుమతుల్ని పెంచుతోందని వెల్లడించారు. టర్కీ, ఈజిప్టుల నుంచి కేంద్రం ఉల్లిపాయల్ని దిగుమతి చేస్తోందని తెలిపారు.


పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ సభ్యులు

**సీతారామన్‌పై సెటైర్లు**

సీతారామన్ ఉల్లిపాయలకు బదులుగా అవకోడాలు తింటారా అని కాంగ్రెస్ నేత చిదంబరం ప్రశ్నిస్తే అటు సామాజిక మాధ్యమాల్లోనూ సెటైర్లు హోరెత్తిపోతున్నాయి. ట్విట్టర్‌లో ఉల్లి ధరలు 9,793 ట్వీట్లతో ట్రెండింగ్‌లో ఉంటే, అందులో నిర్మలా సీతారామన్ హ్యాష్‌ట్యాగ్‌తో 7,990 ట్వీట్లు ఉన్నాయి. ఢిల్లీలో వాయు కాలుష్యం ఎక్కువగా ఉంది అని అంటే , నేను గాలి అంతగా పీల్చను అని మీరు సమాధానమిస్తారా అంటూ కేంద్ర మంత్రిపై నెటిజన్లు వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు. మార్కెట్‌లో అమెరికా డాలర్ కంటే శక్తిమంతమైనది భారత్‌లో ఉల్లిపాయే అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు హోరెత్తిపోతున్నాయి.

### పార్లమెంట్ క్యాంటీన్‌లో సబ్సిడీలు కట్!

పార్లమెంటు క్యాంటీన్లలో రాయితీలతో కూడిన ఆహార పదార్థాలకు మంగళం పాడేయనున్నారు. భారీ సబ్సిడీలతో క్యాంటీన్లను నడపడం సరికాదన్న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సూచనకు దాదాపు అన్ని రాజకీయ పార్టీల వారు అంగీకరించడంతో సబ్సిడీ ఆహారానికి త్వరలో తెరపడనుంది. ఫలితంగా ఏడాదికి సుమారు రూ. 17 కోట్లు ఆదాకానుందని అధికారులు తెలిపారు. సబ్సిడీల ఎత్తివేత నిర్ణయం అమల్లోకి వస్తే చాలా వరకూ ఆహార పదార్థాల ధరలు ఇప్పుడున్న దానికి రెట్టింపు కావచ్చు.

# ప్రశాంతంగా కర్ణాటక ఉప ఎన్నికలు

- 15 అసెంబ్లీ సీట్లకు పోలింగ్
- బెంగళూరు పరిధిలో అత్యల్ప ఓటింగ్ • 9వ తేదీన ఫలితాలు

**సాక్షి, బెంగళూరు:** కర్ణాటకలోని అనర్హత ఎమ్మెల్యేల రాజకీయ భవిష్యత్తు, యెడ్యూరప్ప నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ మనుగడకు కీలకంగా మారిన 15 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. 15 నియోజకవర్గాల్లోని మొత్తం 37.78 లక్షల మంది ఓటర్లలో సాయంత్రం 6 గంటల వరకు 66.59% మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని అధికారులు తెలిపారు. హోసకోటెలో అత్యధికంగా 90.44%, కృష్ణరాజపురంలో అత్యల్పంగా 43.25% పోలింగ్ నమోదైందని తెలిపారు. బెంగళూరు పరిధిలోని మహాలక్ష్మి లేఅవుట్‌లో 50.92%, శివాజీనగరలో 44.60%, యశ్వంత్‌పురలో 54.13% పోలింగ్ నమోదైందన్నారు. ఈ నెల 9వ తేదీన ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలను వెల్లడిస్తారు. బీజేపీ ప్రభుత్వం సొంతంగా మెజారిటీ సాధించాలంటే కనీసం 8 స్థానాల్లో గెలవాల్సి ఉంది. అయితే సీఎం యెడ్యూరప్ప 15 స్థానాల్లో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ అన్ని స్థానాల్లోను, జేడీఎస్ 12 చోట్ల పోటీలో ఉంది. అనర్హతకు గురైన ఎమ్మెల్యేల్లో 13 మంది బీజేపీ తరపున బరిలో దిగారు. కోర్టు కేసులున్నందున మస్కి, రాజరాజేశ్వరి నగర నియోజకవర్గాలకు ఎన్నికలు జరగలేదు. ఈ ఉప ఎన్నికల్లో అధిక స్థానాల్లో బీజేపీనే గెలిచే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తం 15 స్థానాల్లో, బీజేపీకి 10, కాంగ్రెస్‌కు 2 నుంచి 4, జేడీఎస్ 2 సీట్లు లభిస్తాయని పలు సర్వేలు అంచనా వేశాయి. ఈ 15 స్థానాల్లో గత ఎన్నికల్లో కాంగ్రెస్ 12, జేడీఎస్ 3 సీట్లలో గెలుపొందాయి.



**అసెంబ్లీలో బలాబలాలు**

| | |
|---|---|
| మొత్తం స్థానాలు (ఒక నామినేటెడ్ స్థానం సహా) | 225 |
| బీజేపీ | 105 + 1 స్వతంత్ర ఎమ్మెల్యే |
| కాంగ్రెస్ | 66 |
| జేడీఎస్ | 34 |
| బీఎస్పీ | 01 |
| ఆంగ్లో ఇండియన్ (నామినేటెడ్) | 01 |
| ఖాళీగా ఉన్న స్థానాలు | 02 |
| ప్రస్తుతం ఎన్నికలు జరిగిన స్థానాలు | 15 |

# ఆర్థికం.. అగమ్యగోచరం

**మోదీ ప్రభుత్వ తీరుపై చిదంబరం**

**న్యూఢిల్లీ:** ఆర్థిక వ్యవస్థ మందగమనంపై ప్రభుత్వం దిక్కు తోచని స్థితిలో ఉందని, ప్రభుత్వ తీరుపై గొప్పలు చెప్పే బాధ్యతను మాత్రం ప్రధాని కేబినెట్ సహచరులకు అప్పగించారని గురువారం కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం విమర్శించారు. 'ఆర్థిక రంగం విషయంలో అసమర్థతతో, కశ్మీర్ విషయంలో అహంకారపూరితంగా కేంద్రం వ్యవహరిస్తోంద'ని మండిపడ్డారు. పార్లమెంట్ సభ్యుడైన చిదంబరం బెయిల్‌పై విడుదలైన తరువాత.. గురువారం రాజ్యసభకు వచ్చారు. సభాకార్యకలాపాల్లో పాలు పంచుకున్నారు. దేశవ్యాప్తంగా ఉల్లి ధర పెరుగుదలపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్లమెంటు భేటీ అనంతరం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "8, 7, 6.6, 5.8, 5, 4.5.. ఇవీ మన గత ఆరు త్రైమాసికాల వృద్ధి రేటు గణాంకాలు. ఇవి చూస్తే చాలు మన ఆర్థిక రంగ దుస్థితి అర్థమవుతుంది. ఇక్కడ అసలైన సమస్యనే ప్రభుత్వం సరిగ్గా గుర్తించలేదు. ఇక చికిత్స ఎలా సాధ్యం?' అని అన్నారు. మరోవైపు.. జైల్లో ఉన్న సమయంలో చెక్క బల్లపై, దిండు కూడా లేకుండా నిద్రించడం వల్ల తన మెడ, వెన్నెముక, శరీరం దృఢమయ్యాయని చమత్కరించారు.

# గవర్నర్ వస్తే.. అసెంబ్లీకి తాళం

**బెంగాల్ గవర్నర్ గుస్సా**

**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్‌లోని టీఎంసీ(తృణమూల్ కాంగ్రెస్) ప్రభుత్వం, గవర్నర్ జగదీప్ ధన్‌కర్ మధ్య విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. గురువారం ధన్‌కర్ అసెంబ్లీలోకి రావడానికి ప్రయత్నించగా అధికారులు గవర్నర్ ప్రత్యేక గేటుకు తాళం వేసి, ఎటో వెళ్లిపోయారు. ఈ పరిణామంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం మధ్యాహ్నం ధన్‌కర్ నంబర్3 ప్రత్యేక గేటు గుండా అసెంబ్లీలోకి రావడానికి ప్రయత్నించారు. అయితే, ఆ గేటుకు తాళం వేసి ఉంది. అధికారులు అందుబాటులో లేరు. దీంతో మీడియా సిబ్బందికి కేటాయించిన నంబర్–2 గేటు ద్వారా లోపలికి ప్రవేశించారు. 'నేను వస్తున్నట్లు తెలిసినా మూడో నంబర్ గేటును ఎందుకు మూసేశారు? ఈ చర్య మన ప్రజాస్వామిక చరిత్రలో దుర్దినం. ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేసే ప్రయత్నం జరుగుతోంది'అని అన్నారు. తనను భయపెట్టేందుకు ప్రభుత్వం సాగిస్తున్న ప్రయత్నాలను సాగనివ్వబోనన్నారు. ఈ విమర్శలపై టీఎంసీ నేత పార్థా బెనర్జీ స్పందించారు. 'అధికార బంగళా కోసం రూ.7 కోట్లు ఎందుకు ఖర్చు పెట్టారో చెప్పాక ప్రజాస్వామ్యంపై గవర్నర్ మాట్లాడాలి'అని అన్నారు. కాగా, అసెంబ్లీలో ప్రవేశపెట్టాల్సిన బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నందున రెండ్రోజులు సమావేశాలను వాయిదా వేస్తున్నట్లు మంగళవారం స్పీకర్ ప్రకటించడం గమనార్హం.


గేటు బయట మాట్లాడుతున్న గవర్నర్ జగదీప్ ధన్‌కర్

# వాయుసేన చీఫ్‌కు తప్పిన ముప్పు

- అమెరికాలోని పెరల్ హార్బర్‌లో నావికుడు కాల్పులు
- ఇద్దరు అమెరికన్లు మృతి



**హోనోలులు:** అమెరికా పర్యటనలో ఉన్న భారత్ ఎయిర్‌చీఫ్ మార్షల్ రాకేష్ భదౌరియాకు ముప్పు తప్పింది. హవాయి దీవుల్లోని పెరల్ హార్బర్‌లో బుధవారం ఇండో పసిఫిక్ ప్రాంతంలో భద్రతపై వివిధ దేశాల వైమానిక దళ మార్షల్స్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. అదే సమయంలో ఒక నావికుడు పెరల్ హార్బర్‌లోకి చొరబడి కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ఇద్దరు అమెరికన్లు మృతి చెందారు. కాల్పులు జరిపాక ఆ నావికుడు తనను షూట్‌చేసుకుని చనిపోయాడు. కాగా, భదౌరియా సురక్షితంగా ఉన్నారని భారత వైమానిక దళం వెల్లడించింది. పెరల్ హార్బర్‌లో అమెరికా వైమానిక దళ కేంద్రంలో ఈ సదస్సు జరిగే సమయంలో దగ్గర్లోని నావికాదళ కేంద్రంలో కాల్పుల ఘటన జరిగిందని వాయుసేన అధికారి చెప్పారు. కాల్పులకు కారణాలు తెలియాల్సి ఉందని హవాయి ప్రాంత నావికా దళ కమాండర్ అడ్మిన్ రాబర్ట్ చెప్పారు. 1941 డిసెంబర్ 7న జపాన్ పెరల్ హార్బర్‌పై జరిపిన దాడికి 78ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో అక్కడ నివాళులర్పించడానికి ఏర్పాట్లు చేస్తుండగా ఈ కాల్పుల ఘటన జరగడంతో అమెరికాలోనూ కలకలం రేగింది.

# సారీ చెప్పిన సుప్రీంకోర్టు జడ్జి

**న్యూఢిల్లీ:** కేసులో వాదనలు వినిపిస్తున్న ఓ న్యాయవాదిపై కోర్టు ధిక్కరణ నేరం మోపుతానంటూ బెదిరించిన సంఘటనలో సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ అరుణ్ మిశ్రా గురువారం క్షమాపణ చెప్పారు. తమతో వ్యవహరించే విషయంలో ఓపికగా ఉండాలన్న సీనియర్ న్యాయవాదుల సూచనకు అంగీకరించిన జస్టిస్ అరుణ్ మిశ్రా... తన వైఖరి కారణంగా ఎవరైనా బాధపడి ఉంటే క్షమాపణలు చెబుతున్నానని తెలిపారు. భూ సేకరణకు సంబంధించిన కేసులను చూస్తున్న ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి జస్టిస్ మిశ్రా నేతృత్వం వహిస్తుండగా మంగళవారం ఒక కేసుకు సంబంధించి వాదనలు వినిపిస్తున్న లాయర్ గోపాల్ శంకర నారాయణన్‌ను కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేస్తానని బెదిరించారు. ఈ విషయంపై కపిల్ సిబల్, ముకుల్ రోహత్గీ, అభిషేక్ సింఘ్వీ, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాకేశ్ ఖన్నా తదితరులు గురువారం జడ్జిని కలిసి జరిగిన సంఘటనను ప్రస్తావించారు. 'ఏ సమయంలోనైనా ఎవరైనా ఏదైనా అనుకునిఉంటే చేతులు జోడించి క్షమాపణలు కోరుతున్నా' అని జడ్జి వ్యాఖ్యానించారు.

### గుజ్రాల్ సలహా పీవీ విని ఉంటే..!

# సిక్కుల ఊచకోత జరిగేదికాదు: మన్మోహన్

**న్యూఢిల్లీ:** ఐకే గుజ్రాల్ సలహా నాటి కేంద్ర హోం మంత్రి పీవీ నరసింహారావు విని ఉంటే, 1984 నాటి సిక్కుల ఊచకోత చోటు చేసుకునేదే కాదని మాజీ ప్రధాని మన్మోహన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ ప్రధాని ఐకే గుజ్రాల్ సంస్మరణ సభలో గురువారం మన్మోహన్ మాట్లాడారు. '1984లో ఆ విషాదకర సంఘటన జరిగిన రోజే.. గుజ్రాల్ నాటి హోంమంత్రి పీవీ నరసింహారావు వద్దకు వెళ్లారు. పరిస్థితి ఉద్రిక్తంగా ఉందని, తక్షణమే ఆర్మీని మోహరిస్తే మంచిదని పీవీకి సలహా ఇచ్చారు. ఆ సలహాను పీవీ పాటించి ఉంటే, సిక్కుల ఊచకోత జరిగి ఉండేది కాదు' అని మన్మోహన్ వ్యాఖ్యానించారు. మన్మోహన్ వ్యాఖ్యలపై బీజేపీ స్పందిస్తూ.. అంత చెడ్డవాడైన పీవీ కేబినెట్‌లో ఆర్థికమంత్రిగా ఎందుకు పనిచేశారని మన్మోహన్‌ను ప్రశ్నించింది. ఇప్పటికైనా వాస్తవం బయట పెట్టినందుకు మన్మోహన్‌కు కృతజ్ఞతలని ఐకే గుజ్రాల్ కుమారుడు అకాలీదళ్ నేత నరేశ్ గుజ్రాల్ వ్యాఖ్యానించారు. ఊచకోత బాధ్యతను రాజీవ్ గాంధీ నుంచి తప్పించేందుకు చేసిన వ్యాఖ్య ఇదని శిరోమణి అకాలిదళ్ చీఫ్ సుఖ్‌బీర్ సింగ్ బాదల్ పేర్కొన్నారు. మన్మోహన్ వ్యాఖ్యలపై స్పందించేందుకు కాంగ్రెస్ నిరాకరించింది.

# ఆదిత్యుడి గుట్టు విప్పుతున్న పార్కర్!

- తొలిసారి సమాచారం పంపిన నాసా ప్రోబ్
- సౌర గాలుల జన్మస్థలం కరోనా రంధ్రాలు?

**వాషింగ్టన్:** ఆదిత్యుడు.. అదేనండీ మన సూర్యుడికి అతిదగ్గరగా వెళ్లిన అంతరిక్ష నౌక పార్కర్ సోలార్ ప్రోబ్ మొట్టమొదటిసారి భూమికి సమాచారం పంపింది. ఇది కాస్తా సూర్యుడికి సంబంధించిన అనేక మిస్టరీలను ఛేదించేందుకు ఉపయోగపడుతుందని నాసా అంటోంది. ఈ సమాచారం నేచర్ జర్నల్ తాజా సంచికలో ప్రచురితమైంది.

**మిస్టరీల పుట్ట...**

సూర్యుడి ఉపరితలం కంటే వాతావరణ(కరోనా) ఉష్ణోగ్రత వందల రెట్లు ఎక్కువ ఎందుకుంది? సూర్యుడి నుంచి వెలువడే గాలులకు మూలమెక్కడ? వంటివి ఇప్పటికీ మిస్టరీలే. అయితే గత ఏడాది ఆగస్టులో నాసా ప్రయోగించిన పార్కర్ ప్రోబ్ తాజాగా పంపిన సమాచారంతో ఈ రహస్యాలను ఛేదించవచ్చునని నాసా అంచనా వేస్తోంది.

**నక్షత్రాల పుట్టుక వివరమూ తెలుస్తుంది...**

పార్కర్ సోలార్ ప్రోబ్ ఇచ్చే సమాచారంతో నక్షత్రాలు ఎలా పుడతాయి? ఎలా పరిణమిస్తాయన్న విషయంలోనూ మానవ అవగాహన పెరగనుంది. సూర్యుడిని వీలైనంత దగ్గరగా పరిశీలించడం ద్వారా అక్కడ జరిగే కార్యకలాపాలను మరింత స్పష్టంగా చూడగలుగుతున్నామని, వాటి ప్రభావం భూమిపై ఎలా ఉంటుందో తెలుస్తోందని, పాలపుంతల్లోని నక్షత్రాలను అర్థం చేసుకునేందుకు అవసరమైన వివరాలూ అర్థమవుతున్నాయని నాసా శాస్త్రవేత్త థామస్ జుర్‌బుకెన్ తెలిపారు. హీలియో ఫిజిక్స్ (సూర్య భౌతికశాస్త్రం) రంగంలో ఎంతో ఆసక్తికరమైన దశకు పార్కర్ ప్రోబ్ సమాచారం శ్రీకారం చుట్టిందని అన్నారు. కరోనా తాలూకూ అయస్కాంత నిర్మాణాన్ని చూడటం ద్వారా సౌర గాలులు సూక్ష్మస్థాయి కరోనా రంధ్రాల నుంచి వస్తున్నట్లు తెలిసిందని కాలిఫోర్నియా యూనివర్సిటీ అధ్యాపకుడు స్టువర్ట్ బేల్ తెలిపారు. సూర్యుడికి అతిదగ్గరగా వెళ్లినప్పుడు ప్రోబ్‌పై అక్కడక్కడా పడ్డ దుమ్ము తమను ఆశ్చర్యపరిచిందని, మిల్లీమీటర్‌లో వెయ్యోవంతు సైజున్న ఈ దుమ్ము సూర్యుడికి సమీపంలో కరిగిపోయిన గ్రహశకలాల తాలూకూ అవశేషాలు కావచ్చునని శాస్త్రవేత్తలు అంటున్నారు.


ఎరుపురంగు వృత్త ప్రాంతం నుంచి సౌర గాలులు వస్తున్నపుడు పార్కర్ తీసిన ఫొటో (ఫైల్)

సాక్షి ఉద్యోగ అవకాశాలు

SAKSHI MEDIA GROUP
www.sakshi.com

GROW WITH THE LEADER
Sakshi, a leading media group of Andhra Pradesh & Telangana is looking for energetic and hard-working candidates for the following positions:

SCHEDULING ASSISTANTS
Qualification
• Graduate in any discipline
• Proficient in MS Office and net browsing

DTP OPERATORS
Qualification & Experience
• Intermediate in any discipline
• Skilled in typing in Telugu/English
• Minimum 1-2 years of experience in designing advertisements in QuarkXPress, PageMaker, Photoshop and CorelDRAW

TRANSLATORS CUM PROOFREADERS
Qualification & Experience
• Graduate in any discipline
• M.A. in Telugu is preferred
• Minimum 2 years of experience in translating tenders, notices, commercial advertisements etc., from English to Telugu and from Hindi to Telugu
• Minimum 2 years of experience in proofreading advertisements in any reputed print media

Freshers can apply for the position of Trainee Translator/Proofreader.

Interested candidates can walk-in directly on 09th Dec, 2019 between 11.00 A.M. to 4.00 P.M.
SAKSHI MEDIA GROUP, Sakshi Tower, Road No.1, Banjara Hills, Hyderabad - 500 034
Candidates who are unable to walk-in directly can mail their resume to advtrecruitment@sakshi.com

సాక్షి
శుక్రవారం, డిసెంబర్, 6

# డేటా భద్రతకు చట్టం

సమాచార సాంకేతిక రంగ నిపుణులు ఎంతకాలం నుంచో కోరుతున్న వ్యక్తిగత డేటా పరిరక్షణ చట్టం సాకారం అయ్యేందుకు తొలి అడుగుపడింది. కేంద్ర కేబినెట్ బుధవారం ఇందుకు సంబంధించిన ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపింది. ఈ బిల్లు ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టే అవకాశం ఉంది. జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ నేతృత్వంలోని కమిటీ ఏడాదిపాటు ఐటీ రంగ నిపుణులతో, సంస్థలతో సంప్రదింపులు జరిపి, వివిధ దేశాలు అమలు చేస్తున్న చట్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఈ బిల్లును రూపొందించింది. ఆ కమిటీ నిరుడు సమర్పించిన బిల్లుపై అభిప్రాయాలు సేకరించి తగిన మార్పులు, చేర్పులూ చేశాక ప్రస్తుత బిల్లు కేబినెట్ ముందుకొచ్చింది. ప్రపంచం మొత్తం ఇప్పుడు ఇంటర్నెట్‌తో అనుసంధానమైంది. కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు మొదలుకొని అనేకానేక ఎలక్ట్రానిక్ పరికరాలు అందులో భాగంగా మారాయి. ఈ డిజిటల్ యుగంలో ఈమెయిల్ ఖాతా లేనివారు, వేర్వేరు సామాజిక మాధ్యమాల్లో ఖాతాలు ప్రారంభించనివారు ఉండరు. అలా ఖాతా ప్రారంభించే ప్రతి ఒక్కరినుంచి వివిధ సంస్థలు విస్తృతంగా డేటా సేకరిస్తున్నాయి. వారి పేరు, వయసు, చిరునామా, ఫోన్ నంబర్, వారి ఇష్టాయిష్టాలు మొదలైనవన్నీ అందులో ఉంటాయి. అయితే ఈ సమాచారాన్నంతా వారు దేనికి వినియోగిస్తారో, ఎందుకు సేకరిస్తారో ఎవరికీ తెలియదు.

గూగుల్, ఫేస్‌బుక్, ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్ తదితర మాధ్యమాలన్నీ డేటా సేకరణ చేస్తున్నాయి. నాలుగేళ్లక్రితం కేంబ్రిడ్జి అనలిటికా(సీఏ) అనే సంస్థకు ఫేస్‌బుక్ తన ఖాతాదార్ల సమాచారాన్ని అమ్ముకుందని వెల్లడైంది. ఇలాంటి డేటాతో వ్యాపార వాణిజ్య సంస్థలు తమ మార్కెటింగ్ వ్యూహాలను రూపొందించుకోవడం రివాజైంది. సీఏ సంస్థ మన దేశంలోని కొన్ని రాజకీయ పక్షాలతో ఒప్పందం కుదుర్చుకుని భిన్న ప్రాంతాల ఓటర్ల కుల, మత వివరాలు, వారి ఇష్టాయిష్టాలు వగైరాలు అందజేసింది. పౌరుల డేటా సైబర్ నేరగాళ్ల చేతుల్లో పడి చాలామంది బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతున్నాయి. ఆమధ్య ఆధార్ డేటా కూడా లీకైంది. ఈ నేపథ్యంలో డేటా పరిరక్షణ చట్టం అవసరం ఎంతో వుంది. సమాచార సాంకేతిక నిపుణులు దీని అవసరం గురించి ఎప్పటినుంచో చెబుతున్నారు. చాలా దేశాలు ఇప్పటికే ఈ తరహా చట్టాలు తీసుకొచ్చాయి. తమ ఖాతాదార్లు వీడియోలు చూసే సగటు సమయం గురించి తప్పుడు సమాచారం ఇచ్చిందని ఫేస్‌బుక్‌పై అనేక వాణిజ్య ప్రకటన సంస్థలు న్యాయస్థానాల్లో కేసులు వేస్తే మొన్న అక్టోబర్‌లో ఫేస్‌బుక్ యాజమాన్యం 4 కోట్ల డాలర్లు చెల్లించాల్సి వచ్చింది. తమ పౌరులు ఫేస్‌బుక్ ఖాతాల్లో వ్యక్తిగత వినియోగం కోసం పెట్టుకున్న ఫొటోలన్నీ బట్టబయలయ్యాయని, అందుకు 2లక్షల 70 వేల డాలర్ల జరిమానా చెల్లించాలని టర్కీ శ్రీముఖం పంపింది. అక్కడ మాత్రమే కాదు... రష్యా, ఇటలీ, బ్రిటన్, అమెరికా, జర్మనీ తదితర దేశాలన్నిటా ఫేస్‌బుక్‌పై లక్షలాది డాలర్లు పరిహారంగా చెల్లించాలంటూ దావాలు పడ్డాయి. ఈ ఏడాది ఇంతవరకూ దాఖలైన కేసుల్లో ఫేస్‌బుక్ సంస్థ దాదాపు 516 కోట్ల డాలర్లు చెల్లించాల్సి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ మొత్తం దాని వార్షిక ఆదాయంలో దాదాపు ఏడున్నర శాతం.

డేటా సేకరణ, నిక్షిప్తం, వినియోగం వంటి అంశాల్లో ఈ బిల్లు అనేక నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించింది. వ్యక్తుల ముందస్తు అనుమతి లేనిదే వారికి సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ అందజేయరాదని బిల్లు నిర్దేశిస్తోంది. అయితే పౌరుల సమాచారాన్ని ఎక్కడ నిక్షిప్తం చేయాలన్న విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. సంస్థలన్నీ ఆ సమాచారాన్ని ఈ దేశంలో నెలకొల్పే సర్వర్లలో మాత్రమే భద్రపరచాలని లోగడ చెప్పగా, ఇప్పుడు దాన్ని సవరించి వ్యక్తుల సున్నితమైన సమాచారాన్ని, కీలక సమాచారాన్ని ఇక్కడి సర్వర్లలో ఉంచాలని...ఇతరత్రా సమాచారమైతే ఆయా సంస్థలు ఏ సర్వర్లలో భద్రపరిచినా అభ్యంతరం లేదని తాజా ముసాయిదా బిల్లు చెబుతోంది. ప్రభుత్వం ఇచ్చే నిర్వచనాన్నిబట్టి 'కీలక సమాచారం' ఏమిటన్నది నిర్ణయమవుతుంది. అవసరాన్నిబట్టి ఈ నిర్వచనం పరిధిలోకి కొత్త అంశాలు చేరే అవకాశం ఉంటుంది. సున్నితమైన సమాచారం విషయంలో ఖాతాదారు అనుమతి అవసరమవుతుంది. డేటా నిక్షిప్తానికి ఇక్కడ సర్వర్లు నెలకొల్పాలని మన ప్రభుత్వం పట్టుదలకుపోతే... వేరే దేశాల్లోని మన సంస్థలపై కూడా అక్కడి ప్రభుత్వాలు ఇలాంటి షరతులే పెట్టే ప్రమాదం ఉందని, అందువల్ల తమపై ఆర్థిక భారం పడుతుందని ఐటీ సంస్థలు మొరపెట్టుకున్నాయి. దీంతో బిల్లులో మార్పులు చేశారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విటర్‌వంటి సంస్థలు ఖాతాదారులు అందజేసే వ్యక్తిగత సమాచారాన్ని తప్పనిసరిగా నిర్ధారించుకోవాల్సివుంటుంది. ఈ బిల్లు చట్టమైతే వారు నిజమైన వ్యక్తులేనా లేక వేరేవారి పేర్లతో ఖాతాలు ప్రారంభించారా అన్నది తెలుసుకోకతప్పదు. తప్పుడు పేర్లతో ప్రవేశించినవారే సామాజిక మాధ్యమాల్లో ఇష్టానుసారంగా, బాధ్యతారహితంగా వ్యాఖ్యానాలు చేయడం, కించపరచడం లాంటివి చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో ఈ నిబంధన పొందుపరిచారు. అలాగే అన్ని సంస్థలూ తమ తమ ప్రతినిధులను ఈ దేశంలో నియమించుకోవడం ఇకపై తప్పనిసరి. సంస్థలకు జవాబుదారీతనం ఉండాలన్న సంకల్పంతో ఈ నిబంధన పెట్టారు. ఉల్లంఘనలు జరిగాయని నిర్ధారణైతే సంస్థలో డేటా పరిరక్షణ బాధ్యతలు చూస్తున్న వ్యక్తికి మూడేళ్లవరకూ జైలు, రూ. 15 కోట్ల వరకూ జరిమానా విధిస్తారు.

తమ వ్యక్తిగత డేటా అవాంఛిత వ్యక్తులు, సంస్థల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడుకోవడం పౌరుల ప్రాథమిక హక్కు. అయితే ఇతర హక్కుల మాదిరి ఈ హక్కుకు భౌగోళిక సరిహద్దులుండవు. కనుక ఇలాంటి చట్టానికి రూపకల్పన చేయడం కత్తి మీది సాము. ఈ క్రమంలో ప్రభుత్వాలకు వ్యక్తుల డేటాపై ఏదోమేరకు ఆధిపత్యం లభించడం కూడా తప్పనిసరి. ఆలస్యంగానైనా ఇలాంటి చట్టం రాబోతుండటం హర్షించదగ్గ విషయం.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, తిథి శు.దశమి తె.5.09 వరకు (తెల్లవారితే శని వారం), నక్షత్రం ఉత్తరాభాద్ర రా.10.27 వరకు, తదుపరి, రేవతి వర్జ్యం ఉ.6.30 నుంచి 8.14 వరకు, దుర్ముహూర్తం ఉ.8.31 నుంచి 9.15 వరకు, తదుపరి ప.12.11 నుంచి 12.55 వరకు అమృతఘడియలు... సా.5.06 నుంచి 6.54 వరకు.

**సూర్యోదయం :** 6.20
**సూర్యాస్తమయం:** 5.20
**రాహుకాలం :** ఉ.10.30 నుంచి 12.00 వరకు
**యమగండం :** ప.3.00 నుంచి 4.30 వరకు

# దిద్దుబాటు లేకుంటే తిప్పలు తప్పవు!

విశ్లేషణ



పెంటపాటి పుల్లారావు

**గత ఆయిదున్నరేళ్ల పాలనలో తిరుగులేని రాజకీయ శక్తిగా ఆవిర్భవించిన బీజేపీ.. మహారాష్ట్రలో ఆకస్మిక రాజకీయ పరిణామాలతో చేష్టలుడిగిపోయింది. శివసేనకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని ఊహించలేకపోయిన బీజేపీ అగ్రనాయకత్వం వ్యూహపరంగానే దెబ్బతినిపోయింది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వైఫల్యం, జీడీపీ పతనం, నిరుద్యోగిత వంటి మరకలు ఉన్నప్పటికీ మోదీపై వ్యక్తిగతంగా సదభిప్రాయం ఆ పార్టీకి నేటికీ బలాన్ని అందిస్తోంది. అయితే నరేంద్రమోదీ, అమిత్ షాలు తమను తాము చక్కదిద్దుకోగలమని నిరూపించుకున్నారు. మహారాష్ట్ర గుణపాఠాలను త్వరగా నేర్చుకుని బీజేపీ మిత్రుల సంఖ్యను పెంచుకుని, శత్రువుల సంఖ్యను తగ్గించుకుంటే అది మళ్లీ తన పూర్వ ప్రభలను వెదజల్లుతుంది. పంథాను మార్చి గెలుపొందడం.. మారకుండా ఓటమివైపు పయనించడం అనే రెండు అవకాశాలు బీజేపీ ముందున్నాయి.**

శివసేన రూపంలో ఆప్తమిత్రుడే బద్ధ శత్రువుగా మారి మహారాష్ట్రలో ప్రభుత్వాన్ని ఏర్పర్చాక బీజేపీలో నిశ్శబ్దం తాండవిస్తోంది. దీనిపైనే శరద్ పవార్ ప్రతి రోజూ వ్యంగ్యంగా ప్రశ్నిస్తున్నారు: 'అమిత్ షా ఎక్కడ? ఎమ్మెల్యేలను గెల్చుకుని ప్రభుత్వాలను ఎవరు ఏర్పర్చగలరు?' ఇక బీజేపీ సాహసప్రవృత్తి కలిగిన ప్రతిపక్షాన్నే ఎదుర్కోనుందా లేక ఆ పార్టీ తన సంతృప్తస్థాయిని ఇప్పటికే చేరుకుందా అని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంతృప్తస్థాయి అంటే సాధ్యపడినంత అత్యున్నత స్థాయికి చేరిందనీ, ఇక తదుపరి దశలో క్షీణత లేక పతనం తప్పదని అర్థం. అయితే బీజేపీ తగ్గుముఖంలో ఉందని ఇప్పటికిప్పుడే చెప్పడం తొందరపాటే కావచ్చు. మోదీ నేతృత్వంలోని బీజేపీ 2014 నుంచి నిరంతర విజయాలను నమోదు చేస్తూ వచ్చింది. కొన్ని ఉపఎన్నికల్లో నష్టపోయి ఉండవచ్చు. కానీ ఆ పార్టీ బలాన్ని సంతరించుకుంటూనే వచ్చింది. పెద్దనోట్ల రద్దు, పేలవమైన జీఎస్టీ వంటి తప్పిదాలను మోదీ ప్రభుత్వం చేసినప్పటికీ మొత్తం మీద ప్రధాని మంచి పనులే చేస్తున్నారని ప్రజలు భావిస్తున్నారు.

అయితే 2019 అక్టోబర్ 24న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి విజయం తప్పదనిపించిన చోట ఉన్నట్లుండి భారీ రాజకీయ విషాదంగా పరిణమించింది. బీజేపీ, శివసేనలు ఈ ఎన్నికల్లో గెలిచినప్పటికీ శివసేన తర్వాత ఒక్కసారిగా బీజేపీని ఎత్తి కుదేసింది. ఈసారి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి పదవి తనకే కావాలని శివసేన బహిరంగంగా పట్టుబట్టడంతో ఇరుపార్టీల మధ్య విచ్ఛిన్నత తప్పలేదు. అనేక మలుపులు, ఒడిదుడుకుల తర్వాత బీజేపీ ప్రధాన శత్రువులైన కాంగ్రెస్, ఎన్సీపీకి చెందిన శరద్ పవార్‌తో పొత్తు కలిపిన శివసేన ఏకంగా ప్రభుత్వాన్నే ఏర్పర్చేసింది. మహారాష్ట్ర రాజకీయాలు బీజేపీని నిస్సహాయతలోకి నెట్టేశాయి. ఎన్నికల వ్యూహ రచనలో అతిశక్తిమంతులుగా ముద్రపడిన నరేంద్రమోదీ, అమిత్ షాలు నిస్సహాయులైనట్లు కనిపించారు. బీజేపీకి ఇప్పుడు శివసేన బద్ధ శత్రువైంది. పైగా కాంగ్రెస్, ఎన్సీపీలు బీజేపీకి బదులుగా మహారాష్ట్రలో ప్రభుత్వంలో ఉన్నాయి. ప్రతిపక్షం ఐక్యంగా ఉంటే బీజేపీ, మోదీలను ఓడించగలదనే సంకేతాన్ని కొత్త కూటమి ఇచ్చింది.

### మహారాష్ట్రలో బీజేపీ ఓటమి ఫలితాలు

మహారాష్ట్రను బీజేపీ కోల్పోవడం నిస్సందేహంగా తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. దేశంలోనే అత్యంత సంపన్న రాష్ట్రం మహారాష్ట్ర. బీజేపీ ప్రత్యర్థులు ఇక్కడ వచ్చే ఎన్నికలకోసం ఎలెక్టోరల్ బాండ్ల ద్వారా భారీ నిధులను సేకరించగలరు. 2019 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ, శివసేన కలిసి 48 లోక్‌సభ స్థానాలకుగాను 41 స్థానాలు గెల్చుకున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి ఫలితాన్ని సాధించడం చాలా కష్టం. అందుకే మహారాష్ట్రలో ఓటమి బీజేపీ పతనానికి నాంది పలుకనుందా లేక మరో చిన్న పరాజయంగానే మిగిలిపోతుందా అనేది ప్రశ్నగా మిగిలింది.

మహారాష్ట్రను కోల్పోవడం బీజేపీని నైతికంగా దెబ్బతీసింది. ఒక సంపన్న రాష్ట్రం ఇంత సులభంగా తమ చేతుల్లోంచి చేజారిపోయిందా అని బీజేపీ కేడర్, నాయకత్వం చేష్టలుడిగిపోయారు. బలహీనంగా కనిపించిన శివసేన చేతుల్లో అజేయమైనదని పేరొందిన మోదీ, షాల వ్యూహం దెబ్బతినిపోవడం బీజేపీ ప్రతిష్టను మసకబార్చింది. మహారాష్ట్రనే కోల్పోయినప్పుడు, రానున్న జార్ఖండ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీ నష్టపోవచ్చు. ప్రతిపక్షం మళ్లీ శక్తిని పుంజుకుంది, ఐక్యత అనేది బలమైన బీజేపీని కూడా ఓడించవచ్చనే అభిప్రాయం ప్రతిపక్షంలో పెరిగింది.



### బీజేపీ బలాలు

మహారాష్ట్రలో బీజేపీ ఓడిపోయినప్పటికీ, లోక్‌సభ ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల 6 నెలల కాలం ఉంది. నరేంద్రమోదీ సత్పరిపాలనను అందించగలిగితే రాజకీయాల్లో పైచేయి సాధించటానికి ఇది సుదీర్ఘ సమయమే. కాబట్టి 2014 ఎన్నికల్లో ప్రజల విశ్వసనీయతను బీజేపీ పొందే అవకాశం ఉంది కూడా. పైగా ప్రతిపక్షానికి జాతీయ వ్యాప్తంగా తమ్ముతాము నిరూపించుకున్న జాతీయ స్థాయి నాయకులు లేరు. సోనియా గాంధీ కుటుంబం ఇప్పటికే విస్తృత ప్రచారం జబ్బు బారినపడ్డారు. ఇక వారినించి ఒరిగేదేమీ లేదు. రాజకీయాల్లో పాతబడిపోతే త్వరగా తెరవెనక్కు పోతారు. ప్రజలు మార్పు కోరుకుంటారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని యువతకు, నూతన నేతలకు ఇవ్వడానికి సిద్ధంగా లేదు. కాంగ్రెస్ తన జనాకర్షణ శక్తిని కోల్పోయిందని బీజేపీకి తెలుసు. పైగా కాంగ్రెస్ నుంచి దానికి వచ్చే ప్రమాదం ఏదీ లేదు. ఇప్పుడు కాంగ్రెస్‌లో అందరూ ప్రాంతీయనేతలే. జాతీయ నేతలు లేరు.

అదే అధికార పక్షాన్ని చూస్తే ఈశాన్య భారత రాష్ట్రాల్లో కూడా బీజేపీ బాగా ఎదిగింది. బెంగాల్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాలు, అసోంలలో బీజేపీ బలీయమైన శక్తిగా మారింది. బెంగాల్లో మమతకు, ఒడిశాలో నవీన్ పట్నాయక్‌కు బీజేపీ ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. అసోంని, ఈశాన్య భారతాన్ని దాదాపు ఈ పార్టీనే పాలిస్తోంది. బీజేపీకి ఇది అతిపెద్ద బలం మరి. పైగా తూర్పు, ఈశాన్య భారత్‌లో కోట్లాదిమంది పరదేశీయులు వలస వచ్చి స్థిరపడినందున బీజేపీ ప్రవేశపెట్టిన జాతీయ పౌరసత్వ చట్టం ఎన్ఆర్‌సీ దేశంలోని అనేక ప్రాంతాల్లో భావోద్వేగాలను ప్రేరేపించింది. ఎన్నార్సీకి భారీ డిమాండ్ ఉంటున్నందున బీజేపీ ఈ ఎన్నార్సీని అమలు పర్చి భారీ ప్రయోజనాన్నే పొందవచ్చు. ఇక విదేశీ విధాన వ్యవహారాల్లో మోదీ గొప్ప విజయం సాధించారు. కశ్మీర్ వంటి కీలక అంశంలో ప్రపంచం మొత్తంగా మన వాదనను బలపర్చేలా మోదీ ప్రభుత్వం చేయగలిగింది. దేశంలో వారసత్వ రాజకీయాలను ప్రజలు అసహ్యించుకుంటుండటంతో వచ్చే ఎన్నికల్లో కూడా బీజేపీ గెలుపు నల్లేరు మీద నడకలాగే సులభం కావచ్చు.

### బీజేపీ బలహీనతలు

మహారాష్ట్రలో వ్యూహపరంగా బీజేపీ దెబ్బతినిపోవడానికి కేంద్రీకృత నాయకత్వమే కారణం. శివసేనకు రెండున్నర ఏళ్ల ముఖ్యమంత్రి పదవిని ఇస్తామని హామీ ఇచ్చి ఉంటే మహారాష్ట్ర ఇంత సులభంగా చేజారిపోయి ఉండేదని చాలామంది పరిశీలకుల వ్యాఖ్య. కానీ ఈ విషయాన్ని మోదీ, షాలకు చెప్పే ధైర్యం బీజేపీలో ఎవరికీ లేదు. శివసేన డిమాండును అంగీకరించి ఉంటే ఇంత ఉపద్రవం ఎదురయ్యేది కాదు. బీజేపీకూడా కాంగ్రెస్ లాగే అధిష్టానం, దాని ముందు ఎవరూ నిలబడలేని పనివిధానంతో సాగుతోంది. మోదీ, షా, పీయూష్, గడ్కరీ, రాజ్‌నాథ్ సింగ్ మినహాయిస్తే మంత్రిమండలి రాజకీయంగా, పాలనాపరంగా బలహీనమైంది. అనుభవం లేని మంత్రుల వల్లే ఆర్థిక వ్యవస్థ వ్యవసాయం, విద్య వంటి రంగాలు ఫలితాల నివ్వడం లేదు. పైగా పొత్తు పార్టీలను నిర్లక్ష్యం చేయడం బీజేపీని బాగా దెబ్బతీస్తోంది. 2019 లోక్ సభ ఎన్నికల్లో ఘనవిజయంతో ఆత్మవిశ్వాసంతో ఉన్న బీజేపీ కూటమి పార్టీలను పక్కనబెట్టేసింది. పైకి ఏమీ అనలేకపోయినా వీరంతా సమయం కోసం కాచుకుని ఉన్నారు.

### మహారాష్ట్ర ఉదంతంలో గుణపాఠాలు

రాజకీయాల్లో శాశ్వత శత్రువులు ఎవరూ ఉండరన్న విషయం మర్చిన బీజేపీ శివసేనకు కాంగ్రెస్ పార్టీ మద్దతిస్తుందని ఊహించలేకపోయింది. అనూహ్యంగా అలా జరగడంతో బీజేపీ షాక్‌కు గురయింది. కాంగ్రెస్ పార్టీ శివసేనతో పొత్తుకు సిద్ధపడగలదని ఏమాత్రం ఊహించినా శివసేనకు సీఎం పదవిని ఇవ్వడానికి బీజేపీ సిద్ధపడిపోయేది. ఢిల్లీని ఏలుతున్న తనను అర్భక పార్టీ అయిన శివసేన ఏం చేస్తుందన్న నిర్లక్ష్యం ప్రదర్శించడమే బీజేపీ కొంప ముంచింది. ఏకు అనుకున్న శివసేన ఇప్పుడు ప్రమాదకర శత్రువుగా మారిపోయింది. అలాగే మీ మిత్రుల సంఖ్యను పెంచుకుని శత్రువుల సంఖ్యను తగ్గించుకోవాలన్న ప్రాథమిక సూత్రాన్ని బీజేపీ మర్చిపోయింది.

అయితే నరేంద్రమోదీ, అమిత్ షాలు తమను తాము చక్కదిద్దుకోగలమని నిరూపించుకున్నారు. పెద్దనోట్ల రద్దు గురించి మోదీ ఇప్పుడు కనీసంగా ప్రస్తావించలేదు. అరుణ్ జైట్లీ జీఎస్టీని కుప్పగూలిస్తే, మోదీనే దాన్ని మెరుగుపర్చారు. ఉపయోగంలేని మంత్రుల, నేతలను వదిలించుకోవడంలో మోదీ, షాలు సిద్ధహస్తులు. తన రాజకీయాలను మార్చుకుని మిత్రులను సంపాదించుకుని మరింత నమ్రతగా ఉండే అవకాశం ఇప్పటికీ బీజేపీ ముందుంది. ఈకోణంలో మహారాష్ట్ర బీజేపీకి పెద్ద గుణపాఠమైంది. బీజేపీ తన తప్పిదాలను సరిదిద్దుకుని నమ్రత గల పార్టీగా మారుతుందా? ఇప్పుడు బీజేపీకి రెండు అవకాశాలున్నాయి. మార్పు చెంది గెలుపొందడం, మారకుండా ఉండి ఓటమి వైపు పయనించడం!

వ్యాసకర్త ప్రముఖ రాజకీయ విశ్లేషకులు

**సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!**




## సోషల్ మీడియా

### బహుమతి



"పార్టీలు మారడానికి సొమ్ములు తీసుకుని, కొత్త ప్రభుత్వంలో మంత్రులైన ఫిరాయింపుదారులకు కర్ణాటక ఓటర్లు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారో లేదో ఇవాళ జరిగే ఉప ఎన్నికల్లో తేలిపోతుంది. వారిని ఓటర్లు శిక్షించాలి'

– ప్రశాంత్ భూషణ్, అడ్వకేట్

### షాక్



"ఉన్నావ్‌లో అత్యాచారంపై ఫిర్యాదు చేసిన బాలికను తగులబెట్టారని తెలిసి తీవ్రమైన షాక్‌కు గురయ్యా. బాధితురాలు ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతోంది. నిందితులను సరైన సమయంలో విచారించి ఉంటే ఇలా జరిగి ఉండేది కాదు. కేంద్ర ప్రభుత్వంలోని హోం మంత్రిత్వ శాఖ వర్గాలు తక్షణ చర్యలు తీసుకోవాలి"

– శరద్ పవార్, ఎన్సీపీ అధినేత

### బిల్లు



"పౌరసత్వ బిల్లుపై ఓ కన్నేసి ఉంచండి. ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ ఏ పార్టీ మద్దతిస్తోందో గమనించండి. ఈ బిల్లుకు మద్దతు పలికిన పార్టీలకు ఎట్టి పరిస్థితుల్లో ఓటు వేయమని ప్రతిజ్ఞబూనండి. ఈ ముస్లిం వ్యతిరేక పార్టీలను, ఎన్నికలను బహిష్కరించండి"

– మహమ్మద్ ఆసిఫ్ ఖాన్ సామాజిక కార్యకర్త

### నృత్యం



"కాంగ్రెస్‌కు చెందిన మధ్యప్రదేశ్ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఇమర్తి దేవి నృత్యం చేసిన వీడియోను మళ్లీ మళ్లీ చూస్తున్నా. అంత ఆనందంగా, అందంగా ఒక మహిళ నృత్యం చేయడం అరుదు. అందరూ చూస్తుండగా అలా నృత్యం చేయగలగడం కూడా అరుదే"

– వసుధ వేణుగోపాల్, జర్నలిస్ట్

### ఉల్లి



"ఉల్లిపాయలు లేకుండా మాంసం వండలేం. అంటే, దీన్ని బట్టి మాంసం తినేవారంతా దేశ వ్యతిరేకులు, జిహాదీలే, కేంద్ర ఆర్థికమంత్రిలా స్వచ్ఛమైనవారు కాదు"

– సీమీ పాషా, జర్నలిస్ట్

### జంతువు



"లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక పురుషుడిని కాపాడటానికి వచ్చే మరో పురుషుడే ఈ భూమ్మీద అత్యంత వేగంగా సంచరించే జంతువు"

– రుతుజా షిండే, న్యాయవాది

### కుట్ర



"ప్రధాని నరేంద్ర మోదీని నియంతగా, బీజేపీని ఫాసిస్టుగా చూపడానికి అంతర్జాతీయ కుట్ర జరుగుతోంది. దానిపట్ల అప్రమత్తంగా ఉండాలి. మనం అసంతృప్తికి గురై ఉండవచ్చు, కానీ, నెహ్రూ సంస్కృతిని తుడిచిపెట్టడానికి మనం మరో పదేళ్లు అధికారంలో ఉండాలి. మనం మన పార్టీ విధానాలను విమర్శించవచ్చు. కానీ, యూపీఏ ద్రోహాన్ని బయటపెట్టాలి"

– సుబ్రమణ్య స్వామి, బీజేపీ నేత

### అబద్ధాలు



"చిదంబరం వ్యాఖ్యలపై విరుచుకుపడిన మంత్రి జవదేకర్ బీజేపీకి ఇష్టమైన అబద్ధాలను వల్లించారు. కశ్మీర్‌లో అంతా ప్రశాంతంగా ఉంది, ఆర్థిక వ్యవస్థకు వచ్చిన ముప్పేమీ లేదని చెప్పారు"

– రూపా గులాబ్, రచయిత్రి

## ఇన్‌బాక్స్

### ఆదివాసీల ఆత్మనినాదం అంబేడ్కర్

గత రెండేళ్ల నుంచి మన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125వ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నాం. ఇటీవల నవంబర్ 26న 70 వసంతాల భారత రాజ్యాంగం ఉత్సవాలను అధికారికంగా ప్రభుత్వం నిర్వహించింది. డిసెంబర్ 6న అంబేడ్కర్‌ను స్మరించుకోవడం కూడా భారతీయులందరి కర్తవ్యం. ప్రపంచం గర్వించదగిన ఆదర్శమూర్తి కూడా ఆయనే. ఎందుకంటే కుల వ్యవస్థ నిర్మూలనకు, హింసలేని, దోపిడీలేని శాంతియుత సాంఘిక వ్యవస్థ నిర్మాణానికి దారి చూపిన అంబేడ్కర్ ధార్మికుడు, యుగకర్త. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 17 ద్వారా అంటరానితనం రద్దు చేసినంత మాత్రాన దళితులే ఆయన వర్గంగా భావించనక్కర్లేదు. అలాగే రాజ్యాం గంలో గిరిజనులకు కూడా ప్రత్యేక సదుపాయాలు కల్పించినందుకు ఆదిమతెగల ప్రజలు రుణపడి ఉన్నారు. అలాగే బలహీన వర్గాలు, అల్పసంఖ్యాకులు కూడా.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా అంబెవాడ అనే చిన్న గ్రామంలో 1891 ఏప్రిల్ 14న జన్మించారు. బాల్యం నుంచి తను అనుభవించిన కష్టాలు మరెవరికీ రాకూడదని, అంటరానితనం పేరిట జరుగుతున్న వివక్షను తొలగించడానికి అహరహం కృషి చేసి ఇరవయ్యేళ్లకే ఈ దేశంలోని కులాల సమస్యను గ్రంథస్తం చేసిన మేధావి.

భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 68 ఏళ్లు గడుస్తున్నా అంబేడ్కర్ ఆలోచనా విధానాలు, దళిత, గిరిజనులు ఇంకా వెనుకబడి ఉండటానికి గల కారణాలను ఇప్పటిదాకా కేంద్రం, రాష్ట్రాల్లోని పాలకులు అధ్యయనం చేసిన దాఖలాలు లేవు. రాజ్యాంగంలో గిరిజనులకు చోటు కల్పించిన ప్రత్యేక హక్కులు, చట్టాలు, రిజర్వేషన్లు గమనిస్తే బీఆర్ అంబేడ్కర్‌ను గిరిజనులు ఆత్మ బంధువుగా పరిగణిస్తున్నారు.

(నేడు బీఆర్ అంబేడ్కర్ 63వ వర్ధంతి)

– గుమ్మడి లక్ష్మీనారాయణ,
ఆదివాసీ రచయితల సంఘం
మొబైల్ : 94913 18409

# అసలు నేరస్తులు ఎవరు?

విశ్లేషణ



మాడభూషి శ్రీధర్

దిశను దారుణంగా హతమార్చిన దుర్మార్గులకు మరణ దండన విధించాలనేవారు కొందరయితే, వాళ్లను ఇంకా ఎందుకు బతకనిస్తున్నారు వెంటనే చంపేయండి, లేకపోతే మీకు తుపాకులెందుకు అని పోలీసులను రెచ్చగొట్టేవారు ఇంకెందరో. ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో అడ్డూ అదుపులేకుండా నోటికి వచ్చింది రాస్తున్నారు. మరణదండన వద్దనే వారిని తిడుతున్నారు. లైంగిక నేరాల బాధితులను వివరించే చిత్రాలను చూపవద్దని, వారి పేర్లు వెల్లడి చేయవద్దనే నియమాలను పట్టించుకోకుండా హతురాలి పేరు రాసి, ఫొటోలు వేసి నేరాలు చేసినవారు కోకొల్లలు. సభ్యత సంస్కారాలు కనీస జ్ఞానం కూడా లేకుండా చదువుకున్నవారు, రచయితలు, కవులు, ఫేస్‌బుక్ నీతివంతులు కూడా ఇష్టంవచ్చినట్టు అనవసరంగా ఈ నేరాలు చేస్తూ, రేప్ నేరగాళ్లను కఠినంగా శిక్షించాలని కోరే అర్హత ఉందా? చాటుమాటుగా సాగిన అత్యాచారాన్ని మాటలతో మళ్లీ చేయడంతో సమానం–బాధితురాలి వివరాలు ఫొటోలు ప్రచురించడం. నాలుగైదు రోజులపాటు మీడియాలో, సోషల్ మీడియాలో బాధితురాలి వివరాలను బాధ్యతారహితంగా వాడిన తరువాత పోలీసు ఉన్నతాధికారి సజ్జనార్ ఆమె పేరు దిశ అని మార్చి పుణ్యం కట్టుకున్నారు. రేప్ బాధితురాలు బతికి ఉంటే ఆమెను వైద్యంపేరుతో మెడికల్ రేప్‌నకు గురిచేస్తారు. పోలీసులు దర్యాప్తు రేప్‌నకు పాల్పడతారు. తరువాత కేసు విచారణ పేరుతో లాయర్లు లీగల్ రేప్‌తో బాధిస్తారు. ఇక సందర్భం వచ్చిన ప్రతిసారీ పత్రికల కలం వీరులు టీవీల కెమెరా వీరులు మీడియా రేప్ సాగిస్తూ ఉంటారు. సందర్భం ఉన్నా లేకపోయినా వారి వివరాలు రాస్తూ ఫేస్‌బుక్ వగైరాలలో మాటల అత్యాచారాలు నిర్వహించే నీతిమంతులకు లెక్కే లేదు.

ఇటువంటి వాటికి అందరినీ జైళ్లలో పెట్టడం సాధ్యం కాదు. కానీ లైంగిక నేరాల బాధితులైన బాలికలు, మహిళల పేర్లు వెల్లడిచేస్తే రెండేళ్ల కఠిన లేదా సాధారణ కారాగార శిక్ష విధించాలని సెక్షన్ 228ఏ వివరిస్తున్నది. ఐపీసీ సెక్షన్లు 376, 376ఏ, 376బి, 376సి, 376డిలో లైంగిక నేరాల నిర్వచనాలు ఉన్నాయి, ఈ నేరాలలో బాధితురాలి పేరును ప్రచురించినా, లేదా మరేరకంగానైనా వెల్లడించినా (వచన కవితలతో సహా) రెండేళ్ల కఠిన లేదా సాధారణ కారాగార శిక్షను, దాంతోపాటు జరిమానా కూడా విధించవచ్చు. పరిశోధనకు దర్యాప్తునకు అవసరమనుకున్నపుడు పోలీసు అధికారి లిఖితపూర్వక అనుమతితో బాధితురాలి పేరును ప్రస్తావించవచ్చు. లేదా బాధితురాలు లిఖితపూర్వక అనుమతితో ప్రచురించవచ్చు. బాధితురాలు జీవించి లేకపోతే లేదా మానసిక స్థిమితం లేకపోతే ఆమె దగ్గరి బంధువు లిఖిత పూర్వకంగా సంబంధిత సంక్షేమ సంస్థ అధ్యక్షుల ద్వారా అనుమతి ఇచ్చి ఉంటే ప్రచురించవచ్చు. కోర్టు వ్యవహారాలలో పేరు రాయడం తప్పనిసరి అనుకుంటే కోర్టు అనుమతితో ప్రచురించవచ్చు. ఈ సెక్షన్ కింద ఇచ్చిన ఒక వివరణలో, హైకోర్టు సుప్రీంకోర్టు తీర్పులో బాధితురాలిపేరు ప్రచురించడం నేరం కాదని పేర్కొన్నారు. అంటే సుప్రీం కోర్టు హైకోర్టు కాకుండా మరే కోర్టు తీర్పులోనైనా బాధితురాలి పేరు రాయడం నేరమే అవుతుందని చాలా స్పష్టం.

క్రిమినాలజీ అని ఒక బోధనాంశం ఉంది. అందులో నేరాలుచేయడానికి సామాజిక కారణాలు ఏమిటి అని పరిశోధిస్తారు. బోధిస్తారు. చాలా కాలం కిందట అక్కినేని నాగేశ్వరరావు నిర్మించి నటించిన సుడిగుండాలు సినిమాలో కుటుంబంలో పరిస్థితులు, సమాజంలో బలహీనతలు, లోపాలు, పత్రికలు, డిటెక్టివ్ లేదా అశ్లీల నవలలు (ఆనాటి మీడియా) లో వచ్చిన రాతలు, నిరుద్యోగం వల్ల పనిలేని తనం, విచ్చల విడిగా పారే మద్యం, టోకు మద్యం దుకాణాలుగా మారిపోయి, ఆ సొమ్ముమీద బతికే అవినీతి ప్రభుత్వాలు ఏ విధంగా ఒక కౌమార వయస్కుడైన జులాయిని హత్యచేసే స్థాయికి దిగజార్చాయో వివరిస్తూ, అతని నేరానికి దోహదం చేసిన వారు నేరగాళ్లు కారా, అయితే ఎవరెవరిని, ఎందరిని, ఉరి తీయాలి? అని ప్రశ్నిస్తాడు కథానాయకుడు. దిశ విషయంలో కలం వీరులు బాధితురాలి ఫొటో చూపడానికి కారణాలేమిటి? ఈనేరానికి వేలాది మందిని రెండేళ్ల పాటు జైళ్లలో పెట్టడానికి ముందుగా జైళ్లు కట్టాలి. కడదామా? తరువాత మేపడానికి తిండి ఏర్పాట్లు చేయాలి. చేద్దామా?

వ్యాసకర్త బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్,
కేంద్ర సమాచార మాజీ కమిషనర్
madabhushi.sridhar@gmail.com

# దైవప్రేమ అనంతం

ప్రేమ అనేది మానవ నైజంలో నిబిడీకృతమైఉన్న ఒక సహజ గుణం. ఆమాటకొస్తే, సృష్టిలోని సమస్త జీవరాసుల్లోనూ ఇది ఉంటుంది. మనం మన తల్లిదండ్రుల్ని, పెద్దల్ని, గురువుల్ని ప్రేమిస్తాం, గౌరవిస్తాం. ఎందుకూ? వారు మన మేలుకోరేవారు. బాగుకోరేవారు. మన ఉన్నతిని కాంక్షించేవారు. మన శ్రేయోభిలాషులు. వారి ప్రేమాభిమానాలు, కారుణ్య వాత్సల్యాలు అనునిత్యం మనపై ప్రసరిస్తున్నాయి. చేసిన మేలును గుర్తించడం, చేసిన వారిపట్ల కృతజ్ఞత చూపడం మానవ నైజంలో ఉండే సహజ గుణం. ఉపకారి ముందు వినయ వినమ్రతలు కలిగిఉండడం, వారి అభీష్టానికి అనుగుణంగా నడుచుకోవడం, వారు చెప్పింది చేయడం, వారి ఇష్టానికి వ్యతిరేకంగా నడుచుకోకపోవడం వారిపట్ల విధేయతకు, అంకితభావానికి నిదర్శనం.

కానీ ఇంతకన్నా ఎక్కువ, లెక్కకు మిక్కిలి మేళ్ళు, ఉపకారాలు, అనుగ్రహాలు, వరాలు దైవం మనందరిపై కురిపించాడు. ఆ కరుణామయుని




అనుగ్రహం, కారుణ్య ఛాయ సమస్తాన్నీ పరివేష్టించి ఉంది. గుడిసెవాసులపై అయినా, భవన వాసులపై అయినా, అడవుల్లో అయినా, మైదానాల్లో అయినా, కనుచూపుమేర ఎటుచూసినా, ఎక్కడ చూసినా రేయింబవళ్ళు, ప్రతినిత్యం, అనుక్షణం ఆయన కారుణ్యానుగ్రహాలు కుండపోతగా వర్షిస్తూనే ఉన్నాయి. ఆయన దాహార్తుల దాహాన్ని, అన్నార్తుల క్షుద్బాధను తీరుస్తున్నాడు. వస్త్రవిహీనులకు ఆచ్ఛాదన ప్రసాదిస్తున్నాడు. సమస్త ప్రాణుల సుఖమయ జీవనానికి సమతుల ప్రకృతిని సిద్ధంచేసి పెట్టాడు. ఆయన సకల లోకాలకు అధిపతి. క్షమానిధి. అన్నీ చూసేవాడు, అన్నీవినేవాడు. నిదుర పోనివాడు. కునుకురానివాడు. అలసిపోనివాడు. అలుపులేనివాడు. అన్నిటిపై అధికారం కలిగిన వాడు. పాలించేవాడు, పోషించేవాడు. అధికుడు, ఆధిక్యుడు. సర్వవ్యాపి. సర్వాంతర్యామి. జీవన్మరణాల విధాత, ప్రదాత.

అలాంటి పరమ ప్రభువు, కరుణామయుడైన ఏకైక దైవాన్ని మనసారా విశ్వసించి, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ, సత్కర్మలు ఆచరిస్తే, ఇహపర లోకాల్లో సాఫల్య శిఖరాలను అధిరోహించవచ్చు. దైవం మనందరికీ సద్బుద్ధిని ప్రసాదించుగాక!

– యం.డి.ఉస్మాన్ ఖాన్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శుక్రవారం ॥ 6-12-2019


అమ్మాయిలూ.. బ్యాగులో పెప్పర్‌స్ప్రే పెట్టుకోండి
– సినిమా పేజీలో


ట్యూనిక్.. యూనిక్
– ఫ్యాషన్ పేజీలో

# ఒడిదుడుకులు తట్టుకుంటేనే విజయం సాధిస్తాం

## షోలాపూర్ తొలి తెలుగు మహిళా మేయర్ కాంచన యెన్నం

**షోలాపూర్ మున్సిపల్ కార్పొరేషన్ (ఎస్‌ఎంసీ) మేయర్‌గా ఉమ్మడి మెదక్ జిల్లా సదాశివపేటకు చెందిన తెలుగు మహిళ యెన్నం కాంచన ఎన్నికై రికార్డు సృష్టించారు. షోలాపూర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బుధవారం జరిగిన రెండవ టర్మ్ మేయర్ ఎన్నికల్లో యెన్నం కాంచన ఘన విజయం సాధించారు. అత్యంత సంపన్నమైన మున్సిపల్ కార్పొరేషన్‌గా గుర్తింపు పొందిన ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌లో రెండేళ్ల క్రితం కృష్ణవేణి రెడ్డి కార్పొరేటర్‌గా విజయం సాధించిన సంగతి తెలిసిందే. తాజాగా మరో తెలుగు మహిళ కాంచన యెన్నం ఏకంగా మేయర్ పదవిని కైవసం చేసుకోవడం విశేషం. ఈ సందర్భంగా 'సాక్షి'తో ఆమె ముచ్చటించారు.**

పెళ్లి తర్వాతే తన జీవితంలో మార్పు వచ్చిందని కాంచన యెన్నం అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఘనపూర్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన ఈగె అయిలప్ప, విజయలక్ష్మి దంపతులకు జన్మించిన కాంచన షోలాపూర్‌లోనే పుట్టి పెరిగారు. స్థానిక డీఆర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో 10వ తరగతి వరకు విద్యాభ్యాసం


యెన్నం కాంచన

కొనసాగించిన... [continued:] ...క్కుకునేలా చేయగలగడంతో ఆమెలో ఆత్మ విశ్వాసం ఏర్పడింది.

**భర్త ప్రేరణ, ప్రోత్సాహం**

సమాజసేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న సమయంలోనే కాంచనకు రాజకీయాల్లోకి అరంగేట్రం చేసే అవకాశం లభించింది. ''1997లో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మేముండే మార్కండేయనగర్ వార్డు మహిళ కోటాలోకి రావడంతో ఈ వార్డు నుంచి టికెట్ కోసం నా భర్త తీవ్రంగా కృషి చేశారు. ఆయన ఏ పార్టీకోసం పాటు పడుతున్నారో, ఆ పార్టీనే తనను పక్కన పెట్టేసరికి ఇద్దరం పార్టీ మారాం. ఇలా సుమారు గత 22 సంవత్సరాలుగా మేము బీజేపీలో కొనసాగుతున్నాం. 2002లో బీజేపీ నాకు మార్కండేయనగర్ వార్డు (షోలాపూర్ కార్పొరేషన్) నుంచి టికెట్ ఇచ్చింది. అలా నేను నేను మొట్టమొదటిసారిగా కార్పొరేటర్‌గా విజయం సాధించి కార్పొరేషన్‌లో అడుగుపెట్టాను. అప్పటినుంచి ఇప్పటి వరకు జరిగిన నాలుగు ఎన్నికల్లో వరుసగా విజయం సాధించాను'' అని కాంచన తెలిపారు.

**ఊహించని విజయం**

అయితే మేయర్ పీఠం దక్కుతుందని మాత్రం తను ఊహించలేదని కాంచన అన్నారు. ''బీజేపీ నన్ను అభ్యర్థిగా ప్రకటించింది. నాకు పోటీగా శివసేనకు చెందిన సారిక పిసే, కాంగ్రెస్‌కు చెందిన ఫిర్దోస్ పటేల్, ఎంఐఎంకు చెందిన శహజిదా బానో శేఖ్ బరిలోకి దిగారు. అయితే ఎన్నికకు ముందు సారిక పిసే, ఫిర్దోస్ పటేల్‌లు తప్పుకోవడంతో బానో శేఖ్‌తో నాకు పోటీ ఏర్పడింది. బీజేపీని అధికారానికి దూరంగా ఉంచాలని శివసేన, కాంగ్రెస్, ఎన్సీపీ, ఎంఐఎంలు జత కట్టాయి. కాని ఎన్నికకు ఒక రోజు ముందే వీడిపోయారు. దాంతో ఈ ఎన్నికలో నాకు 51 ఓట్లు పోలవ్వగా బానో శేఖ్‌కు కేవలం ఎనిమిది ఓట్లు పోలయ్యాయి. ఇలా ఊహించని విధంగా భారీ మెజార్టీతో విజయం సాధించగలిగాను'' అని ఆమె చెప్పారు.

**ఆదర్శ కార్పొరేటర్**

కాంచన యెన్నం అనేక పదవులను అలంకరించారు. సుమారు 17 ఏళ్లనుంచి కార్పొరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పార్టీ పరంగా ప్రస్తుతం షోలాపూర్ బీజేపీ వర్కింగ్ కమిటి కార్యదర్శిగా కొనసాగుతున్నారు. దీంతోపాటు ఇందిరా మహిళ సహకార బ్యాంకుకు వైస్ చైర్మన్‌గా, షోలాపూర్ మన్సిపల్ కార్పొరేషన్


కుటుంబ సభ్యులతో (భర్త, కుమారుడు, అల్లుడు, కుమార్తె, మనుమడు) యెన్నం కాంచన

(ఎస్‌ఎంసి) మహిళ సంక్షేమ కమిటీ సభ్యురాలిగా, అదేవిధంగా ఎస్‌ఎంసిలోని పలు పదవులను అలంకరించారు. 2016–17లో స్టాండింగ్ కమిటి చైర్మన్‌గా కూడా ఉన్నారు. ఆదర్శ కార్పొరేటర్ అవార్డు అందుకున్నారు. రాజకీయాల్లోనే కాదు ఏ పనిలోనైనా జీవితంలో ఒడిదుడుకులు రావడం సహజమని కాని వాటిని తట్టుకుంటేనే విజయం లభిస్తుందని కాంచన యెన్నం అంటారు.

చేశారు. అనంతరం కాంచనకు ఉమ్మడి మెదక్ జిల్లా సదాశివపేటకు చెందిన యెన్నం రమేష్‌తో 1992లో వివాహం జరిగింది. సాధారణ గృహిణిగానే జీవితాన్ని ప్రారంభించినప్పటికీ ఆమె భర్త రమేష్ రాజకీయాల్లో తిరుగుతుండడం చూసి ఆమెకు కూడా కూడా గృహిణిగా బాధ్యతలు నిర్వహిస్తూనే సమాజసేవ చేయాలన్న సంకల్పం కలిగింది. దాంతో బీడీ కార్మికులు, కుట్టు పనులు చేసే మహిళలు తదితరుల కోసం పొదుపు సంఘాలు ఏర్పాటు చేసి వారు ఆర్థికంగా నిలదొ

– గుండారపు శ్రీనివాస్, మావునూరి శ్రీనివాస్
సాక్షి, ముంబై

---

అన్న ఉంటే కొండంత అండ ఉన్నట్లేనని
భావిస్తుంది ఏ ఆడబిడ్డ అయినా!
కాని అదే అన్న.. పరాయి ఆడపిల్ల పట్ల
అసభ్యంగా ప్రవర్తించాడని తెలిస్తే..
తోడపుట్టిన వాడు లేడని
చెప్పకోవడానికీ వెనకాడదు!
గౌరవ మర్యాదలు
ఏ అమ్మాయికైనా ఒకటే కాబట్టి
వాటిని లెక్కచేయనివాడు
తోబుట్టువైనా సరే క్షమించదు.
తనకసలు తోడే పుట్టలేదనుకుంటుంది.
'దిశ' నిందితుల అక్కాచెల్లెళ్లూ
అదే చేస్తున్నారు.. తోటి వాళ్లముందు
తమను తలెత్తుకోనివ్వకుండా
శిక్ష వేసిన అన్నదమ్ములు
తమకు లేరనే నిర్ణయానికి వచ్చారు!


ప్రతీకాత్మక చిత్రం

# తోబుట్టువుల తీర్పు

**ఈ** యేడాది (2019) జూన్‌లో 'ఆర్టికల్ 15' అనే హిందీ సినిమా వచ్చింది. అస్పృశ్యతా నేరాన్ని చర్చించిందీ సినిమా ఇద్దరు అమ్మాయిల మీద చేసిన లైంగిక దాడి, హత్య నేపథ్యంలో. ఉత్తర ప్రదేశ్‌లో జరిగిన వాస్తవ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. సరే.. ఆ విషయం పక్కన పెడితే.. ఈ సినిమాలో దిశ ఘటనను పోలి ఉన్న అంశం ఒకటి ఉంది. ''ఆర్టికల్ 15''లో ఇద్దరు అమ్మాయిల హత్యకేసును ఛేదించే ప్రయత్నంలో ఉన్న ఐపీఎస్ ఆఫీసర్‌కు ఒక నిజం తెలుస్తుంది. ఆ రేప్, హత్యానేరంలో తన ఇంట్లో పని చేసే టీన్స్ అమ్మాయి అన్న కూడా భాగస్తుడని. చెల్లెలి పట్ల ఎంతో ప్రేమగా, బాధ్యతగా ఉండే ఆ అన్న ఇలాంటి పని ఎలా చేశాడో మింగుడుపడదు ఆ ఐపీఎస్ ఆఫీసర్‌కి. తల్లీతండ్రిని ఆ అన్నలోనే చూసుకుంటున్న ఆ సోదరి ఈ వాస్తవం విని ఎలా తట్టుకుంటుందో? అని మథన పడ్తాడు. చెప్పేస్తాడు కూడా... ''అంతటి దారుణానికి బలైన ఆ ఇద్దరు నీ ఈడు పిల్లలే. నీలాంటి వాళ్లే. జీవితం పట్ల ఎన్నో ఆశలు, కలలు కన్నవాళ్లే. నీ కోసం అంత కష్టపడే నీ అన్ననే ఆ పిల్లల పట్ల ఇలా ప్రవర్తించాడు'' అంటూ. అంతా విన్న ఆ అమ్మాయి షాక్ అవుతుంది. తేరుకున్నాక ఏడుస్తుంది. అన్న మీద ఉన్న నమ్మకం పోయి.

ఇంచుమించు ఇలాంటి స్థితిలోనే ఉన్నారు 'దిశ' నిందితుల తోబుట్టువులు. ఆరిఫ్, నవీన్‌కు చెల్లెళ్లు, జొళ్ల శివ, చెన్నకేశవులుకు అక్కలు ఉన్నారు. తమ అన్న, తమ్ముళ్లు చేసిన పనికి సిగ్గు పడ్తున్నారు. తలెత్తుకొని నలుగురిలోకి రాలేకపోతున్నారు. ఆరిఫ్ చెల్లెలు అయితే ఆ ఊర్లోంచే వెళ్లిపోయి బంధువుల ఇంట్లో ఉంటోంది. మిగిలిన వాళ్లూ అంతే.. అవమానభారంతో అజ్ఞాతాన్నే కోరుకుంటున్నారు.

**నేనొక్కదాన్నే పుట్టాననుకో..**

ఈ మాట అంటున్నది ఆరిఫ్ చెల్లెలు. ''నేనూ ఒక ఆడపిల్లనే. నాలాంటిదాని మీదే అఘాయిత్యం చేశాడు అన్న. ఆ పనికి అన్నకు ఏ శిక్ష పడినా బాధపడకు అమ్మా..! అన్న పుట్టనేలేదనుకో. నేనొక్కదాన్నే పుట్టాననుకో. నేను మిమ్మల్ని పోషిస్తా. అన్న జైలుకి వెళ్లినా తిరిగిరాడు. తప్పు చేసిన అన్న గురించే నువ్వు ఇంత బాధ పడ్తుంటే అవతల ఏ తప్పూ లేకుండా కూతుర్ని పోగొట్టుకున్న ఆ తల్లిదండ్రులు ఎంత బాధపడ్తూండాలమ్మా..! అందుకే అన్న గురించి ఆలోచించడం మానెయ్'' అని వాళ్లమ్మకు చెప్తోంది ఆరిఫ్ సోదరి. పదవ తరగతి చదివిన ఆ అమ్మాయి తొందరగా పై చదువులు పూర్తి చేసి మంచి ఉద్యోగంలో స్థిరపడాలనుకుంటోంది.

**మొహమెట్లా చూపించాలి?**

నవీన్ చెల్లెలు ఎనిమిదవ తరగతి చదువుతోంది. అన్న చేసిన దారుణమైన పనికి భయంతో వణికిపోతోంది. ఆ దుర్ఘటన వెలుగు చూసినప్పటి నుంచి బడికి వెళ్లాలన్నా భయపడుతోంది. స్కూల్లో తోటి విద్యార్థులతో ఇమడలేక.. వాళ్లతో కలవలేక.. బడికి వెళ్లడమే మానుకుంది. ''స్కూల్లో నా ఫ్రెండ్స్‌కి ఎట్లా మొహం చూపించాలి? నాతో కాదు'' అంటూ ఏడుస్తోందట.

**ఏ శిక్ష విధించినా సరే..**

చెన్నకేశవుల అక్క కూడా ఇంచుమించు ఇంతే. తమ్ముడు చేసిన పనికి అటు అత్తగారి ఊర్లో, ఇటు పుట్టిన ఊర్లో ఎదురయ్యే అవమానాలను తలుచుకొని ఇంటి గడపదాటడమే మానేసింది.చెన్నకేశవులుకి పెళ్లయింది. భార్య ప్రస్తుతం గర్భవతి. ''తన భార్యా ఒక ఆడదే అని మరిచి ఆ ముగ్గురితోపాటు నా మొగుడు ఇంకో ఆడపిల్లను చంపాడు. ఇందుకు అతనికి ఏ శిక్ష విధించినా సరే! ఇంకో రెండు నెలల్లో బిడ్డ పుడతాడు. వాళ్ల నాన్న గురించి వాడికి ఏమని చెప్పాలి? వాడు అట్లా కాకుండా అయితే చూసుకోవాలి కదా! నా తల రాత ఇట్లా రాసి ఉంది మరి.. ఏం చేయాలి?'' అని వాపోతోంది చెన్నకేశవులు భార్య.

ఆ నలుగురూ కనీసం ఈ అయిదుగురు ఆడవాళ్ల గురించి ఆలోచించినా.. వాళ్ల ప్రవర్తనతాలూకు పర్యవసానాలను వీళ్లు భరించాల్సి ఉంటుందని గ్రహించగలిగినా ఈరోజు వీళ్లు ఇలా సిగ్గుతో తలవంచుకునేవాళ్లు కాదు. ఇది అందరు అన్నలు, తమ్ముళ్లు, కొడుకులు, తండ్రులు, భర్తలు ఆ మాటకొస్తే మొత్తం పురుషులకే పాఠం.

ఈ నలుగురి తల్లిదండ్రులకు తమ పిల్లలు చేసిన నేరం తీవ్రత తెలియదు. అందరివీ పేద కుటుంబాలే. కూలీనాలీ చేస్తూ పిల్లలను పెంచారు. ఆ నలుగురిలో ఆరిఫ్ ఒక్కడే పదవ తరగతి వరకు చదివాడు. మిగిలిన ముగ్గురు ఏడుతో ఆపేశారు. జల్సాలు, బైక్ మీద తిరగడాలు, మద్యం తాగడమే వాళ్లకు తెలిసినవి. గమనించదగ్గ విషయమేంటంటే.. ఈ ముగ్గురూ ఊళ్లో ఏడవ తరగతి వరకే ఉండడంతో అంతదాకే చదివి మానేశారు. కాని ఈ ఇంటి ఆడపిల్లలు పక్క ఊరికి వెళ్లి మరీ చదువుకుంటున్నారు. అందుకే ఆడపిల్లల పట్ల కాదు మనం శ్రద్ధ పెట్టాల్సింది మగపిల్లల పెంపకం మీద. పేదింట్లో అయినా.. పెద్దింట్లో అయినా!

– ఆనంద్‌కుమార్ గౌడ్,
సాక్షి, నారాయణపేట.

---

వైరల్ వీడియో

# ఆవేదన లోంచి ఓ ఆలోచన

**మ**గవారు ఇంట్లో తలుపులు వేసుకుని ఉంటేనే మహిళలకు రక్షణ అంటున్నారు ఒక మహిళ. ఆ మహిళ పోస్టు చేసిన ఒక వీడియో ఇప్పుడు బాగా వైరల్ అవుతోంది. 'దిశ' ఘటనకు స్పందనగా విడుదలైన వీడియో అది. ఆ మహిళ చేతిలో ఒక ప్లకార్డు ఉంది. దాని మీద 'షీ గాట్ రేప్డ్', 'హీ రేప్డ్' అని రెండు నినాదాలు రాసి ఉన్నాయి. మొదటి నినాదం పక్కన ఉన్న బాక్స్‌లో ఇంటూ మార్క్, రెండో నినాదం ముందున్న బాక్స్‌లో రైట్ మార్క్ ఉన్నాయి. వీడియోలో ఈ మహిళ చెబుతున్న మాటలు అందరినీ ఆలోచింపచేసేవిగా ఉన్నాయి. 'మహిళ రేప్ చేయబడింది' అని మొదటి నినాదానికి అర్థం. 'ఒక మగవాడు బలాత్కరించాడు' అనేది రెండో నినాదం. మొదటి నినాదం సరైనది కాదు అని ఈ ప్లకార్డు అంతరార్థం.

''రాత్రి ఏడు గంటల తరవాత మహిళలు ఇంటి దగ్గరే ఎందుకు ఉండాలి, పురుషులే ఉండొచ్చుగా. ఈ విషయాన్ని ప్రచారంలోకి తీసుకురావాలి. మగవారంతా రాత్రి ఏడు గంటల లోపు ఇంటికి వచ్చి, తలుపులు వేసుకుని ఇంట్లో ఉండాలి. అప్పుడే మహిళలకు రక్షణ. నన్ను ఒక పోలీసు రక్షించాలని కోరుకోను, నా అన్నదమ్ములు నాకు రక్షణగా ఉండాలని కోరుకోను. మహిళల మీద జరుగుతున్న అరాచకాలకు కారణం పురుషుడు. అందువల్ల పురుషులు రాత్రి ఏడు గంటల లోపు ఇంటికి చేరుకుంటే, ప్రపంచమంతా స్వేచ్ఛగా విహరించగలదు'' అని ఆ మహిళ ఆవేదనగా, ఆలోచింపచేసేలా మాట్లాడారు. ఈ వీడియో మీద ఇంటర్నెట్‌లో చర్చ జరుగుతోంది. చాలామంది నెటిజన్లు, 'ఒక భారతీయ స్త్రీ చెప్పాలనుకుంటున్న విషయాన్ని ఈ మహిళ ధైర్యంగా చెబుతున్నారు' అని ఆమెను ప్రశంసిస్తున్నారు.



వైరల్ అవుతున్న వీడియోలోని మహిళ

---

యువశక్తి

# చెట్టుకు చొక్కా

**రాత్రి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. చలి వణికించేస్తోంది. పగలు నిడివి తగ్గిపోయింది. అంత మాత్రాన డ్యూటీ టైమ్ మారదు. ఆఫీస్‌లు వాటి టైమ్ వరకు అవి పనిచేస్తూనే ఉంటాయి. ఉద్యోగులు ఆ చలిలోనే చేతులను వెచ్చని ఉలెన్ జాకెట్‌లలో చొప్పించుకుని కనిపించిన ఆటోలు, క్యాబ్‌లలో ఇంటిదారి పడుతుంటారు. ఆటో ఎక్కిన వాళ్ల సంగతి సరే. ఆటో నడిపే వాళ్ల చలి మాటేమిటి?**


గృహిణి.. ఆటోవాలా.. డొమెస్టిక్ వర్కర్

**ఒ**క ఆటో డ్రైవర్ చలి జాకెట్ కొనాలంటే అంత సులభమేమీ కాదు. ఆ డబ్బుతో ఒక నెల ఇంటి అద్దె గడిచిపోతుంది. పిల్లల స్కూలు ఖర్చులు గుర్తుకు వస్తుంటాయి. ఆటో డ్రైవర్ అనే కాదు, ఇళ్లలో పనులు చేసుకునే డొమెస్టిక్ వర్కర్ల పరిస్థితి కూడా అంతకంటే మెరుగ్గా ఏమీ ఉండదు. వణికించే చలిలో ఉదయాన్నే పనులకు పోవాలి. కప్పుకున్న రగ్గు వెంటరాదు, సంపన్నుల లాగ ఉలెన్ జాకెట్‌లు కొనడానికి చేతిలో డబ్బు ఉండదు. సరిగ్గా ఇలాంటి అవసరాలనే గుర్తించింది బెంగళూరు యువత. తమ దగ్గర గత ఏడాది, అంతకు ముందు కొనుక్కున్న ఉలెన్ జాకెట్‌లు తీసుకు వచ్చి రోడ్డు పక్కన ఉన్న చెట్లకు తగిలించారు వాళ్లు! ఆ చొక్కాలు, జాకెట్‌ల మీద 'మీకు వీటి అవసరం ఉంటే తీసుకోండి' అని పెద్ద అక్షరాలతో రాసి ఉంచారు. ఆ దారిన వెళ్తున్న ఆటోవాలాలు, డొమెస్టిక్ వర్కర్లు, భవన నిర్మాణ రంగ కూలీలతో ఇతర పనులు చేసుకునే వాళ్లు 'రాజరాజేశ్వరీ నగర్ రెసిడెంట్స్ ఫోరమ్ (ఆర్‌ఆర్‌ఎఫ్)'కి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుని వాటిని తీసుకుని ధరిస్తున్నారు.

**'ఫ్రీ ఆన్ ట్రీ' మూవ్‌మెంట్**

ఈ ఉద్యమం మొదలు కావడానికి స్ఫూర్తినిచ్చిన సంఘటన బల్గేరియా, హంగరీలేనని చెప్తారు ఆర్‌ఆర్‌ఎఫ్ వ్యవస్థాపకులు శ్రీకాంత్. బల్గేరియా, హంగరీ వంటి దేశాల్లో చెట్లకు చొక్కాలు తొడుగుతారు. పేదవాళ్లు, తలదాచుకోవడానికి ఇల్లు లేని వాళ్ల కోసమే ఇలా చేస్తారన్నమాట. మన దగ్గర రెండు ఉంటే ఒకదానిని అవసరమైన వారితో పంచుకోవడమే ఇందులో ఉన్న మానవత్వం. ఫేస్‌బుక్‌లో ఈ పోస్టులు చూసిన శ్రీకాంత్ తన ఫ్రెండ్స్‌తో వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేసి తన ఆలోచన చెప్పాడు. అతడు తనవంతుగా పద్నాలుగు స్వెటర్‌లను కొన్నాడు. శ్రీకాంత్ అన్నేసి స్వెటర్‌లు ఎందుకు కొంటున్నాడో తెలుసుకున్న దుకాణదారు వాటిని డిస్కౌంట్‌తో మూడు వేల ఐదు వందలకే ఇచ్చాడు. ఫ్రెండ్స్ అందరూ తమ దగ్గర ఉన్న స్కార్ఫ్‌లు, స్వెటర్‌లు, జాకెట్‌లు, మంకీ క్యాప్‌లు, దుప్పట్లు, రగ్గులలో వాడడానికి పనికి వచ్చే వాటిని మొత్తం 350 వరకు తెచ్చారు. ఆ స్వెటర్‌లు, జాకెట్‌లను పార్కుల్లో చెట్లకు, రోడ్డు పక్కన ఉన్న చెట్లకు తగిలించి రెస్పాన్స్ కోసం చూశారు. అరగంటలోపే వారు ఆశించిన దానికంటే మంచి రెస్పాన్స్ కనిపించింది. ఇది చూసిన తర్వాత బూట్లు కూడా చేర్చాలనే నిర్ణయానికి వచ్చిందీ టీమ్. చలికాలంలో వచ్చే అనేక అనారోగ్యాల నుంచి వాళ్లను కాపాడడం కోసమే ఇలా చేస్తున్నామని చెబుతున్నారు ఈ యువతీ యువకులు. చలికాలం పోయిన తర్వాత కూడా సర్వీస్‌ని ఆపకూడదని, పుస్తకాలు, పిల్లల ఆటవస్తువుల వంటి ఇతర వస్తువులను పంచాలని అనుకుంటున్నారట. అయితే ఒక్క హెచ్చరిక మాత్రం చేస్తున్నారు. 'ఈ సర్వీస్ అవసరమైన వాళ్లకు మాత్రమే. కాబట్టి వీటిని తీసుకువెళ్లి వృథా చేయడమో లేక ఇతరత్రా వ్యాపకాలకు వినియోగించడం వంటివి చేయరాదు' అని సున్నితంగానే చెబుతున్నారు.

– మంజీర


'ఫ్రీ ఆన్ ట్రీ' మూవ్‌మెంట్ యువబృందం



టర్కీ బల్గేరియా ఇచ్చిన స్ఫూర్తి

---

చెట్టు నీడ

# స్వర్గం.. నరకం

**ఖ**లీఫా తన సతీమణితో ప్రియభాషణలో ఉన్నారు. నవ్వులాటకు.. 'నేనెలా ఉన్నాను' అని రాణిగారిని అడిగారు. 'తమరు నరకవాసిలా కనిపిస్తున్నారు!' అని ఆమె కిల కిలా నవ్వారు. ఖలీఫా కోపం కట్టలు తెంచుకుంది. కళ్లెర్రచేసి.. ''నేను నరకవాసినా! నేను నరకవాసినయితే తక్షణం నిన్ను త్యజిస్తున్నాను'' అని మూడుసార్లు అనేశారు ఖలీఫా. మహారాణి రోదన మిన్నంటింది. కాస్సేపయిన తరువాత ఖలీఫా కోపం చల్లబడింది. అయితే 'త్యజించాను' అని చెప్పేశాక చేసేదేముంటుంది? మరుసటి రోజు ఖలీఫా దర్బారులో ఉలేమాలందరినీ సమావేశ పరిచి ''పరిష్కారం చెప్పండి'' అని అడిగారు. పరిష్కారం ఏమీ లేదన్నారు వారంతా. ఓ యువ పండితుడు మాత్రం లేచి నిలబడ్డాడు. ''మీరు త్యజించినట్లు కాదు. మీరు షరతు పెట్టి మరీ త్యజించారు. 'నేను నరకవాసినయితే నేను నిన్ను త్యజిస్తున్నాను' అని అన్నారు. మీరు నరకవాసియో కాదో ఎవరు తీర్మానిస్తారు? అది ఇంకా తీర్మానం కాలేదు. ఎవరయినా మీరు నరకవాసి కారు అని చెప్పగలిగితే మీరు త్యజించినట్లు అవదు'' అన్నాడు.

ఖలీఫా ప్రాణం లేచి వచ్చినట్లయింది. ''కాని నేను నరకవాసిని కానని తీర్మానించగలవారెవరు?' అని దిగాలుగా కూర్చుండి పోయాడు. మళ్లీ అదే యువ పండితుడు లేచి, ''అయ్యా మీరు నరకవాసి కాదు అని నేను తీర్మానిస్తాను. అయితే మీరు నా ప్రశ్నకు సరయిన సమాధానం ఇవ్వాలి. అప్పుడు నేను మీకు స్వర్గవాసి అయ్యే పత్రం ఇస్తాను'' అన్నాడు. ఖలీఫాలో ఆశ చిగురించింది. భయపడుతూనే.. ''సరే అడుగు!'' అన్నాడు.

''మీ జీవితంలో ఎప్పుడయినా పాపానికి ఒడిగట్టే అవకాశం ప్రాప్తమై, కేవలం దైవభీతి చేత మీరు ఆ పాపానికి ఒడిగట్టకుండా ఉన్నటువంటి సందర్భం ఏదయినా ఎదురయిందా?'' అని అడిగాడు యువ పండితుడు. ఖలీఫా క్షణమాగి, తల వంచుకునే – ''అవును. ఎదురైంది. నేనొకసారి నా శయన గృహంలోకి ప్రవేశించినప్పుడు ఓ సేవకురాలు నా గదిని శుభ్రపరుస్తూ ఉంది. నేను అడుగు పెట్టగానే తలెత్తి చూసింది. ఆమె ఎంతో అందంగా ఉంది. నా మనసు వికలమయింది. ఆమె నా ఆలోచనను ఇట్టే గ్రహించింది. ''అయ్యా అల్లాహ్‌కు భయపడండి, ఆయన మీకన్నా బలం గలవాడు''

**"మీ జీవితంలో ఎప్పుడయినా పాపానికి ఒడిగట్టే అవకాశం ప్రాప్తమయి, కేవలం దైవభీతి చేత మీరు ఆ పాపానికి ఒడిగట్టకుండా ఉన్నటువంటి సందర్భం ఏదయినా ఎదురయిందా?" అని ఆ యువ పండితుడు అడిగాడు. ఖలీఫా ఒక్క నిమిషం ఆగి, తలవంచుకునే – "అవును. ఎదురయింది" అని చెప్పాడు!**

అని మొర పెట్టుకుంది. అల్లాహ్ పేరు చెప్పగానే కంపించిపోయాను. వెంటనే ఆమెను అక్కడ నుంచి పంపించి వేశాను'' అని ముగించారు ఖలీఫా. అందుకు ఆ యువ పండితుడు.. 'తన ప్రభువు సమక్షంలో నిలబడటం పట్ల భయపడినవానికీ, ఆంతర్యాన్ని దుష్టవాంఛల నుండి నిగ్రహించిన వానికి నివాస స్థలం స్వర్గం'' అన్న ఖుర్‌ఆన్ వాక్యం ఆధారంగా మీరు స్వర్గవాసులు అని నేను తీర్మానిస్తున్నాను. కనుక 'త్యజిస్తున్నాను' అని మూడుసార్లు మీరు చెప్పిన మాట అమలు అవదు'' అని ముగించాడు. ఖలీఫా ఆనందభరితుడయ్యాడు. మహారాణి ఊపిరి పీల్చుకున్నారు.

– ముహమ్మద్ ముజాహిద్


● రాశీ ఖన్నా

# అమ్మాయిలూ.. బ్యాగులో పెప్పర్ స్ప్రే పెట్టుకోండి

"తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రస్తుతం నేను చాలా బిజీగా ఉన్నా. అందుకే బాలీవుడ్ వెళ్లాలనే ఆలోచన లేదు. తెలుగు, తమిళ్, హిందీ.. ఏ భాష అయినా మనం చేసే పాత్రలు బాగుండాలి. ఎక్కడ మంచి పాత్రలొస్తే అక్కడే చేయాలి. అంతేకానీ, బాలీవుడ్‌లో చేయాలని ప్రాధాన్యత లేని పాత్రలొస్తే చేయను. కొన్ని అవకాశాలు వచ్చాయి. కానీ, నాకు నచ్చక చేయలేదు" అన్నారు రాశీఖన్నా. వెంకటేశ్, నాగచైతన్య హీరోలుగా, రాశీఖన్నా, పాయల్ రాజ్‌పుత్ హీరోయిన్లుగా కేఎస్ రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వెంకీ మామ'. సురేష్ ప్రొడక్షన్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకాలపై సురేష్ బాబు, టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహనిర్మాత. ఈ నెల 13న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాశీఖన్నా చెప్పిన విశేషాలు.

● పాండిచ్చేరిలో ఓ సినిమా షూటింగ్‌లో ఉన్నప్పుడు సురేష్‌బాబు సార్ నా మేనేజర్‌కి కాల్ చేసి, నాతో మాట్లాడాలన్నారు. హైదరాబాద్ వచ్చేశా. 'వెంకీ మామ' గురించి చెప్పగానే కథ కూడా వినకుండా సురేష్ సార్‌పై ఉన్న నమ్మకంతో చేస్తానని చెప్పా. ఆ తర్వాత కథ విన్నాననుకోండి. పాత్ర ఏదైనా నా బెస్ట్ ఇవ్వాలనుకుంటాను.

● చిరంజీవి, వెంకటేశ్‌సార్ల సినిమాలు హిందీలో డబ్ అయినప్పుడు చూస్తుండేదాన్ని. వెంకటేశ్ సార్ కామెడీ టైమింగ్ చాలా బాగుంటుంది. ఆయన హావభావాలు భిన్నంగా ఉంటాయి. చైతన్యతో నటించడం సంతోషంగా ఉంది. నేను చేసే సినిమాలో హీరోలు, హీరోయిన్లు ఎంతమంది ఉన్నారు? అని ఆలోచించను. కేవలం సోలో హీరోయిన్‌గానే చేయాలనుకోను. నా పాత్ర ప్రేక్షకులకు గుర్తుండిపోతుందంటే చేస్తానంతే. ఏ రంగంలో అయినా పోటీ అనేది అవసరం.. అప్పుడే మరింత కష్టపడతాం.

● 'వెంకీ మామ' చిత్రంలో హారికా అనే ఫిల్మ్ మేకర్ పాత్ర చేశా.. చాలా సరదాగా ఉంటుంది. ప్రస్తుతం నేను నటించిన 'వెంకీ మామ, ప్రతిరోజూ పండగే' సినిమాలు వారం గ్యాప్‌లో విడుదలవుతున్నాయి.. దీన్ని నేను ఒత్తిడిగా అనుకోవడం లేదు. 'వరల్డ్ ఫేమస్ లవర్' చిత్రంలోనూ మంచి పాత్ర చేస్తున్నా. నేను సినిమాలు ఆలస్యంగా సైన్ చేయడం లేదు. వాటి విడుదలలో ఆలస్యం అవుతోందంతే. విడుదల అనేది నా చేతుల్లో ఉండదు కదా? 'శ్రీనివాస కళ్యాణం' సినిమా చేసినందుకు నేనిప్పటికీ హ్యాపీ. ఆ సినిమా ఎందుకో ప్రేక్షకులకు నచ్చలేదు. హిట్టు, ఫ్లాపు మన చేతుల్లో ఉండవు.

● మంచి పాత్రలు కుదిరితే వెబ్ సిరీస్, లేడీ ఓరియంటెడ్ మూవీస్ చేస్తాను. గతంతో పోలిస్తే ఇప్పుడు సినిమాల్లో హీరోయిన్లకు ప్రాధాన్యత పెరిగింది.. మంచి పాత్రలొస్తున్నాయి. గతంలో పెళ్లయితే కెరీర్ ముగిసినట్టే. ఇప్పుడు అలాంటిదేం లేదు. సమంతగారు పెళ్లయినా సినిమాలు, వెబ్ సిరీస్ చేస్తూ బిజీగా ఉండటం సంతోషం.

● ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన దిశా ఘటన విని చాలా కోపం వచ్చింది.. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరడం తప్ప ఇంకేమీ చేయలేం. ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకొచ్చి ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలి. అమ్మాయిలు తమను తాము రక్షించుకునేందుకు పెప్పర్ స్ప్రే తప్పకుండా వెంట బెట్టుకోవాలి. మహిళలతోనే కాదు.. తోటి వారితో ఎలా ప్రవర్తించాలో చిన్నతనం నుంచే తల్లిదండ్రులు పిల్లలకు నేర్పాలి.


● పంకజ్ కపూర్, షాహిద్ కపూర్

## గురుశిష్యులు

సాధారణంగా అందరికీ లైఫ్‌లో గురువు పాత్రను ఎక్కువగా తండ్రే పోషిస్తారు. బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్‌కు వాళ్ల నాన్న పంకజ్ కపూరే గురువు. ఇప్పుడు ఆన్‌స్క్రీన్ కూడా తనయుడికి గురువు పాత్రలో కనిపించబోతున్నారు. తెలుగు సూపర్‌హిట్ సినిమా 'జెర్సీ' హిందీ రీమేక్‌లో నటించనున్నారు షాహిద్. తెలుగు చిత్రానికి దర్శకత్వం వహించిన గౌతమ్ తిన్ననూరి హిందీ రీమేక్‌ను డైరెక్ట్ చేయనున్నారు. అల్లు అరవింద్, 'దిల్' రాజు, అమన్ గిల్ నిర్మించనున్నారు. ఈ సినిమాలో షాహిద్ మెంటర్‌గా (తెలుగులో సత్యరాజ్ పోషించిన పాత్ర) ఆయన తండ్రి పంకజ్ కపూర్ నటించనున్నారని తెలిసింది. ఈ నెలాఖారున షూటింగ్ ప్రారంభం కానున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఆగస్ట్ 28న రిలీజ్ కానుంది.

## పదేళ్లల్లో పదో స్థానం


● ప్రభాస్ ● హృతిక్

బాలీవుడ్‌లో హృతిక్ రోషన్, టాలీవుడ్‌లో ప్రభాస్‌కి ఉన్న కామన్ విషయం, చూపు తిప్పుకోలేని లుక్స్. స్టయిలింగ్, ఫిజిక్ పరంగా ఫుల్ మార్క్స్‌లో ఉంటారెప్పుడూ. ఇప్పుడే అదే విషయాన్ని ఇంగ్లాండ్‌కి చెందిన ఈస్టర్న్ ఐ మ్యాగజీన్ కూడా స్పష్టం చేసింది. 'సెక్సియస్ట్ ఏషియన్ మేల్' పేరుతో ప్రతి ఏడాది ఈ పత్రిక ఓ లిస్ట్‌ను విడుదల చేస్తుంది. సోషల్ మీడియాలో ట్రెండింగ్, సినిమా రిలీజ్‌లు, ప్రపంచవ్యాప్తంగా పోల్ అయిన ఓట్లు అన్నింటి ఆధారంగా ఈ జాబితాను తయారు చేస్తారు. ఈ ఏడాది రిలీజ్ చేసిన లిస్ట్‌లో మొదటి స్థానంలో హృతిక్, రెండో స్థానంలో షాహిద్ కపూర్, నాలుగు టైగర్ ష్రాఫ్, పదో స్థానంలో ప్రభాస్ నిలిచారు. బాలీవుడ్ స్టార్స్‌తో పోటీగా ప్రభాస్ కూడా లిస్ట్‌లో చోటు దక్కించుకోవడం జాతీయ స్థాయిలో తన పాపులారిటీకి ఓ ఉదాహరణ. అలానే ఈ దశాబ్దపు జాబితానూ విడుదల చేసింది ఈస్టర్న్ ఐ మ్యాగజీన్. ఇందులోనూ హృతిక్ మొదటిస్థానంలో, ప్రభాస్ 10వ స్థానంలో నిలిచారు. ఐదో స్థానంలో సల్మాన్ ఖాన్, ఆరు షాహిద్ కపూర్, ఎనిమిదో స్థానంలో రణ్‌బీర్ కపూర్, తొమ్మిదో స్థానంలో రణ్‌వీర్ కపూర్ చోటు సాధించారు.

## ఆస్తులు అమ్మి ఈ సినిమా తీశా


● సూర్య

నటుడు సూర్య (పింగ్ పాంగ్) హీరోగా నటించి, నిర్మించిన సినిమా 'కలియుగ'. రాజ్, స్వాతి దీక్షిత్ జంటగా నటించారు. తిరుపతి దర్శకత్వంలో సూర్య నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. సూర్య మాట్లాడుతూ– ''18ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నా. ఇప్పటి వరకూ నేను పడిన కష్టాన్నంతా 'కలియుగ' సినిమాకి ప్రాణంగా పెట్టా. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సంఘటనలకు మా సినిమా అద్దం పడుతుంది. ఈ కథని కొందరు నిర్మాతలకి చెప్పినా వారు ముందుకు రాలేదు. ఓ మంచి సినిమాని ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతో నా తల్లిదండ్రుల సహకారంతో ఆస్తులు అమ్మి మరీ ఈ సినిమా నిర్మించా'' అన్నారు.

## హ్యాట్రిక్ హిట్‌తో 2020కి స్వాగతం చెబుతాం
- 'దిల్' రాజు

''2019లో 'ఎఫ్2, మహర్షి' వంటి బ్లాక్‌బస్టర్స్ సాధించాం. ఈ ఏడాది నాలుగైదు సినిమాలు ఉంటాయనుకున్నాం కానీ మూడు సినిమాలతోనే ముగిస్తున్నాం. మా మూడో చిత్రం 'ఇద్దరి లోకం ఒకటే'ని ఈ నెల 25న విడుదల చేస్తున్నాం'' అన్నారు 'దిల్' రాజు. రాజ్ తరుణ్, షాలినీ పాండే జంటగా జీఆర్ కృష్ణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఇద్దరి లోకం ఒకటే'. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఓ టర్కీ సినిమా చూసిన కృష్ణ ఈ ఐడియాను నాకు చెప్పాడు. మన నేటివిటీకి తగిన విధంగా కథను డెవలప్ చేశాం. ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ. ఓ అమ్మాయి, అబ్బాయి మధ్య జరిగే ప్రేమకథ. సినిమాల్లో ఒకప్పటితో పోలిస్తే చాలా మార్పులు జరుగుతున్నాయి. ప్రస్తుతం లిప్‌కిస్‌ల ట్రెండ్ నడుస్తోంది. మా సినిమాలో కూడా లిప్‌కిస్ ఉండటంతో సెన్సార్ వారు 'యు/ఎ' సర్టిఫికెట్ ఇచ్చారు. మేం అనుకున్నట్లు జరిగితే హ్యాట్రిక్ హిట్‌తో ఈ ఏడాదిని ముగిస్తాం. 2020 మాకు మంచి వెల్‌కమ్ అవుతుంది'' అన్నారు. ''పుట్టిన దగ్గరి నుంచి ఒకటయ్యేవరకు హీరో, హీరోయిన్ మధ్య సాగే ప్రేమకథ ఇది. మంచి సినిమా చూశామనే ఫీలింగ్‌తో ప్రతి సన్నివేశాన్ని ఎంజాయ్ చేసి బయటకు వస్తారు ప్రేక్షకులు. ఈ సినిమాలో వైవిధ్యమైన రాజ్‌తరుణ్ కనపడతారు'' అన్నారు జీఆర్ కృష్ణ. ''నాకు కలిసొచ్చిన డేట్.. 'ఉయ్యాల జంపాల' విడుదలైన డిసెంబర్ 25న ఈ సినిమా విడుదలవుతోంది'' అన్నారు రాజ్ తరుణ్. ''పెద్ద సాంకేతిక నిపుణులు సపోర్ట్ చేయడంతో సినిమా చాలా బాగా వచ్చింది'' అన్నారు నిర్మాత బెక్కం వేణుగోపాల్.


● జీఆర్ కృష్ణ, దిల్ రాజు, రాజ్ తరుణ్, బెక్కం వేణుగోపాల్


● రాశీ ఖన్నా, అంజనా దేవి, సాయి తేజ్, అల్లు అరవింద్, మారుతి

## చిరంజీవిగారి సంస్కారం తేజ్‌కి ఉంది
- అల్లు అరవింద్

''సాయితేజ్ సినిమా చేస్తున్నప్పుడు ఇతర పాత్రలకు ప్రాధాన్యం ఉండేలా చూస్తాడు. తన పాత్రతో పాటు ఇతర పాత్రలకు ప్రాముఖ్యత ఇస్తే ఎంత మంచి సినిమా వస్తుందో చిరంజీవిగారికి బాగా తెలుసు. ఆయన లక్షణం తేజ్‌లో ఉంది'' అన్నారు అల్లు అరవింద్. సాయితేజ్, రాశీఖన్నా జంటగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రతిరోజూ పండగే'. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 20న విడులవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను చిరంజీవి తల్లి అంజనాదేవి విడుదల చేశారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''ఈ సినిమాను థియేటర్‌లో కుటుంబంతో కలిసి చూస్తే వచ్చే ఆనందం వేరు. చెప్పిన టైమ్‌కి మారుతి ఈ సినిమాను చాలా ఎంటర్‌టైనర్‌గా తీర్చిదిద్దాడు. ఈ కథకు ఆడియన్స్ కనెక్ట్ అవుతారు'' అన్నారు. మారుతి మాట్లాడుతూ– ''ఈ సినిమా ఇంత వేగంగా పూర్తి కావడానికి సహకరించిన నా టీమ్‌కి, గీతా, యూవీ బ్యానర్స్‌కు థ్యాంక్స్. కథ వినగానే చేద్దామని తేజ్ చెప్పాడు. సత్యరాజ్‌గారు ముందు తాత పాత్ర చేయనన్నారు. కథ విన్నాక ఒప్పుకున్నారు'' అన్నారు. ''మంచి సినిమాతో మీ ముందుకు వస్తున్నాం'' అన్నారు 'బన్నీ' వాసు. ''చిత్రలహరి' సినిమాతో నా సెకండ్ కెరీర్ స్టార్ట్ అయ్యింది. ఇప్పటి నుండి మీరు (మెగా అభిమానులు) తలెత్తుకునే సినిమాలే చేస్తాను. 'ప్రతిరోజూ పండగే' మీ అంచనాలకు మించి ఉంటుంది. ఇందుకు నాది, మారుతిది గ్యారెంటీ'' అన్నారు సాయితేజ్. ''అందరికీ నచ్చే సినిమా ఇది. తేజ్‌తో మళ్లీ మళ్లీ పనిచేయాలనుకుంటున్నా. ఈ సినిమా రిలీజ్ కోసం వెయిట్ చేస్తున్నాను'' అన్నారు రాశీ ఖన్నా. సంగీత దర్శకుడు తమన్, నటుడు రావు రమేశ్‌తో పాటు చిత్రబృందం పాల్గొంది.













సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శుక్రవారం ॥ 6-12-2019

ఫ్యాషన్

కౌల్ స్టైల్

# ట్యూనిక్... యూనిక్



మహిళలకు చాలా సౌకర్యంగా ఉండే డ్రెస్ కుర్తీ. దీంట్లో ఎన్నో రకాల మోడల్స్ వచ్చాయి. ఎప్పటికప్పుడు డిజైనర్లు ఈ కుర్తీ స్టైల్స్‌లో మార్పులు తీసుకువస్తూనే ఉన్నారు. అలా వచ్చిందే ఈ కౌల్ స్టైల్ కుర్తీ. కౌల్ ట్యునిక్‌గానూ పిలిచే ఈ కుర్తీకి దుపట్టాను కూడా జత చేయడంతో సరికొత్తగా ముస్తాబయ్యింది.

ఫిష్, ఫ్రెంచ్ స్టైల్ టెయిల్, లూజ్ హెయిర్.. కేశాలంకరణ ఈ ట్యునిక్స్‌కి బాగా నప్పుతుంది.

సింపుల్ అండ్ స్టైలిష్‌గా కనిపించాలంటే సన్నని గోటా లేస్ ఉన్న దుపట్టాను జత చేసిన ఈ పార్టీవేర్‌ను ధరిస్తే చాలు.

ఈ డ్రెస్‌లకు సన్నని స్ట్రాప్స్ ఉన్న గోల్డ్ హీల్స్, చేతిలో క్లచ్ ధరిస్తే మరింత స్టైలిష్‌గా కనిపిస్తారు.

కౌల్ నెక్ ట్యూనిక్‌కు జరీ లేస్ దుపట్టాను జత చేయడంతో గ్లామరస్‌గా కనిపిస్తోంది.

సంప్రదాయ, పాశ్చాత్య వేడుకలకు కొత్త హంగులు అద్దుతున్న ఈ స్టైల్‌ను స్త్రీలే కాదు పురుషులూ వేడుకలలో వాడుతున్నారు. సరికొత్తగా ముస్తాబు అవుతున్నారు.

ఈ స్టైల్ కుర్తా ఎప్పటి నుంచో బౌద్ధ సన్యాసులు ధరించడం చూస్తుంటాం. సౌకర్యంగా ఉండే ఈ డ్రెస్ ఇప్పుడు కుర్తాగా రూపాంతరం చెంది ఫ్యాషన్ ఇండస్ట్రీ ముందుకు వచ్చింది. ఈ కుర్తీ మోకాళ్ల కింది భాగం అంచులు మడిచినట్టు, పైకి దోపినట్టుగా ఉంటుంది. కుర్తా మెడ భాగం నుంచి వేలాడుతున్నట్టుగా దుపట్టా జత చేసి ఉంటుంది. స్లీవ్స్, స్లీవ్‌లెస్.. రెండు స్టైల్స్‌లో ఉండే ఈ కుర్తాలు ప్లెయిన్, ప్రింట్ కలర్ కాంబినేషన్‌తో డిజైన్ చేయడం వల్ల ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి. దీనికి బాటమ్‌గా సిగరెట్ ప్యాంట్, ట్రౌజర్ జత చేస్తే చాలు. గెట్ టు గెదర్ వేడుకలలో పాల్గొనడానికి సౌకర్యంగా ఉండటంతో పాటు ప్రత్యేకతను చాటుతుందీ డ్రెస్.

నిర్వహణ: నిర్మలారెడ్డి

వెల్వెట్ బ్లౌజ్



## పట్టుచీరకు రాయల్ టచ్

వెల్వెట్ క్లాత్ అంటేనే రాయల్ ఫ్యాబ్రిక్. వివాహ వేడుకల్లో సంప్రదాయపు సందడికి పెట్టింది పేరు పట్టు చీరలు. సంప్రదాయానికి రాయల్ టచ్ అద్దితే..! పట్టు చీరకు సెల్ఫ్ బ్లౌజ్ లేదంటే కాంట్రాస్ట్ డిజైనర్ బ్లౌజ్ వాడడటం తెలిసిందే. ఎప్పటికప్పుడు కాంబినేషన్స్ మార్చుతూ సరికొత్తగా వేడుకలో వెలిగిపోయే అతివలు ఈ చలికాలానికి తగ్గట్టు వెల్వెట్ బ్లౌజ్ ధరించి మెరిసిపోవచ్చు.



- చీర రంగు వెల్వెట్ ఫ్యాబ్రిక్‌తో హాప్ షోల్డర్ బ్లౌజ్‌ను డిజైన్ చేయిస్తే మోడ్రన్ లుక్. ఈ కాంబినేషన్‌కి రాళ్ల పొదిగిన హారాలు మరింత అందాన్నిస్తాయి.
- వెల్వెట్ బ్లౌజ్ మీద ఎంబ్రాయిడరీ వర్క్ ఆకర్షణీయంగా కనిపిస్తుంది. పూసలు, జర్దోసీతో స్లీవ్స్ ప్యాటర్న్‌కి మాత్రమే ఎంబ్రాయిడరీ చేయించుకోవచ్చు. పట్టు చీరకు పూర్తి కాంట్రాస్ట్ వెల్వెట్ బ్లౌజ్‌ను ధరిస్తే ప్రత్యేకంగా కనిపిస్తారు.
- పట్టుచీర రంగులో ఉన్న వెల్వెట్ బ్లౌజ్‌కి చేతుల భాగంలో ఆ చీర అంచు భాగాన్ని జత చేస్తే రాయల్ లుక్‌తో మెరిసిపోతారు.
- సింపుల్‌గా మోచేతుల వరకు స్లీవ్స్ డిజైన్ చేయించుకున్నా, కాస్త హెవీ ఎంబ్రాయిడరీ చేసినట్లయితే హాఫ్‌వైట్‌శారీస్‌కి మరిన్ని హంగులు అద్దినట్టే.

ఏజ్‌లెస్

## భయమెరగని బామ్మ



**బెదిరిస్తే ఏమవుతుంది..? ఏమీ కాదు అలా బెదిరించిన వారే తోకముడుస్తారు.. అంటూ సమస్యల పరిష్కారానికై ముందుకు సాగుతోంది 92 ఏళ్ల ఈ చెన్నై బామ్మ. పేరు కామాక్షి. చెన్నై బెసెంట్ నగర్‌లో ఉంటున్న ఈ బామ్మను కలిస్తే చాలు మనం మరిచిపోయిన ఎన్నో బాధ్యతలను గుర్తుచేస్తుంది. సమస్యల పరిష్కారానికి మనమూ కదలాలనిపించేలా చేస్తుంది.**

‘నేను ముసల్దానినైపోయాను. అలాగని ఇప్పుడప్పుడే ఈ లోకాన్ని విడిచివెళ్లాలనుకోవడం లేదు. నేను భోజనం చేయడానికి ఇప్పుడు నా పళ్లెంలో చాలా పనులున్నాయి. ముందు వాటి సంగతి చూడాలి’ అంటోంది కామాక్షి పాటి. చుట్టుపక్కల కాలనీవాసులే కాదు కార్పొరేషన్ అధికారులు కూడా ఆమెను చూస్తే జంకుతారు. ఆమె బాధ్యతను తెలుసుకొని ప్రేమగా పలకరిస్తారు, గౌరవిస్తారు. పరిచయం లేని వారికి కూడా మన ఇంట్లోని బామ్మలాగానే కనిపిస్తారు. అది ఎంతవరకు అంటే.. చుట్టుపక్కల ఎవరైనా పౌర ప్రమాణాల ఉల్లంఘనకు పాల్పడనంతవరకే.

**తెల్లవారు ఝాము నుంచి రాత్రి పది వరకు**

తెల్లవారుజాము 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కామాక్షి పాటి ఏదైనా సమస్యను పరిష్కరించడానికి వెనకాడరు. ఈ వయస్సులో కూడా ఆమెకు నచ్చని ప్రభుత్వ ప్రతిపాదన ఏదైనా వస్తే దానిని నిరసిస్తూ వీధుల్లోకి వస్తారు లేదా ఆ సమస్యను పరిష్కరించడానికి ఎంత పెద్ద పొజిషన్‌లో ఉన్న అధికారినైనా నిలదీస్తారు. ఇంతకీ ఈమె ఎవరంటారా .. తంజావూరులో పుట్టిన కామాక్షి పాటి బెంగుళూరులో చదువుకుంది. పైకి ఢిల్లీ వెళ్లింది. ‘ఢిల్లీలో ఆ మూడు దశాబ్దాలు నా జీవితంలో ఉత్తమమైనవి. 1948లో అక్కడికి వెళ్లాను. నవజాత దేశంలో అల్లకల్లోల రాజకీయాల సమయం. పరిస్థితులు ఉద్రిక్తంగా ఉండేవి. కానీ, ప్రజలు చాలా స్నేహపూర్వకంగా ఉండేవారు’ అని నాటి పరిస్థితులను కళ్లకు కట్టినట్టు వివరిస్తుంది. ‘1981లో తిరిగి చెన్నైకి వచ్చాను. ఇక్కడ మారిన వాతావరణం, సంస్కృతి చూసి షాక్ అయ్యాను. సర్దుబాటు చేసుకోవడానికి కొన్నాళ్లు పట్టింది’ అని చెబుతారు.

**అనుకోకుండా కార్యకర్తగా..**

చెన్నై బెసెంట్‌నగర్‌లోని కామాక్షి ఉంటున్న ఇంటి ముందు రహదారి ఓ సమస్యగా మారింది. ప్రజలు దీనిని బహిరంగ మరుగుదొడ్డిగా ఉపయోగించేవారు. చనిపోయిన జంతుకళేబరాలను పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఖననం చేసేవారు. ఇళ్లలోని వ్యర్థాలను పోసి వెళుతుండేవారు. విసిగిపోయిన కామాక్షి పదే పదే అధికారులకు విజ్ఞప్తులు చేసేది. అధికారులు ఆ విజ్ఞప్తులను తీసుకునేవారు. కానీ, ఏదో సాకు చెప్పి అప్పటికి తప్పించుకునేవారు. ‘రహదారికి ఇరువైపులా చెట్లు ఉండాలి’ అని వారికి గుర్తు చేసేది. మూడేళ్ల నిరంతర విజ్ఞప్తులు, నిరసనల తర్వాత కార్పొరేషన్ అధికారులు రహదారిని అందంగా తీర్చిదిద్దడంతోపాటు రోడ్ సైడ్ పార్క్‌ను నిర్మించడంతో ఆమె తన మొదటి



● కామాక్షి పాటి: అలుపెరుగని అవిశ్రాంత కార్యకర్త

విజయాన్ని సాధించింది. ఆమె 80వ పుట్టినరోజు సందర్భంగా అప్పటి చెన్నై కమిషనర్ ఈ పార్కు ఆధునీకరణ బాధ్యతను ఆమెకు అప్పగించారు. అప్పటికి ఆమె కార్పొరేషన్ అధికారులు, స్థానిక చట్టసభ సభ్యులతో పరిచయాలను ఏర్పరుచుకుంది. కామాక్షి పర్యవేక్షణ ఎంత బాగుంటుందో 12 ఏళ్లుగా ఆమె నిర్వహిస్తున్న పార్క్ చెబుతుంది. ‘నేనెప్పుడూ అలవాటు ప్రాముఖ్యతను చెబుతాను. ఒక స్థలాన్ని పునరుద్ధరించినా, ఒకసారి శుభ్రపరిచినా అంతటితో ఏమీ ముగిసిపోదు. దానిని నిరంతరాయంగా కొనసాగించాలి. ఒక బాధ్యతగా తీసుకోవాలి’ అని ఆమె సలహా ఇస్తారు.

రోడ్డు, పార్క్ పని పూర్తయింది. ఇక పౌర సమస్యలను పరిష్కరించడానికి ముందుకు వచ్చారు కామాక్షి. బెసెంట్ నగర్‌లోని చుట్టుపక్కల వాసులు తమ మనోవేదనలను, పరిపాలనకు సంబంధించి సమస్యలు పరిష్కరించేలా చూడమని కామాక్షికి దగ్గరకు వచ్చేవారు. దీంతో ఆమె తరచూ సమావేశాలను ఏర్పాటు చేస్తుంది. ఆమె సాధించిన విజయాలలో బెసెంట్ నగర్ బీచ్‌లోని కార్ల్ జెష్మిత్ మెమోరియల్ పునరుద్ధరణ అతి ముఖ్యమైనది. శిథిలావస్థలో ఉన్న ఈ మెమోరియల్‌లో మద్యం సేవించడం, గోడలపై పిచ్చి రాతలు రాయడం, స్మారక చిహ్నంపై మూత్రవిసర్జన చేయడం వంటివి గమనించిన పాటి అది పూర్తిగా బాగయ్యేంతవరకు అధికారులను వదిలిపెట్టలేదు.

**బెదిరింపులు బేఖాతరు**

కామాక్షి పాటి విజయం.. రహదారులు, ష్మిత్ మెమోరియల్ పునరుద్ధరణతో ఆగలేదు. పుట్‌పాత్‌లను ఆక్రమించే షాపులను అడ్డుకోవడం, కాలిబాటలను విస్తరించే విధానాల కోసం బెసెంట్ అవెన్యూలో నియమ నిబంధనలను ఏర్పాటు చేసింది. రాత్రి 10 దాటిన తర్వాత నిర్మాణ కార్యక్రమాలు ఆపాలని, పిల్లలు, వృద్ధుల నిద్రకు అవరోధం కలిగించకుండా చూడాలని కోరుతుంది. బాధ్యతాయుతమైన పౌరురాలిగా ఉండటం ఇష్టమైన కామాక్షికి అవినీతి వైఖరులకు పాల్పడే వారితో ఎప్పుడూ గొడవగానే ఉంటుంది. నా విధానాలకు వ్యతిరేకంగా ఫిర్యాదులు ఇచ్చేవారున్నారు. కానీ, వారెవరూ ఇటువంటి బాధ్యత తీసుకోరు. వీధుల్లో చెత్త వేయద్దని నిలదీస్తే యువకులు స్పందించే తీరు బాధిస్తుంటుందని కామాక్షి తెలుపుతుంది. నిరసన తెలపడం కష్టమైన పనికాదు. ప్రతి ఒక్కరూ తమ సమస్యలను పరిష్కరించే బాధ్యత తీసుకోవాలి’ అని కోరుతుంది కామాక్షి.

కాటికి కాళ్లు చాపుకున్న ముసలివాళ్లు ఏం చేస్తారులే అనుకోవద్దు. తలుచుకుంటే కొండను కూడా పిండిచేయగలమని నిరూపించగలరు. ముళ్ల మార్గాలనూ నందనవనంగా మార్చగలరు.

– ఆరెన్నార్

అభరణం



## ఈజీప్టు కుండలాలు

అందానికి సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవడంలోనే కాదు ఆభరణాల అలంకరణలోనూ ఈజిప్షియన్లది ఓ ప్రత్యేక మార్కు ఉంటుంది. వేల సంవత్సరాల వారి ఆభరణాల కళను పరికిస్తే ఎన్నో కొత్త విషయాలు మన కళ్ల ముందు నిలుస్తాయి. వారి అలంకరణ ఆభరణాలలో యుద్ధ వీరులు, వన్యప్రాణులు, దేవదూతలు, సూర్య, చంద్రుల రూపాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఇప్పుడు ఈ ఆభరణాల వెలుగులతో మనమూ మెరిసిపోవచ్చు. చెవులకు ఈజిప్షియన్ కళను కొత్తగా, ఈజీగా హ్యాంగ్ చేయవచ్చు. ఫ్యాషన్ జువెల్రీలో భాగమైన ఈ ఆభరణాలు ఆన్‌లైన్‌మార్కెట్‌లో లభిస్తున్నాయి.



కేరెంటింగ్

## పండ్లు, పాలు వద్దని మారాం చేస్తున్నారా?

దాదాపు ఐదేళ్ల నుంచి పదిహేనేళ్ల వరకు పిల్లలు కూరగాయలు, పండ్లు, పాలు తీసుకోడానికి ఇష్టపడకపోవడం చాలా సాధారణం. ఇలాంటి ఫిర్యాదులు దాదాపు ప్రతి తల్లి నుంచి వస్తూనే ఉంటాయి. పిల్లలు అలా పౌష్టికాహారం తిసుకోకుండా, పాలు తాగకుండా మారాం చేస్తుంటే... ఈ కింది సూచనలు పాటించండి. ఉదాహరణకు పిల్లలు పండ్లు తినడానికి ఇష్టపడకపోతే... రకరకాల పండ్లను కట్ చేసి ఫ్రూట్ సలాడ్స్‌గా ఇవ్వడమో లేదా కస్టర్డ్‌తో కలిపి పెట్టడమో చేయండి. కొన్ని సందర్భాల్లో పండ్లను జ్యూస్‌గా తీసి ఇవ్వవచ్చు. కాకపోతే పిల్లలకు జ్యూస్ చేసి ఇవ్వడం కంటే వాళ్లంతట వాళ్లే కొరికి తినేలా పండ్లు ఇవ్వడమే మంచిది. ఇక పిల్లలు పాలు తాగకపోతే మిల్క్‌షేక్ రూపంలో ఇవ్వండి. పాలతో తయారైన



స్వీట్లు పెట్టండి. అలాగే చాలామంది పిల్లలు కూరగాయలను ఇష్టపడరు. ఒకవేళ వారు కూరగాయలు తినకపోతే... వెజిటెబుల్ ఆమ్లెట్, గ్రిల్డ్ వెజిటెబుల్ శాండ్‌విచ్... ఇలా రకరకాలుగా ఇవ్వండి. ఒకవేళ వాళ్లు నూడుల్స్ ఇష్టంగా తింటుంటే, వాటికే రకరకాల కూరల ముక్కలు కలిపి తయారు చేయండి. ఎదిగే పిల్లలకు మాంసాహారం, చేపలూ (తినేవారైతే), లెగ్యూమ్స్ (పప్పులు / దాల్స్), బాదాం, జీడిపప్పు, వాల్‌నట్ వంటి నట్స్ తప్పక ఇవ్వాలి. వల్ల వాటిలో ప్రోటీన్స్, విటమిన్స్ ఎక్కువగా ఉంటాయి. దాంతో ఆ వయసు పిల్లలకు కావాల్సిన పోషకాలు లభిస్తాయి. అలాగే పిల్లలు కాస్త పెద్దయాక ఆటల రూపంలో వాళ్లకు మంచి వ్యాయామం అందేలా తల్లిదండ్రులు తప్పక చూడాలి.

epaper.sakshi.com

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
స్పర్ధయా వర్ధతే విద్య
శుక్రవారం 6-12-2019





# ఎదగడానికి ఎయిర్‌ఫోర్స్

**కెరీర్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలనుకునే విద్యార్థులకు చక్కటి అవకాశం.. ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ (ఏఎఫ్‌క్యాట్). భారత వైమానిక దళంలో టెక్నికల్, నాన్ టెక్నికల్ విభాగాల్లో ఉన్నతస్థాయి కొలువు, ఆకర్షణీయమైన వేతనం ఏఎఫ్‌క్యాట్ ద్వారా అందుకోవచ్చు. ఏఎఫ్‌క్యాట్ 2020 నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో.. ఖాళీలు, అర్హతలు, ఎంపిక విధానం, సిలబస్, శిక్షణ, వేతనం తదితర వివరాలు..**

## మొత్తం పోస్టుల సంఖ్య: 249

### ఖాళీల వివరాలు

» ఏఎఫ్ క్యాట్ ఎంట్రీ:
- **బ్రాంచ్ ఫ్లయింగ్:** షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ)- 60

» బ్రాంచ్ గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్):
- **ఏఈ(ఎల్):** పర్మనెంట్ కమిషన్(పీసీ)-40, ఎస్ఎస్‌సీ-26
- **ఏఈ(ఎం):** పర్మనెంట్ కమిషన్-23, ఎస్ఎస్‌సీ-16

» బ్రాంచ్ గ్రౌండ్ డ్యూటీ (నాన్ టెక్నికల్):
- అడ్మిన్ పీసీ-24, ఎస్ఎస్‌సీ-16; అకౌంట్స్ పీసీ-14, ఎస్ఎస్‌సీ-10; లాజిస్టిక్స్ పీసీ-12, ఎస్ఎస్‌సీ-08.

» **ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ:** బ్రాంచ్.. ఫ్లయింగ్.. సీడీఎస్ఈ ఖాళీల్లో 10 శాతం పీసీ కింద, ఏఎఫ్ క్యాట్‌లో 10 శాతం ఖాళీలను ఎస్ఎస్‌సీ కింద భర్తీ చేస్తారు.

### ఏఎఫ్ క్యాట్

ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్, నాన్ టెక్నికల్) ఖాళీల భర్తీకి భారత వైమానిక దళం ప్రతి ఏడాది జూన్, డిసెంబర్ నెలల్లో ఏఎఫ్ క్యాట్ ప్రకటన విడుదల చేస్తుంది. ఇందులో రెండు రకాల పోస్టులుంటాయి. కొన్ని పర్మనెంట్ కమిషన్ (పీసీ), మరికొన్ని షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) పరిధిలోకి వస్తాయి. పర్మనెంట్ కమిషన్ (పీసీ) విభాగంలో ఎంపికైన వారు పదవీ విరమణ వయసు వరకు ఉద్యోగంలో కొనసాగొచ్చు. షార్ట్ సర్వీస్ కమిషన్‌లో అవకాశం పొందితే గరిష్టంగా 14ఏళ్ల పాటు ఉద్యోగంలో సేవలందించి వైదొలుగుతారు. మహిళలు ఎస్ఎస్‌సీ ఉద్యోగాలకే అర్హులు. అలాగే ఫ్లయింగ్ బ్రాంచ్ ఉద్యోగాలైన పైలట్ పోస్టులన్నీ ఎస్ఎస్‌సీ కిందకే వస్తాయి. గ్రౌండ్ డ్యూటీ పోస్టులను పర్మనెంట్, షార్ట్ సర్వీస్ కమిషన్ రెండు విభాగాల్లోనూ భర్తీ చేస్తారు.

### అర్హతలు

#### ఫ్లయింగ్ బ్రాంచ్

ఈ విభాగానికి దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఇంటర్(10+2)లో మ్యాథ్స్, ఫిజిక్స్ చదివుండి, గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ పూర్తి చేసుండాలి. లేదా 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం డిగ్రీ లేదా బీఈ/బీటెక్ ఫైనల్ చదువుతున్న వాళ్లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు: 2021, జనవరి 1 నాటికి 20 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి. జనవరి 2, 1997 నుంచి జనవరి 1, 2001 మధ్యలో జన్మించిన వారు అర్హులు.

#### గ్రౌండ్ డ్యూటీ-టెక్నికల్ బ్రాంచ్

» విభాగం:
ఏరోనాటికల్ ఇంజనీరింగ్ (ఎలక్ట్రానిక్స్)
- **విద్యార్హత:** 60 శాతం మార్కులతో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ లేదా ఎలక్ట్రానిక్స్ లేదా కమ్యూనికేషన్స్ లేదా కంప్యూటర్ సైన్స్ తదితర విభాగాల్లో బీఈ/బీటెక్ పూర్తిచేసిన వారు అర్హులు. ఇంటర్/10+2లో ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో 60 శాతం మార్కులు వచ్చి ఉండాలి.

» విభాగం:
ఏరోనాటికల్ ఇంజనీరింగ్(మెకానికల్)
- **విద్యార్హత:** 60 శాతం మార్కులతో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ లేదా ఏరోస్పేస్ లేదా ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ లేదా మెకానికల్ లేదా ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్‌ల్లో ఏదో ఒక విభాగంలో బీఈ/బీటెక్ పూర్తి చేసుండాలి. ఇంటర్/10+2లో ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో 60 శాతం మార్కులు వచ్చి ఉండాలి. చివరి ఏడాది చదువుతున్న వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు.
- **గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్ బ్రాంచ్‌కు వయసు:** 20 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి.

#### గ్రౌండ్ డ్యూటీ-నాన్ టెక్నికల్ బ్రాంచ్

ఇందులో అడ్మినిస్ట్రేషన్, లాజిస్టిక్స్, అకౌంట్స్ విభాగాలున్నాయి. అడ్మినిస్ట్రేషన్, లాజిస్టిక్స్ విభాగాలకు కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ పూర్తి చేసుండాలి. అకౌంట్స్ విభాగానికి బీకాం 60 శాతం మార్కులతో పూర్తి చేసిన వారు అర్హులు. ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ❖ **వయసు:** 20 నుంచి 26 ఏళ్ల మధ్యలో ఉండాలి. జనవరి 2, 1995 నుంచి జనవరి 1, 2001 మధ్య జన్మించి ఉండాలి.

### ఎంపిక విధానం

- కామన్ ఎంట్రెన్స్ టెస్ట్, ఇంజనీరింగ్ నాలెడ్జ్ టెస్ట్, పైలెట్ అప్టిట్యూడ్ బ్యాటరీ టెస్టు(పీఏబీటీ), మెడికల్ టెస్టుల ఆధారంగా ఎంపికచేస్తారు. ఏ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ.. కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ అభ్యర్థులందరికీ ఉమ్మడిగా ఉంటుంది.
- టెక్నికల్ బ్రాంచ్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు ఇంజనీరింగ్ నాలెడ్జ్ టెస్ట్ (ఈకేటీ) అదనంగా రాయాలి. ఈ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు స్టేజ్-1,స్టేజ్-2 పరీక్షలు నిర్వహిస్తారు.
- ఫ్లయింగ్ బ్రాంచ్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూ అనంతరం కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టం(సీపీఎస్ఎస్) పరీక్ష ఉంటుంది. వీటన్నింటిలో అర్హత సాధించిన వారికి మెడికల్ టెస్టులు నిర్వహించి శిక్షణలోకి తీసుకుంటారు.

> » ఏఎఫ్ క్యాట్-2020 నోటిఫికేషన్ విడుదల
> » దరఖాస్తుకు చివరి తేదీ డిసెంబర్ 30, 2019
> » 2020 ఫిబ్రవరి 22, 23 తేదీల్లో ఆన్‌లైన్ పరీక్షలు

### ఏఎఫ్‌క్యాట్ పరీక్ష విధానం

ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్ష 300 మార్కులకు ఉంటుంది. ప్రతి ప్రశ్నకు మూడు మార్కుల చొప్పున 100 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు నాలుగు ఆప్షన్లు ఉంటాయి. పరీక్ష వ్యవధి రెండు గంటలు. నెగిటివ్ మార్కులుంటాయి. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు చొప్పున తగ్గిస్తారు.

### ఈకేటీ

టెక్నికల్ బ్రాంచ్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు ఇంజనీరింగ్ నాలెడ్జ్ టెస్ట్ (ఈకేటీ) అదనంగా రాయాలి. పరీక్ష వ్యవధి 45 నిమిషాలు. 50 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు 3 మార్కుల చొప్పున మొత్తం 150 మార్కులకు పరీక్ష జరుగుతుంది.

### ఏఎఫ్ఎస్‌బీ.. స్టేజ్-1, 2

రాత పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని స్టేజ్ 1, 2 పరీక్షలకు పిలుస్తారు. వీటిని ఎయిర్ ఫోర్స్ సెలక్షన్ బోర్డు(ఏఎఫ్ఎస్‌బీ) నిర్వహిస్తుంది. ఫిజికల్ ఫిట్‌నెస్ విభాగంలో అభ్యర్థులు 1.6 కిలోమీటర్ల దూరాన్ని 10 నిమిషాల్లో చేరుకోవాలి. అలాగే 10 పుష్ అప్స్, 3 చిన్ అప్స్ తీయగలగాలి. ఇక స్టేజ్-1 స్క్రీనింగ్ టెస్టులో చిన్న అసైన్‌మెంట్స్, పజిల్స్ లాంటి వాటి ద్వారా అభ్యర్థి మేధోశక్తిని పరిశీలిస్తారు. ఏదైనా చిత్రాన్ని చూపించి దానిపై విశ్లేషణ చేయమంటారు. ఇందులో అర్హత సాధించిన వారే స్టేజ్-2కి వెళ్తారు. స్టేజ్-2లో సైకాలజిస్టు ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం ఇన్ డోర్, అవుట్ డోర్ ఇంటరాక్టివ్ గ్రూపు టెస్టులుంటాయి. వీటిలో మానసిక, శారీరక పనులు మిళితమై ఉంటాయి. ఆ తర్వాత పర్సనల్ ఇంటర్వ్యూ జరుగుతుంది. ఈ దశలన్నీ పూర్తిచేసుకున్న వారికి మెడికల్ టెస్టులు నిర్వహిస్తారు. అందులోనూ విజయవంతమైన వారి మెరిట్ లిస్ట్ తయారు చేసి శిక్షణ కోసం ఎంపిక చేస్తారు. అభ్యర్థులకు సంబంధిత విభాగంలో జనవరి మొదటి వారం, 2021 నుంచి శిక్షణ ప్రారంభమవుతుంది.

### ఉపకార వేతనం

శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టైపెండ్‌గా చెల్లిస్తారు. శిక్షణ అనంతరం విధుల్లో చేరిన వారికి రూ.56,100 మూల వేతనం లభిస్తుంది. అలాగే డీఏ, హెచ్‌ఆర్ఏ సహా ఇతర అలవెన్సులు అదనం. మిలటరీ సర్వీస్ పే(ఎంఎస్పీ)లో భాగంగా ప్రతి నెలా రూ.15,500 చెల్లిస్తారు. పోస్టింగ్ పొందిన ప్రాంతం బట్టి రూ.83 వేల నుంచి రూ.96 వేల వరకు నెల వేతనం(సీటీసీ) పొందొచ్చు. ట్రాన్స్‌పోర్ట్ అలవెన్సు, పిల్లలకు చదువుల అలవెన్సు, రాయితీ ధరలకు క్యాంటీన్, ఫర్నీచర్‌తో కూడిన నివాస సముదాయం, తక్కువ వడ్డీకి రుణాలు, ఎల్టీఏ, 60 వార్షిక సెలవులు, 20 సాధారణ సెలవులు ఉంటాయి.

### శిక్షణ

ఏఎఫ్ క్యాట్‌లో ఎంపికైన ఫ్లయింగ్, టెక్నికల్ బ్రాంచ్ అభ్యర్థులకు 74 వారాల పాటు.. గ్రౌండ్ డ్యూటీకి ఎంపికైన వారికి 52 వారాలపాటు ఎయిర్‌ఫోర్స్ ట్రెయినింగ్ ఇస్తారు. ఫ్లయింగ్ బ్రాంచ్‌కు ఎంపికైన అభ్యర్థులకు దుండిగల్, హకీంపేట్, బీదర్, ఎలహంకల్లో ఆరు నెలల పాటు ప్రాథమిక శిక్షణ ఉంటుంది. అనంతరం అభ్యర్థులు చూపిన ప్రతిభ ఆధారంగా ఫైటర్ పైలట్, ట్రాన్స్‌పోర్ట్ పైలట్, హెలికాప్టర్ పైలట్‌గా వేర్వేరగా ఆయా విభాగాల్లో అంతర్గత శిక్షణ ఇస్తారు.



### సిలబస్

ఆన్‌లైన్ పరీక్షలో జనరల్ అవేర్‌నెస్, వెర్బల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, రీజనింగ్, మిలటరీ ఆప్టిట్యూడ్ విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. న్యూమరికల్ ఎబిలిటీ ప్రశ్నలు పదోతరగతి స్థాయిలో ఉంటాయి. మిగిలిన విభాగాల్లోని ప్రశ్నలు మాత్రం డిగ్రీ స్థాయిలో ఉంటాయి. జనరల్ అవేర్‌నెస్‌లో క్రీడలు, చరిత్ర, భూగోళ శాస్త్రం,పర్యావరణం, కళలు, సంస్కృతి, వర్తమానాంశాలు, రాజకీయాలు, పౌరశాస్త్రం, రక్షణ రంగం, సామాన్య శాస్త్రంలోని ప్రాథమిక అంశాల నుంచి ప్రశ్నలుంటాయి. ఇంగ్లిష్‌లోని వెర్బల్ ఎబిలిటీలో కాంప్రహెన్షన్, ఎర్రర్ డిటెక్షన్, సెంటెన్స్ కంప్లీషన్, సినానిమ్స్, యాంటనిమ్స్, వొకాబ్యులరీ, ఇడియమ్స్, ఫ్రేజెస్ తదితర అంశాల నుంచి ప్రశ్నలడుగుతారు. న్యూమరికల్ ఎబిలిటీ విభాగంలో.. సగటు, లాభనష్టాలు, శాతాలు, సూక్ష్మీకరణ, భిన్నాలు, నిష్పత్తి-అనుపాతం, బారువడ్డీ అంశాల్లో అభ్యర్థి పరిజ్ఞానాన్ని పరిశీలించేలా ప్రశ్నలుంటాయి. రీజనింగ్, మిలిటరీ ఆప్టిట్యూడ్ విభాగంలో.. వెర్బల్ స్కిల్స్, స్పేషియల్ ఎబిలిటీ (మెంటల్ ఎబిలిటీ) అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

### ముఖ్య తేదీలు

» **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
» **దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబర్ 30
» **దరఖాస్తు ఫీజు:** 250 (అన్ని కేటగిరి అభ్యర్థులకు).
» **ఏఎఫ్‌క్యాట్ ఆన్‌లైన్ పరీక్ష తేదీలు:** 2020, ఫిబ్రవరి 22, 23 తేదీల్లో ఉంటుంది.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్.
» **వెబ్‌సైట్:** www.afcat.cdac.in

# టిస్ బాట్-2020

**ఆర్ట్స్ కోర్సుల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తోంది.. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్(టిస్). ఇలాంటి విద్యా సంస్థల్లో కోర్సులు పూర్తిచేసుకుంటే.. ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుంది. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్.. బ్యాచిలర్స్ అడ్మిషన్ టెస్ట్ (టిస్ బాట్)-2020 నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో.. సమగ్ర సమాచారం..**




> » నోటిఫికేషన్ విడుదల చేసిన టిస్, ముంబై
> » బీఏ సోషల్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశానికి పరీక్ష
> » దరఖాస్తులకు చివరి తేది: 23.03.2020

### టిస్

టాటా గ్రాడ్యుయేట్ స్కూల్‌గా 1936లో ప్రారంభమైన ఈ సంస్థ... 1944లో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్‌సైన్స్ (టిస్)గా మారింది. అంచెలంచెలుగా ఎదుగుతూ.. 1964లో డీమ్డ్ యూనివర్సిటీ హోదా పొందింది. ప్రస్తుతం సోషల్‌సైన్స్ కోర్సులను అందించడంలో అగ్రగామిగా నిలుస్తోంది. ప్రతి ఏటా జాతీయ స్థాయిలో టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్.. బ్యాచిలర్స్ అడ్మిషన్ టెస్ట్ (టిస్ బాట్) నిర్వహించి.. బీఏ కోర్సుల్లో ప్రవేశాలను కల్పిస్తోంది.

### కోర్సు ఉద్దేశం

పట్టణ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి అవసరాలను దృష్టిలో పెట్టుకొని కోర్సులను రూపకల్పన చేశారు. సమాజంలోని సమస్యలను అధ్యయనం చేసి.. పరిష్కారాలను చూపేలా శిక్షణ ఇచ్చే కోర్సులు ఇవి. టిస్ ఉన్నత స్థాయి ప్రమాణాలతో ఈ కోర్సును అందిస్తుంది. అందుకోసమే దేశవ్యాప్తంగా టిస్ అందించే బీఏ కోర్సుకు మంచి ఆదరణ ఉంది.

### బీఏ సోషల్ సైన్సెస్

- టిస్ అందిస్తున్న బీఏ సోషల్ సైన్సెస్ ప్రత్యేకంగా రూపొందించిన లిబరల్ ఆర్ట్స్ ప్రోగ్రామ్. ఇందులో ముఖ్యంగా సోషియాలజీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, సైకాలజీ సబ్జెక్టులపై ప్రాథమిక అవగాహన కల్పిస్తుంది. ఎన్విరాన్‌మెంట్, డెవలప్‌మెంట్ వివిధ సమస్యలపై కోర్సులో భాగంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఇక్కడ బీఏ సోషల్ సైన్సెస్ పూర్తి చేసిన విద్యార్థులు ఆయా సబ్జెక్టులపై సమగ్ర అవగాహన లభించడం ఖాయం. ఈ కోర్సును టిస్ తుల్జాపూర్ క్యాంపస్, టిస్ గువహతి క్యాంపస్‌ల్లో అందిస్తోంది.

### అర్హతలు

- ప్రభుత్వ గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సు పూర్తి చేసుండాలి. చివరి సంవత్సరం చదివే వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- 2020 మే నాటికి 23 ఏళ్లు లోపు వారు మాత్రమే అర్హులు.

### పరీక్ష విధానం

టిస్ ముంబై దేశవ్యాప్తంగా టిస్‌బాట్ పరీక్ష నిర్వహిస్తుంది. పరీక్ష విధానం పూర్తిగా ఆన్‌లైన్(సీబీటీ) విధానంలో రెండు పార్టులుగా ఉంటుంది. మొత్తం 90 నిమిషాల సమయం పరీక్షకు కేటాయిస్తారు. పార్ట్-1లో కరెంట్ అఫైర్స్, సోషల్ అవేర్‌నెస్, లాజికల్ అనలిటికల్, రీజనింగ్ సబ్జెక్టుల నుంచి మొత్తం 100 ప్రశ్నలకుగాను 60 మార్కులు, 60 నిమిషాల సమయాన్ని కేటాయిస్తారు. అలాగే పార్ట్-2 పరీక్షలో సబ్జెక్ట్ అనుబంధంగా ఉండే ఎస్సే ప్రశ్నలను అడుగుతారు. దీనికి 40 మార్కులకుగాను 30 నిమిషాల సమయాన్ని కేటాయిస్తారు.

### ఎంపిక ప్రక్రియ

టిస్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులను మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్‌కు పిలుస్తారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేసి.. ప్రవేశం కల్పిస్తారు.

### పరీక్ష ఫీజు

టిస్ దరఖాస్తు చేసుకునే జనరల్, ఓబీసీ అభ్యర్థుల రూ.1025, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.500 ఫీజుగా చెల్లించాలి.

### ముఖ్యమైన సమాచారం

» **దరఖాస్తు:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి
» **దరఖాస్తుల ప్రారంభ తేదీ:** 05.12.2019
» **దరఖాస్తుల ముగింపు తేదీ:** 23.03.2020
» **అడ్మిట్ కార్డు:** 11.04.2020
» **పరీక్ష తేదీ:** 25.04.2020
» **వెబ్‌సైట్:** www.tiss.edu

**కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగం విద్యార్థినుల కోసం మరో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. తాజా లెక్కల ప్రకారం-సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్(స్టెమ్) కోర్సుల్లో చేరుతున్న విద్యార్థినుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. దీంతో స్టెమ్ కోర్సులు, కెరీర్ వైపు అమ్మాయిలను ప్రోత్సహించేందుకు విజ్ఞాన జ్యోతి అనే వినూత్న కార్యక్రమాన్ని కేంద్రం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో.. విజ్ఞాన జ్యోతి పథకం వివరాలు...**




# ఆడపిల్లల కోసం విజ్ఞాన జ్యోతి

విజ్ఞాన జ్యోతి కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.. అమ్మాయిల్లో ఉన్నత విద్యపై ఆసక్తి పెంచడం.దీంతోపాటు విద్యార్థినులు జీవితంలో సొంతంగా నిలదొక్కుకొనేందుకు అవసరమైన సామర్థ్యాలను సాధించేలా వారిని ప్రోత్సహిస్తారు. ముఖ్యంగా గ్రామీణ నేపథ్యం ఉన్న విద్యార్థినులకు సైన్స్ విభాగాల్లో పాఠశాల నుంచి కళాశాల వరకు... పరిశోధనల నుంచి ఉద్యోగ సాధన దాకా.. కెరీర్‌ను తీర్చిదిద్దుకోవడంపై అవగాహన కల్పిస్తారు.

### పథకం లక్ష్యం

విద్యార్థినుల్లో స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) కోర్సుల పట్ల ఆసక్తి పెంచడం, ఆయా విభాగాల్లో వారిని ప్రోత్సహించడం.

- ఈ కార్యక్రమం కింద తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం వరకు విద్యార్థినులను ఎంపిక చేస్తారు.
- ఈ పథకం కింద 2020-2025 మధ్యకాలంలో 550 జిల్లాల నుంచి విద్యార్థినులను ఎంపిక చేయనున్నారు.
- ఈ స్కీమ్‌లో భాగంగా ప్రతిష్టాత్మక విద్యా సంస్థలైన ఐఐటీలు, ఎన్ఐటీలు, జాతీయ ల్యాబొరేటరీలల్లో సైన్స్‌పై సదస్సులు, క్యాంపులు నిర్వహిస్తారు.
- ఈ కార్యక్రమంలో విద్యార్థినులు క్యాంపునకు హాజరయ్యేందుకు అవసరమైన ప్రయాణ ఖర్చులు, ఇతర త్రా వ్యయాలను అందిస్తారు.

> » స్టెమ్ కోర్సుల్లో విద్యార్థినులను ప్రోత్సహించేలా కేంద్రం కొత్త స్కీమ్

- ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు సైన్సు అండ్ టెక్నాలజీ, కార్పొరేట్ ప్రపంచం, విశ్వవిద్యాలయాలు, డీఆర్‌డీవో తదితర విభాగాలు, సంస్థల్లోని మహిళా నాయకులు, నిపుణులతో సంభాషించే అవకాశం లభిస్తుంది.
- శాస్త్ర, సాంకేతిక డిపార్ట్‌మెంట్‌తో కలసి శాస్త్రవేత్త సంజీవ్ మిశ్రా ఈ కార్యక్రమ అమలు బాధ్యతలు చూస్తున్నారు.

### ఐఐటీల్లో సమ్మర్ క్యాంపులు

- విజ్ఞాన జ్యోతి కార్యక్రమం కింద వేసవి సెలవుల్లో ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర జాతీయ పరిశోధనా కేంద్రాల్లో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తారు. విద్యార్థినుల్లో సైన్సు, టెక్నాలజీ పట్ల ఆసక్తి పెంపొందించడం.. ఆయా విభాగాల్లో అందుబాటులో ఉన్న కెరీర్ అవకాశాలపై అవగాహన కల్గించడం ప్రధాన ఉద్దేశం. ఆయా క్యాంపుల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థినులు సైన్సు, టెక్నాలజీ విభాగాల్లోని శాస్త్రవేత్తలు, ఇంజనీర్లతో సంభాషించే అవకాశం దక్కుతుంది.
- క్యాంపుల్లో లెక్చర్స్‌తోపాటు ల్యాబొరేటరీల్లో ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. అదేవిధంగా కంప్యూటర్స్, ఇంటర్నెట్ విజ్ఞానాన్ని సముపార్జించే విధానాన్ని నేర్పిస్తారు. దీంతోపాటు క్యాంపస్ వాక్, యోగా తదితర ఔట్‌డోర్ యాక్టివిటీస్ నిర్వహిస్తారు.
- ఎంపికైన విద్యార్థులకు క్యాంపు జరిగినన్ని రోజులు ఐఐటీ హాస్టల్‌లో బస, భోజన వసతులు కల్పిస్తారు. ఎంపికైన విద్యార్థినులతోపాటు క్యాంపు తొలి, చివరి రోజు వారి తల్లిదండ్రులు సైతం పాల్గొనాల్సి ఉంటుంది. ఆయా రోజుల్లో విద్యార్థినుల తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహిస్తారు. ఇందులో ఆడ పిల్లలకు స్టెమ్ కోర్సులు, కెరీర్ అవకాశాలు, అమ్మాయిలు విద్యను కొనసాగించాల్సిన అవసరాన్ని తెలియజేస్తారు.
- విజయవంతంగా క్యాంపును ముగించుకున్న వారికి రూ.5000 స్కాలర్‌షిప్‌గా అందిస్తారు.

### ఎంపిక ప్రక్రియ

ఆయా కాలేజీ ప్రిన్స్‌పల్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న అమ్మాయిల్లో ముగ్గురిని మెరిట్ ఆధారంగా ఎంపిక చేయాల్సి ఉంటుంది. దరఖాస్తులకు వారి పదోతరగతి మార్కుల జాబితాను జతచేయాల్సి ఉంటుంది. అలా వచ్చిన దరఖాస్తుల్లో నుంచి విద్యార్థులను ఎంపిక చేస్తారు.

## మూడో కంటికి నోబాల్...

ఇప్పటిదాకా నోబాల్‌ను ఫీల్డు అంపైర్లే చూసేవారు. వారు చూసినపుడు నోబాల్... లేదంటే లేదు. కొన్ని సందర్భాల్లో గీత దాటిన నోబాల్‌కు నాటౌట్ అయినా... అంపైర్లు దాన్ని గమనించకపోవడంతో పెవిలియన్ చేరిన సందర్భాలున్నాయి. అయితే నోబాల్‌ను ఇకపై థర్డ్ అంపైర్ పర్యవేక్షిస్తారు. భారత్, వెస్టిండీస్‌ల సిరీస్‌తో నోబాల్ నిర్ణయాధికారం థర్డ్ అంపైర్ పరిధిలోకి వెళ్తుందని ఐసీసీ తెలిపింది.

**8**

భారత్, వెస్టిండీస్ మధ్య ఇప్పటివరకు 14 టి20 మ్యాచ్‌లు జరిగాయి. భారత్ 8 మ్యాచ్‌ల్లో నెగ్గగా... విండీస్ 5 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో ఫలితం రాలేదు. విండీస్‌తో జరిగిన చివరి 5 టి20ల్లో భారత్‌నే విజయం వరించింది.

**1**

మరో సిక్స్ కొడితే అంతర్జాతీయ క్రికెట్‌లో (టెస్టు, వన్డే, టి20) 400 సిక్స్‌లు పూర్తి చేసుకోనున్న తొలి భారతీయ క్రికెటర్‌గా, ఓవరాల్‌గా మూడో క్రికెటర్‌గా రోహిత్ శర్మ గుర్తింపు పొందుతాడు. ప్రస్తుతం రోహిత్ ఖాతాలో 399 సిక్స్‌లు ఉన్నాయి. ఈ జాబితాలో క్రిస్ గేల్ (534 సిక్స్‌లు), షాహిద్ అఫ్రిది (476 సిక్స్‌లు) వరుసగా తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

# మెరిసేదెవరో... మెప్పించేదెవరో?



- నేడు భారత్, వెస్టిండీస్ తొలి టి20 మ్యాచ్
- రాహుల్, పంత్‌లకు చక్కని అవకాశం
- ఐపీఎల్ వేలానికి ముందు కుర్రాళ్లకు లక్కీచాన్స్
- గెలవాలన్న పట్టుదలతో విండీస్

**రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం**

**సాక్షి, హైదరాబాద్:** భారత కుర్రాళ్లను ఇప్పుడు ఐపీఎల్ వేలమే కాదు... వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరిగే టి20 ప్రపంచకప్ కూడా ఊరిస్తోంది. తమ నిలకడైన ప్రదర్శనతో అటు ఫ్రాంచైజీలు, ఇటు సెలక్టర్ల కంట పడేందుకు యువ ఆటగాళ్లకు విండీస్‌తో సిరీస్ చక్కని అవకాశం కల్పిస్తోంది. ఇరుజట్ల మధ్య శుక్రవారం తొలి మ్యాచ్ జరుగుతుంది. ఐపీఎల్‌లో హిట్టయినా... టీమిండియా తరఫున ఫ్లాపవుతున్న ఆటగాళ్లు మనసుపెడితే చోటు ఖాయం చేసుకునే తరుణం కూడా ఇదే! ఐపీఎల్ వేలానికి ముందు జరుగుతున్న సిరీస్ కాబట్టి ఎవరు మెరిపిస్తే వాళ్లపైనే కాసులు కురుస్తాయన్న సంగతి ఆటగాళ్లకు బాగా తెలుసు. ఈ నేపథ్యంలో భారత తుది జట్టుకు ఆడే కుర్రాళ్లు అందివచ్చిన ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునే పనిలో పడ్డారు.

భాగ్యనగరం ఎన్నో ఐపీఎల్ టి20 మ్యాచ్‌లకు వేదికగా నిలిచింది. కానీ అంతర్జాతీయ మెరుపులే లేవు. వన్డే, టెస్టులకు ఆతిథ్యమిచ్చిన ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియం ఇప్పుడు ఆ 'పొట్టి' లోటునూ తీర్చుకునేందుకు సిద్ధమైంది. ఫామ్‌లో ఉన్న కోహ్లి సేన జోరును ప్రత్యక్షంగా తిలకించేందుకు భాగ్యనగర క్రికెట్ ప్రియులు పోటెత్తనున్నారు. 'ఢీ'కొట్టేందుకు వెస్టిండీస్ 'సై' అంటోంది.

### నడిపించే నాయకుడొచ్చాడు...

బంగ్లాదేశ్‌తో జరిగిన టి20 సిరీస్‌కు విశ్రాంతి తీసుకున్న కోహ్లి మళ్లీ జట్టును నడిపించేందుకు రావడమే భారత్‌కు సగం బలం. భారత విజయవంతమైన సారథి ఫామ్‌కు ఏ ఢోకా లేదు. ఆడేది ముందయినా... తర్వాత ఛేదన అయినా తన వంతు మెరుపులు మెరిపిస్తాడు. చాన్నాళ్ల తర్వాత టి20 జట్టులోకి కీలక బౌలర్లు పునరాగమనం చేశారు. పేసర్లు భువనేశ్వర్, షమీ, కుల్దీప్‌లు పొట్టి మ్యాచ్‌కు సిద్ధమయ్యారు. జట్టు కూర్పులో భాగంగా ఇద్దరేసి సీమర్లు, స్పిన్నర్లను తీసుకుంటే కుల్దీప్, షమీకి తుది జట్టులో చాన్స్ లేకపోవచ్చు. ఇటీవల యువ పేసర్ దీపక్ చాహర్ చెలరేగుతుండటంతో కోహ్లి ఈ కుర్రాడివైపే మొగ్గుచూపొచ్చు. అలాగే రవీంద్ర జడేజా బ్యాటింగ్‌లో అక్కరకొస్తాడు. కాబట్టి యజువేంద్ర చహల్‌కు జతగా జడేజానే కోహ్లి ఎంపికవుతుంది. దీంతో కుల్దీప్ బెంచ్‌కే పరిమితం కావాలి. మిడిలార్డర్‌లో అయ్యర్, మనీశ్ పాండే, శివమ్ దూబేల స్థానాలకు ఢోకా లేదు.

### రాహుల్‌కు భలే చాన్సులే!

రెగ్యులర్ ఓపెనర్ శిఖర్ ధావన్ గాయంతో ఈ సిరీస్‌కు దూరం కావడం లోకేశ్ రాహుల్‌కు వరమైంది. దీంతో ప్రతీ మ్యాచ్‌లోనూ రోహిత్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించే అవకాశం దక్కుతుంది. ఇక్కడ మెరుపులు మెరిపిస్తే రోహిత్‌కు రెగ్యులర్ భాగస్వామి కూడా కావొచ్చు. పైగా టి20ల్లో రాహుల్‌కు మంచి రికార్డే ఉంది. 31 పొట్టి మ్యాచ్‌ల్లో 42.74 సగటుతో 974 పరుగులు చేశాడు. ఈ ఐపీఎల్‌లోనూ వీరబాదుడు బాదిన సంగతి తెలిసిందే. మరో యువ బ్యాట్స్‌మన్ రిషభ్ పంత్ ఈ సిరీస్‌లో తానేంటో నిరూపించుకోవాలి. కెప్టెన్, జట్టు మేనేజ్‌మెంట్ నుంచి కావాల్సినంత సహకారం లభిస్తున్నా... ఇంకా జట్టులో ప్రభావవంతమైన ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. ధోని వారసుడిగా వచ్చిన పంత్ నిలకడలేని ఆటతీరుతో నిరాశపరుస్తున్నాడు. ఈ నేపథ్యంలో అతను విండీస్‌పైనా పట్టుదలతో రాణించాల్సిన అవసరముంది.

### అనుభవలేమి అసలు సమస్య...

అనుభవజ్ఞులైన ఆటగాళ్లు లేకపోవడం ప్రస్తుత వెస్టిండీస్‌కు పెద్ద సమస్య. ఈ ఐపీఎల్‌లో ఆల్‌రౌండ్ మెరుపులు మెరిపించిన రసెల్ సహా, బ్రాత్‌వైట్, బ్రేవోలను కాదని వెస్టిండీస్ పూర్తిగా యువ ఆటగాళ్లతో భారత్‌కు వచ్చింది. బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడటంతో హిట్టర్ నికోలస్ పూరన్ కూడా మ్యాచ్‌కు దూరమయ్యాడు. దీంతో పర్యాటక జట్టు బ్యాటింగ్ లైనప్ ప్రధానంగా ఓపెనర్లు ఎవిన్ లూయిస్, లెండిల్ సిమన్స్, హెట్‌మైర్, కెప్టెన్ పొలార్డ్‌లపైనే ఆధారపడి ఉంది. ఇక బౌలర్ల విషయానికొస్తే హోల్డర్, కీమో పాల్, కాట్రెల్‌లపై జట్టు నమ్మకం పెట్టుకుంది. భారత్‌లో ఆడిన అనుభవం తమకు వుందని, యువసత్తాతోనే కోహ్లిసేను ఓడిస్తామని పొలార్డ్ చెప్పాడు.



నాకు భారత్‌లో ఆడిన అనుభవముంది. ప్రస్తుతం ఇదే మాకు అక్కరకొస్తుంది. ఆతిథ్య దేశానికి సవాల్ విసిరేందుకు మా కుర్రాళ్లంతా సిద్ధంగా ఉన్నారు. సిరీస్ కోసం బాగా సన్నద్ధమయ్యాం. తప్పకుండా మా వాళ్లు రాణిస్తారు. ప్రపంచ క్రికెట్‌లో భారత్ మేటి ప్రత్యర్థి. టెస్టుల్లో నంబర్‌వన్ అయిన జట్టును మేం ధీటుగా ఎదుర్కొంటాం. మెరుగైన ప్రదర్శన కనబరుస్తాం. అందుబాటులో ఉన్న అవకాశాల్ని వినియోగించుకుంటాం. ఒకరిద్దరి ఆటగాళ్ల చుట్టూనే తిరగం. వారిపై ఆధారపడం. జట్టుగా ఏం చేయాలో... ఎలా పోరాడాలో మాకు తెలుసు.

-వెస్టిండీస్ కెప్టెన్ పొలార్డ్

టి20 క్రికెట్లో ఆరుగురి బౌలింగ్ ఆప్షన్లు అందుబాటులో ఉండాల్సిందే. ఎందుకంటే మనం ఎంచుకున్న ఐదుగురు బౌలర్లు అన్ని ఓవర్ల (నాలుగు ఓవర్ల కోటా)ను అద్భుతంగా వేస్తారని ఆశించలేం. అందుకే ఆరో బౌలింగ్ ఆప్షన్ ఉండాలి. ప్రపంచకప్ కోసం జట్టులో పేసర్ల మధ్యే పోటీ నెలకొంది. బుమ్రా, భువనేశ్వర్, షమీలతో పాటు యువ బౌలర్ దీపక్ చాహర్ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నారు. టాప్-4లో రోహిత్, రాహుల్, నేను, అయ్యర్ పదిలంగా ఉన్నాం. రిషభ్‌కు మిడిలార్డర్‌లోనే అవకాశమిస్తాం. అతను ధోనిలా అనుకరించి విఫలమైనంత మాత్రానా ధోని పేరుతో వెక్కిరించడం ధోని స్థాయిని కించపరచడమే అవుతుంది. పంత్‌లో సహజసిద్ధమైన ప్రతిభవుంది. అవకాశాలు ఇస్తే నిలకడైన బ్యాట్స్‌మన్‌గా నిరూపించుకునే సత్తా అతనిలో ఉంది.

-భారత కెప్టెన్ కోహ్లి



రోహిత్, పంత్‌లతో హెచ్‌సీఏ అధ్యక్షుడు అజహర్

### జట్లు (అంచనా)

**భారత్:** కోహ్లి (కెప్టెన్), రోహిత్ శర్మ, రాహుల్, శ్రేయస్ అయ్యర్, మనీశ్ పాండే, రిషభ్ పంత్, శివమ్ దూబే, రవీంద్ర జడేజా, చహల్, భువనేశ్వర్, దీపక్ చాహర్.

**వెస్టిండీస్:** పొలార్డ్ (కెప్టెన్), లూయిస్, సిమన్స్, బ్రాండన్ కింగ్, హెట్‌మైర్, రాందిన్, హోల్డర్, పియెర్/కీమో పాల్, అలెన్, వాల్ష్ జూనియర్, కాట్రెల్.

**పిచ్, వాతావరణం**

ఇప్పటిదాకా పొట్టిఫార్మాట్‌లో ఈ పిచ్ బౌలర్లకు బాగా కలిసొచ్చింది. ఐపీఎల్‌లో హోమ్ టీమ్ సన్‌రైజర్స్ బౌలర్లు తమ బ్యాట్స్‌మెన్ తక్కువ స్కోరు చేసినా నిలబెట్టిన సందర్భాలున్నాయి. చల్లటి సాయంత్రం వర్షం ముప్పేమీ లేదు. మంచు ప్రభావం దృష్ట్యా పిచ్‌ను పూర్తిగా కప్పి ఉంచారు.

---



బీడబ్ల్యూఎఫ్ అవార్డు రేసులో

## సాత్విక్, చిరాగ్

**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) వార్షిక అవార్డుల్లో భాగంగా 'మోస్ట్ ఇంప్రూవ్డ్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' కేటగిరీలో భారత డబుల్స్ ఆటగాళ్లు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టిలకు స్థానం లభించింది. ఈ ఏడాది సాత్విక్ సాయిరాజ్ (ఆంధ్రప్రదేశ్), చిరాగ్ శెట్టి (మహారాష్ట్ర) జంట థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీలో టైటిల్ నెగ్గడంతో పాటు ఫ్రెంచ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీలో రన్నరప్‌గా నిలిచింది. 'మోస్ట్ ఇంప్రూవ్డ్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు రేసులో మిచెల్లి లీ (మహిళల సింగిల్స్-కెనడా), కిమ్ సో యోంగ్-కాంగ్ హీ యోంగ్ (మహిళల డబుల్స్-కొరియా), ప్రవీణ్ జోర్డాన్-మేలతి దేవ ఒక్తావియాంతి (మిక్స్‌డ్ డబుల్స్-ఇండోనేసియా) కూడా ఉన్నారు. దివ్యాంగుల విభాగంలో భారత్‌కే చెందిన ప్రమోద్ భగత్ 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు రేసులో ఉన్నాడు. ప్రమోద్ ఈ ఏడాది జరిగిన పారా బ్యాడ్మింటన్ టోర్నీల్లో మొత్తం 10 స్వర్ణాలు, 4 రజతాలు, 2 కాంస్యాలు గెలిచాడు. ఈనెల 9న చైనాలోని గ్వాంగ్‌జూలో జరిగే బ్యాడ్మింటన్ సీజన్ ముగింపు టోర్నీ వరల్డ్ టూర్ ఫైనల్స్ ప్రారంభోత్సవంలో విజేతలను ప్రకటిస్తారు.

### కేరళ, ముంబై మ్యాచ్ 'డ్రా'

**ముంబై:** మ్యాచ్ ఆసాంతం అద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకున్న కేరళ బ్లాస్టర్స్ విజయాన్ని అందుకోలేకపోయింది. ఇండియన్ సూపర్ లీగ్ సీజన్-6లో భాగంగా గురువారం జరిగిన కేరళ, ముంబై సిటీ ఎఫ్‌సీ మ్యాచ్ 1-1తో 'డ్రా'గా ముగిసింది. 75వ నిమిషంలో కర్నెరో కొట్టిన క్రాస్‌ను గోల్‌గా మలిచిన మెస్సీ బౌలి కేరళ ఖాతా తెరిచాడు. అయితే ఆ ఆనందం ఎంతో సేపు నిలువలేదు. రెండు నిమిషాల అనంతరం ప్రత్యర్థి డిఫెండర్ల అలసత్వాన్ని సొమ్ము చేసుకుంటూ ముంబై ఆటగాడు చెర్మిటి గోల్ చేసి స్కోర్‌ను సమం చేశాడు. నేడు విశ్రాంతి దినం. శనివారం జరిగే మ్యాచ్‌లో నార్త్‌ఈస్ట్ యునైటెడ్‌తో కోల్‌కతా ఆడుతుంది.

## పురుషుల వన్డేకు మహిళా మ్యాచ్ రిఫరీ

**ఆంధ్ర మాజీ క్రికెటర్ జీఎస్ లక్ష్మి కొత్త చరిత్ర**

**దుబాయ్:** ఈ ఏడాది మే నెలలో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మ్యాచ్ రిఫరీల ప్యానెల్‌లో చోటు దక్కించుకున్న తొలి మహిళగా చరిత్ర సృష్టించిన భారత మాజీ క్రికెటర్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గండికోట సర్వ (జీఎస్) లక్ష్మి ఖాతాలో మరో ఘనత చేరనుంది. అంతర్జాతీయ పురుషుల వన్డే మ్యాచ్‌కు రిఫరీగా పనిచేయనున్న మొట్టమొదటి మహిళా మ్యాచ్ రిఫరీగా ఆమె రికార్డు నెలకొల్పనున్నారు. ఐసీసీ పురుషుల క్రికెట్ వరల్డ్ కప్ లీగ్-2 టోర్నీలో భాగంగా యూఏఈ వేదికగా ఆదివారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్ఏ) జట్ల మధ్య జరిగే మ్యాచ్‌కు లక్ష్మి మ్యాచ్ రిఫరీగా వ్యవహరించనున్నారు. ఈ అరుదైన అవకాశం తనకు రావడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేసింది. 'చాలా గొప్పగా అనిపిస్తుంది. గర్వంగా ఉంది. ఏదైనా మనతోనే మొదలైంది అని చెప్పుకోవడంలో ఒక ఆనందం ఉంటుంది. ఐసీసీ టోర్నీలకు పనిచేయడం గొప్పగా ఉంటుంది' అని 51 ఏళ్ల లక్ష్మి పేర్కొన్నారు. 2008-09 సీజన్‌లో మొదటిసారి దేశవాళీ మహిళా క్రికెట్ మ్యాచ్‌లకు రిఫరీగా వ్యవహరించిన ఆమె... అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటివరకు 3 మహిళల వన్డేలకు, 7 టి20 మ్యాచ్‌లకు పనిచేశారు. 20 అంతర్జాతీయ పురుషుల టి20 మ్యాచ్‌లకు కూడా ఆమె రిఫరీగా వ్యవహరించారు.



### శ్రీలంక జట్టు హెడ్ కోచ్‌గా ఆర్థర్



**కొలంబో:** ఈ ఏడాది ప్రపంచకప్‌లో పేలవమైన ఆటతీరుతో ఇంటా, బయటా విమర్శలు ఎదుర్కొన్న శ్రీలంక క్రికెట్‌లో ప్రక్షాళన మొదలైంది. ఆ జట్టు హెడ్ కోచ్‌గా దక్షిణాఫ్రికాకు చెందిన మికీ ఆర్థర్‌ను శ్రీలంక క్రికెట్ బోర్డు గురువారం నియమించింది. అతనితో పాటు జింబాబ్వే ఆటగాడు గ్రాంట్ ఫ్లవర్‌ను బ్యాటింగ్ కోచ్‌గా, ఆస్ట్రేలియాకు చెందిన డేవిడ్ సకేర్‌ను బౌలింగ్ కోచ్‌గా, షేన్ మెక్‌డెర్మట్‌ను ఫీల్డింగ్ కోచ్‌గా నియమించింది. ఆర్థర్ గతంలో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, పాకిస్తాన్ జట్లకు కోచ్‌గా వ్యవహరించాడు.

### 'టాప్స్' నుంచి నీరజ్‌కు ఉద్వాసన



**న్యూఢిల్లీ:** ఇటీవల డోపింగ్ పరీక్షలో విఫలం అయిన భారత మహిళా బాక్సర్ నీరజ్ ఫొగాట్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఒలింపిక్స్‌లో భారత్ పతకం సాధించడమే లక్ష్యంగా కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన 'టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీం' (టాప్స్) నుంచి ఆమె పేరును తొలగించారు. ఈ మేరకు నిర్ణయం తీసుకుంటూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) గురువారం ఒక ప్రకటనను విడుదల చేసింది. నీరజ్‌తో పాటు భారత షూటర్లు రవి కుమార్, ఓంప్రకాశ్‌లు కూడా 'టాప్స్' నుంచి ఉద్వాసనకు గురయ్యారు.

## పతకాల సెంచరీ



సనతోయ్ దేవి

- దక్షిణాసియా క్రీడల్లో ఎదురులేని భారత్
- 124 పతకాలతో అగ్రస్థానంలో
- ఒకేరోజు 30 స్వర్ణాలు సొంతం

**కఠ్మాండు (నేపాల్):** పతకాల వేట కొనసాగిస్తూ... దక్షిణాసియా క్రీడల్లో భారత క్రీడాకారులు దూసుకుపోతున్నారు. ఈ క్రీడల ఐదో రోజు భారత్ తమ విశ్వరూపం ప్రదర్శించింది. ఒకే రోజు 30 స్వర్ణాలు, 18 రజతాలు, 8 కాంస్యాలతో కలిపి మొత్తం 56 పతకాలు సొంతం చేసుకొని తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. ఐదో రోజు పోటీలు ముగిశాక భారత్ 62 స్వర్ణాలు, 41 రజతాలు, 21 కాంస్యాలతో కలిపి 124 పతకాలతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆతిథ్య దేశం నేపాల్ 36 స్వర్ణాలు, 27 రజతాలు, 38 కాంస్యాలతో కలిపి మొత్తం 101 పతకాలతో రెండో స్థానంలో ఉంది. గురువారం స్విమ్మింగ్, వుషు, వెయిట్‌లిఫ్టింగ్, తైక్వాండో క్రీడాంశాల్లో భారత క్రీడాకారులు పతకాల పంట పండించారు. వుషులో ఏకంగా ఏడు స్వర్ణాలు లభించాయి. మహిళల సాన్‌సూ 52 కేజీల విభాగంలో వై. సనతోయ్ దేవి... పూనమ్ (75 కేజీలు), దీపిక (70 కేజీలు), సుశీల (65 కేజీలు), రోషిబినా దేవి (60 కేజీలు)... పురుషుల గున్‌షు ఆల్ రౌండ్ ఈవెంట్‌లో సూరజ్ సింగ్... పురుషుల సాన్‌సూ ఈవెంట్‌లో సునీల్ సింగ్ (52 కేజీలు) స్వర్ణ పతకాలు సాధించారు. స్విమ్మింగ్‌లో లిఖిత్ సెల్వరాజ్ (పురుషుల 200 మీ. బ్రెస్ట్‌స్ట్రోక్), ఆపేక్ష (మహిళల 200 మీ. బ్రెస్ట్‌స్ట్రోక్), దివ్య (మహిళల 100 మీ. బటర్‌ఫ్లయ్) బంగారు పతకాలు గెలిచారు. వెయిట్‌లిఫ్టింగ్‌లో జిలిల్ దలబెహెరా (మహిళల 45 కేజీలు), స్నేహ (49 కేజీలు), వింధ్యారాణి దేవి (55 కేజీలు), సిద్ధాంత్ (పురుషుల 61 కేజీలు) స్వర్ణాలు సొంతం చేసుకున్నారు. తైక్వాండోలో పూర్వ (49 కేజీలు), రుచిక (67 కేజీలు), మార్గరెట్ (73 కేజీలు) బంగారు పతకాలు దక్కించుకున్నారు.



### ఫైనల్లో పుల్లెల గాయత్రి

బ్యాడ్మింటన్‌లో వ్యక్తిగత విభాగాల్లో భారత్‌కు రెండు స్వర్ణాలు ఖాయమయ్యాయి. మహిళల సింగిల్స్‌లో తెలుగమ్మాయి పుల్లెల గాయత్రి, అష్మిత... పురుషుల సింగిల్స్‌లో హైదరాబాద్ ప్లేయర్ సిరిల్ వర్మ, ఆర్యమాన్ టాండన్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. సెమీఫైనల్స్‌లో గాయత్రి 21-17, 21-14తో దిల్మీ డయాస్ (శ్రీలంక)పై, అష్మిత (భారత్) 21-5, 21-7తో అచిని రత్నసిరి (శ్రీలంక)పై నెగ్గారు. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో సిరిల్ వర్మ 21-9, 21-12తో దినుక కరుణరత్నె (శ్రీలంక)పై, ఆర్యమాన్ 21-18, 14-21, 21-18తో రత్నజిత్ తమాంగ్ (నేపాల్)పై గెలిచారు.

### భారత్, ఆసీస్ మ్యాచ్ 'డ్రా'

**కాన్‌బెర్రా:** మూడు దేశాల హాకీ టోర్నమెంట్‌లో భారత జూనియర్ మహిళల హాకీ జట్టు నిలకడగా ఆడుతోంది. తొలి మ్యాచ్‌లో 2-0తో న్యూజిలాండ్‌ను ఓడించిన భారత జట్టు... పటిష్ట ఆస్ట్రేలియాతో గురువారం జరిగిన మ్యాచ్‌ను 1-1తో 'డ్రా'గా ముగించింది.


**తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి**
**ప్రాంతీయ కార్యాలయము, నల్లగొండ.**
ఇం.నెం. 8-15, మొదటి అంతస్తు, శ్రీలక్ష్మి కాంప్లెక్స్, ఆర్.టి.ఓ. ఆఫీస్ దగ్గర, శ్రీ వినయాక నగర్, హైద్రాబాద్ రోడ్, నల్లగొండ-508001. తెలంగాణ. ఫోన్ 08682-248005

**పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన**

పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం యొక్క ప్రకటన నెం. యస్.ఓ. 1533 తేది. 14 సెప్టెంబర్ 2006 ను అనుసరిస్తూ మెస్సర్స్ పోరస్ లాబోరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు సర్వే నెం. 339, నల్లబండగూడెం గ్రామం, కోదాడ మండలం, సూర్యాపేట జిల్లాలో బల్క్‌డ్రగ్ & ఇంటర్మీడియట్స్‌ను తయారు చేయు ప్రస్తుత పరిశ్రమను విస్తరించుటకు ప్రతిపాదన చేయడమైనది. ఇట్టి ప్రతిపాదనకు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం ఈ ప్రకటనను జారీ చేయడం జరుగుచున్నది.

| | | |
|---|---|---|
| 1. | కంపెనీ పేరు టెలిఫోన్ నెం. | మెస్సర్స్ పోరస్ లాబోరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్, యూనిట్-1 ఫోన్ నెం. 9154092646 |
| 2. | రిజిస్టర్డ్ ఆఫీస్ | 4వ అంతస్తు, కె.కె.ఆర్. స్క్వేర్, కావూరి హిల్స్, హైదరాబాద్ - 500032, తెలంగాణ స్టేట్ |
| 3. | ప్లాంటు ప్రతిపాదన ప్రదేశం | సర్వే నెం. 339, నల్లబండగూడెం గ్రామం, కోదాడ మండలం, సూర్యాపేట జిల్లా |
| 4 | సంప్రదించవలసిన అధీకృత అధికారి | శ్రీ కె. మాలకొండయ్య, జి.ఎం, (ఇహెచ్ఎస్) ఫోన్ : 9154092646 |
| 5 | ప్రాజెక్టు పెట్టుబడి | రూ॥ 25 కోట్లు |
| 6 | చేపట్టబడు కార్యక్రమములు | బల్క్‌డ్రగ్ & ఇంటర్మీడియట్స్‌ను తయారు చేయు ప్రస్తుత పరిశ్రమను విస్తరించుటకు చేయు విస్తరణ ప్రతిపాదన |
| 7 | ప్రజాభిప్రాయ సేకరణ జరుగు తేది, సమయం మరియు ప్రదేశము | తేది. 08-01-2020 ఉదయం 10 గం॥లకు స్థలం : ప్రస్తుత పరిశ్రమ ప్రాంగణం దగ్గర నల్లబండగూడెం గ్రా॥, కోదాడ మండలం, సూర్యాపేట జిల్లా |
| 8 | ప్రాజెక్టు / పర్యావరణ కన్సల్టెంట్ | మెస్సర్స్ టీమ్ ల్యాబ్స్ మరియు కన్సల్టెంట్స్ ఆదిత్య ఎన్‌క్లేవ్, అమీర్‌పేట, హైద్రాబాద్. ఫోన్: 040-23748555 |
| 9 | ప్రతిపాదిత ప్రాజెక్టుపై ఎగ్జిక్యూటివ్ సమ్మరీ (తెలుగు / ఆంగ్లము) మరియు డ్రాఫ్ట్ ఇ.ఐ.ఎ. నివేదిక లభించు ప్రదేశాలు<br>1) జిల్లా కలెక్టర్ కార్యాలయం, సూర్యాపేట.<br>2) జిల్లా పరిశ్రమల కేంద్రం, సూర్యాపేట<br>3) జిల్లా పరిషత్ కార్యాలయం, సూర్యాపేట<br>4) తహశీల్దార్ కార్యాలయము, కోదాడ మండలం, సూర్యాపేట జిల్లా<br>5) గ్రామ పంచాయతీ కార్యాలయము, గ్రా॥ నల్లబండగూడెం, మం॥ కోదాడ, సూర్యాపేట జిల్లా<br>6) ప్రాంతీయ కార్యాలయం, పర్యావరణము, అడవులు మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, చెన్నై.<br>7) తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ భవనము, ఎ-3, ఇండస్ట్రియల్ ఎస్టేట్, సనత్‌నగర్, హైద్రాబాద్.<br>8) తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, జోనల్ కార్యాలయం, రామచంద్రాపురం, సంగారెడ్డి జిల్లా.<br>9) తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, నల్లగొండ. | |

ప్రభావితం అయ్యేటటువంటి ప్రాజెక్టు స్థలం / డిస్ ప్లేస్ మెంట్ స్థలాల వద్ద ఉన్న ప్రామాణిక నివాసితులు, పర్యావరణ గ్రూపులు, ఇతరులతో సహా అందరు వ్యక్తుల నుండి ఎవరికైనా ఏదేని అభ్యంతరాలు మరియు సలహాలు, ఉద్దేశ్యాలు మరియు వ్యాఖ్యలు ఉన్నట్లయితే ప్రకటన ప్రచురణ తేది నుండి 30 రోజులలోగా కోరబడుచున్నవి. పై అందరు వ్యక్తులు తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి దిగువ సంతకందారులకు వ్రాతపూర్వక సలహాలు కూడా దాఖలు చేసుకొనవచ్చును. ఆసక్తి గల వ్యక్తులు పై నిర్దేశించిన తేది మరియు ప్రదేశమున జరుగు ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనవచ్చును. డ్రాఫ్ట్ ఇ.ఐ.ఎ. మరియు ఎగ్జిక్యూటివ్ సమ్మరీ (తెలుగు మరియు ఆంగ్లము) టి.యస్.పి.సి.బి. వెబ్ సైట్లో అప్లోడ్ చేయబడును.

సం/-
**పర్యావరణ ఇంజనీర్**
తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి
ప్రాంతీయ కార్యాలయం, నల్లగొండ.

ప్రదేశం : నల్లగొండ.
తేది. 05-12-2019

సాక్షి **బిజినెస్**
శుక్రవారం
6-12-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 71 ▼ | 25 ▼ |
| 40,780 | 12,018 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు 11.30గంటలకు)

| సూచీ | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 8,556 | ▼ | 10 |
| డోజోన్స్ | 27,590 | ▼ | 60 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,138 | ▼ | 51 |
| డాక్స్ | 13,055 | ▼ | 86 |
| షాంఘై | 2,899 | ▲ | 21 |
| నికాయ్ | 23,300 | ▲ | 165 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| కరెన్సీ | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.75 | 72.39 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 92.26 | 95.48 |
| యూరో | ఎస్‌బీఐ | 77.90 | 80.79 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 64.55 | 66.97 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.90 | 50.09 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.62 | 53.42 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.22 | 19.82 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.94 | 19.95 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.50 | 10.91 |

## ఈసారికి... ఏమీ లేదు!!

# ‘ధర’ఘాతం!



### రెపో, రివర్స్ రెపో రేట్లు యథాతథం

- తాత్కాలిక విరామం ఇవ్వాలని ఆర్‌బీఐ నిర్ణయం
- ద్రవ్యోల్బణం పెరుగుదలపై ఆందోళనలే కారణం
- జీడీపీ వృద్ధి అంచనాలు 5 శాతానికి తగ్గింపు
- మున్ముందు పరిస్థితులు మెరుగుపడితే చూస్తాం
- మందగమనం పోయిందని ఇప్పుడే చెప్పలేం
- రిజర్వు బ్యాంకు గవర్నర్ శక్తికాంత దాస్ వ్యాఖ్యలు



**ముంబై:** విశ్లేషకులు, బ్యాంకర్ల అంచనాలకు భిన్నంగా ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) మరోసారి రేట్ల కోతకు వెళ్లకుండా యథాతథ పరిస్థితికి మొగ్గు చూపించింది. ప్రస్తుతమున్న రెపో రేటు (బ్యాంకులకు ఇచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీ) 5.15 శాతం, రివర్స్ రెపో రేటు (బ్యాంకుల నుంచి ఆర్‌బీఐ తీసుకునే నిధులపై చెల్లించే వడ్డీ) 4.90 శాతాన్ని అలాగే కొనసాగించాలని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ అధ్యక్షతన సమావేశమైన ఆరుగురు సభ్యుల ఎంపీసీ ఏకగ్రీవంగా నిర్ణయించింది. దేశ జీడీపీ వృద్ధిరేటు సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలంలో 4.5 శాతానికి పడిపోవడంతో (ఆరేళ్ల కనిష్ట స్థాయి), ఒకవైపు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ ఆర్‌బీఐ ఎంపీసీ.. కనీసం పావు శాతం వరకు రెపో రేటును తగ్గిస్తుందని విశ్లేషకులు, నిపుణులు ఊహించారు. అయితే, ద్రవ్యోల్బణం పెరిగిపోతుండటం, రానున్న కాలంలో మరింతగా పెరిగే అవకాశాలుండటం రేట్ల కోతకు వెళ్లకుండా అడ్డుపడ్డాయి. అంతేకాదు, తాజా స్థూల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న ఎంపీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019–20) జీడీపీ వృద్ధి అంచనాలను ఏకంగా 5%కి తగ్గించేసింది. అక్టోబర్ సమీక్షలో వృద్ధి అంచనాను 6.1%గా పేర్కొనటం గమనార్హం. తన సర్దుబాటు విధానాన్ని ఎంపీసీ కొనసాగించడం ఒక్కటే తాజా భేటీలో సానుకూలత. వృద్ధికి మద్దతుగా అవసరమైనంత వరకు ఇదే విధానం కొనసాగుతుందని పేర్కొంది. ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంటే తదుపరి సమావేశాల్లో రేట్ల కోతకు అవకాశం ఉంటుందని సంకేతం పంపింది. అంటే భవిష్యత్తులో ద్రవ్యోల్బణమే వడ్డీ రేట్లను నిర్ణయించగలదని స్పష్టం చేసింది. అంతేకాదు, తదుపరి రేట్ల కోత రానున్న బడ్జెట్‌పైనా ఆధారపడి ఉంటుందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ చెప్పారు. కాగా, తదుపరి ఆర్‌బీఐ పాలసీ సమీక్ష ఫిబ్రవరి 4–6 మధ్య జరగనుంది.

### ద్రవ్యోల్బణం పెరగొచ్చు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.7–5.1 శాతం మధ్య.. 2020–21 మొదటి అర్ధభాగంలో 4.3–4.8 శాతం మధ్య ఉండొచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది. ‘‘నాలుగో త్రైమాసికంలో (వచ్చే జనవరి–మార్చి) ఆహార ద్రవ్యోల్బణం అధిక స్థాయిల్లో ఉండొచ్చు. రానున్న నెలల్లో ఇది నియంత్రణలోకి రావడం అన్నది ఎన్నో అంశాలపై ఆధారపడి ఉంది. కూరగాయల ధరల పెరుగుదల ఒకటి, రెండు నెలలు కొనసాగొచ్చు. ఖరీఫ్‌లో ఆలస్యంగా వేసిన పంటల దిగుబడులు, సరఫరా దిశగా ప్రభుత్వం తీసుకున్న చర్యలతో 2020 ఫిబ్రవరికి కూరగాయల ధరలు శాంతించొచ్చు. టెలికం చార్జీలు పెంచడం ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపుతుంది. అయితే, టోకు ద్రవ్యోల్బణం మాత్రం ప్రస్తుత స్థాయి 4 శాతం లోపే కొనసాగొచ్చు’’ అని ఆర్‌బీఐ ఎంపీసీ పేర్కొంది. అక్టోబర్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.6 శాతానికి చేరిన విషయం తెలిసిందే. 4 శాతానికి కట్టడి చేయాలన్నది ఆర్‌బీఐ లక్ష్యం.

### వృద్ధి 5 శాతం

2019–20 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి 5 శాతం మేరే ఉండొచ్చని ఎంపీసీ పేర్కొంది. 6.1 శాతంగా ఉండొచ్చన్న గత అంచనాలను సవరించింది. 2019–20 రెండో అర్ధభాగంలో (2019 అక్టోబర్– 2020 మార్చి) వృద్ధి రేటు 4.9–5.5 శాతం మధ్య.. 2020–21 మొదటి ఆరు నెలల కాలంలో 5.9–6.3 శాతం మధ్య ఉంటుందని ఆర్‌బీఐ ఎంపీసీ అంచనా వేసింది. రానున్న కేంద్ర బడ్జెట్ సందర్భంగా ప్రభుత్వం తీసుకోబోయే చర్యలు, వృద్ధిపై వాటి ప్రభావం విషయమై స్పష్టత వస్తుందని పేర్కొంది. డిమాండ్ పరిస్థితులు బలహీనంగా ఉన్నట్టు ఎన్నో అంశాలు స్పష్టం చేస్తున్నాయని అభిప్రాయపడింది.

### విరామం తాత్కాలికమే...

వడ్డీ రేట్ల సవరణకు విరామం తాత్కాలికమే. ఈ ఏడాది ఐదు సమీక్షా సమావేశాల్లో (ఫిబ్రవరి నుంచి అక్టోబర్ వరకు) 135 బేసిస్ పాయింట్ల వరకు (1.35%) రేట్లను తగ్గించాం. దీని ప్రభావం ఏ మేర ఉందో చూడాలంటే కొంత సమయం ఇవ్వాలి. బ్యాంకులు ఇంత వరకు 44 బేసిస్ పాయింట్ల వరకే రేట్ల తగ్గింపును రుణ గ్రహీతలకు బదిలీ చేశాయి. రేట్ల తగ్గింపు ప్రయోజనం గరిష్ట స్థాయిలో నెరవేరాల్సి ఉంది. అప్పుడే తదుపరి రేట్ల కోతకు అవకాశం ఉంటుంది. వృద్ధి– ద్రవ్యోల్బణం పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతానికి విరామమే మేలని ఎంపీసీ భావించింది. ఒక యంత్రం మాదిరిగా ప్రతీసారి ఆర్‌బీఐ రేట్లను తగ్గించదు. గడిచిన కొన్ని నెలల్లో వృద్ధికి ఊతమిచ్చేందుకు ఆర్‌బీఐ, ప్రభుత్వం సంయుక్తంగా కొన్ని చర్యలు తీసుకున్నాయి. వాటి ప్రభావాన్ని చూశాక గానీ రేట్లపై నిర్ణయం తీసుకోలేం. ఆర్థిక వ్యవస్థ గాడిలో పడుతున్నట్లు ముందస్తు సంకేతాలు కనిపిస్తున్నాయి. కానీ, వాటి స్థిరత్వంపై ఇప్పుడే నిర్ణయానికి రావడం తొందరపాటే. అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 4.6%గా నమోదవడం అంచనాల కంటే చాలా ఎక్కువ. ఇటీవలి ప్రభుత్వ చర్యలతో సెంటిమెంట్ మెరుగుపడి డిమాండ్ ఊపందుకుంటుంది. ప్రభుత్వం ద్రవ్యలోటుపై ఆందోళన చెందడం లేదు. వృద్ధి కోసం ప్రభుత్వం, ఆర్‌బీఐ సమన్వయంతో పనిచేస్తాయి.

*– శక్తికాంత దాస్, ఆర్‌బీఐ గవర్నర్*

### ఆశ్చర్యకర నిర్ణయం...



ఊహించని పాలసీ ఆశ్చర్యపరిచింది. అయినా ఎంతో సముచితమైనది. వృద్ధి అంచనాలను ఈ ఆర్థిక సంవత్సరానికి 5%కి, వచ్చే ఆర్థిక సంవత్సరానికి కూడా తగ్గించడం అన్నది రికవరీ(పుంజుకోవడం) నిదానంగా ఉంటుందని తెలియజేస్తోంది.

*– రజనీష్ కుమార్, ఎస్‌బీఐ చైర్మన్*

### అధిక ధరలే కారణం...



ద్రవ్యోల్బణం కఠినంగా మారడం, పెరిగిపోయే అంచనాలకు ఆర్‌బీఐ స్పందించినట్టు అర్థమవుతుంది. 135 బేసిస్ పాయింట్ల తగ్గింపు ప్రయోజనం పూర్తిగా నెరవేరే వరకు వేచి చూడాలని భావిస్తోంది.

*– అభిషేక్ బారువా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ముఖ్య ఆర్థికవేత్త*

### నిరాశ పరిచింది...



ఆర్‌బీఐ రెపో రేటును మార్చకపోవడంపై నిరాశ చెందాం. వృద్ధి బలహీనత పరిస్థితుల్లో రేట్ల కోత అవసరం అన్న ఫిక్కీ విధానానికి విరుద్ధంగా ఉంది. గతంలో రేట్ల కోత ప్రయోజనం కూడా పూర్తిగా అమలు కాలేదు. మార్కెట్, ఇన్వెస్టర్లలో సెంటిమెంట్ మెరుగుదలకు చర్యలు చేపట్టాలి.

*– సందీప్ సోమాని, ఫిక్కీ ప్రెసిడెంట్*

### సెంటిమెంట్‌ను దెబ్బతీస్తుంది..



ఆర్‌బీఐ వేచిచూసే ధోరణి రియల్టీ రంగంలో సెంటిమెంట్‌ను దెబ్బ తీస్తుంది. స్వల్ప మొత్తాల్లో పావు శాతం చొప్పున కాకుండా 100 బేసిస్ పాయింట్ల మేర రేట్ల కోతను మేం అంచనా వేశాం.

*– నిరంజన్ హిరనందాని, నారెడ్కో ప్రెసిడెంట్*

### కొత్తగా ప్రీపెయిడ్ కార్డు

కొత్తగా ఒక ప్రీపెయిడ్ కార్డు(ముందస్తు చెల్లింపుల సాధనం/పీపీఐ)ను తీసుకురావాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. రూ.10,000 వరకు వస్తు, సేవల కొనుగోళ్లకు మాత్రమే దీన్ని వాడొచ్చని పేర్కొంది. డిజిటల్ చెల్లింపులను పెంచే విషయంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడింది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను ఈ నెలాఖరుకు విడుదల చేస్తామని పేర్కొంది.



### ఒక్క ఎన్‌బీఎఫ్‌సీనీ కూలిపోనివ్వం




సమస్యల్లో ఉన్న బ్యాంకింగేతర ఆర్థిక రంగాన్ని (ఎన్‌బీఎఫ్‌సీ) నిశితంగా పర్యవేక్షిస్తున్నామని, ఏ ఒక్క ఎన్‌బీఎఫ్‌సీ కుప్పకూలకుండా చూస్తామని ఆర్‌బీఐ గవర్నర్ దాస్ అభయమిచ్చారు. నిర్వహణ బాగున్న ఎన్‌బీఎఫ్‌సీలకు ఇటీవల నిధుల సరఫరా పెరిగిందన్నారు. సెంట్రల్ బ్యాంకు బృందం అగ్రస్థాయి 50 ఎన్‌బీఎఫ్‌సీలను (మార్కెట్ వాటాలో 70 శాతం వీటిదే) చాలా నిశితంగా పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. వ్యవస్థాపరంగా ముఖ్యమైన ఏ ఒక్క ఎన్‌బీఎఫ్‌సీ కూలిపోకుండా, సకాలంలో స్పందించి చర్యలు తీసుకుంటామని వివరించారు. వీటికి సంబంధించిన పుస్తకాలను లోతుగా పరిశీలించి ఒత్తిళ్లను గుర్తించినట్టు చెప్పారు. కంపెనీల యాజమాన్యాలతో ఎప్పటికప్పుడు సమావేశమై, బలోపేతానికి చర్యలు కూడా సూచిస్తున్నట్టు వెల్లడించారు.

### పీ2పీ వ్యాపారానికి బూస్ట్



పీ2పీ ప్లాట్‌ఫామ్‌ల పురోగతి దిశగా ఆర్‌బీఐ ఒక నిర్ణయం తీసుకుంది. పీ2పీ అనేవి.. వ్యక్తుల మధ్య రుణాల మంజూరు, రుణాల స్వీకరణకు వీలు కల్పించే ఆన్‌లైన్ వేదికలు. ప్రస్తుతం ఒక రుణదాత అన్ని పీ2పీ ప్లాట్‌ఫామ్‌ల పరిధిలో గరిష్టంగా రూ.10 లక్షల వరకే రుణాల పంపిణీకి, అదే విధంగా ఒక రుణ గ్రహీత కూడా గరిష్టంగా రూ.10లక్షల వరకే రుణం పొందే అవకాశం ఉండగా.. దీన్ని రూ.50లక్షలకు ఆర్‌బీఐ తాజాగా పెంచింది. అలాగే, ఒక రుణదాత, ఒక వ్యక్తికి గరిష్టంగా రూ.50వేలకే రుణం సమకూర్చే పరిమితి కూడా అమల్లో ఉంది.

### కో-ఆపరేటివ్ బ్యాంకులు సీఆర్‌ఐఎల్‌సీ పరిధిలోకి

సెంట్రల్ రిపాజిటరీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ఆన్ లార్జ్ క్రెడిట్స్ (సీఆర్‌ఐఎల్‌సీ) పరిధిలోకి రూ.500 కోట్లు, అంతకు మించి ఆస్తులు కలిగిన అన్ని అర్బన్ కోపరేటివ్ బ్యాంకులను తీసుకురావాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. పెద్ద రుణాల మంజూరుకు సంబంధించిన సమాచారాన్ని సీఆర్‌ఐఎల్‌సీ పరిధిలోని సంస్థలు ఆర్‌బీఐకి వెల్లడించాల్సి ఉంటుంది. ఇప్పటికే వాణిజ్య బ్యాంకులు, కొన్ని ఎన్‌బీఎఫ్‌సీలు, ఆర్థిక సంస్థలు దీని పరిధిలో ఉన్నాయి. ఇటీవలి పీఎంసీ బ్యాంకు స్కామ్ నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ నిర్ణయానికి వచ్చింది.

## బార్‌ట్రానిక్స్ దివాలాకు ఓకే

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఐటీ సర్వీసులు, బిజినెస్ సొల్యూషన్స్ కంపెనీ బార్‌ట్రానిక్స్ దివాలా పరిష్కార ప్రక్రియకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్ అనుమతి ఇచ్చింది. ఇటీవల బీజేపీలో చేరిన తెలుగుదేశం పార్టీ రాజ్యసభ సభ్యుడు సుజనా చౌదరికి చెందిన కంపెనీగా గతంలో పలుమార్లు ఈ కంపెనీపై ఆరోపణలొచ్చాయి. ఆయన బినామీలే నడిపిస్తున్నారనే వ్యాఖ్యలూ వచ్చాయి. సుజనా చౌదరికి చెందిన కంపెనీలు సుజనా టవర్స్, సుజనా యూనివర్సల్, సుజనా స్టీల్స్ ఇప్పటికే వేల కోట్ల రూపాయలు బకాయిల్ని బ్యాంకులకు తిరిగి చెల్లించటంలో డిఫాల్ట్ అయ్యాయి. బార్‌ట్రానిక్స్ సైతం తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో ఇండియన్ బ్యాంకు ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది. బ్యాంకుకు బార్‌ట్రానిక్స్ అసలు, వడ్డీతో కలిపి రూ.39.96 కోట్లు బాకీ పడింది. మధ్యంతర పరిష్కార నిపుణుడిగా చిన్నం పూర్ణచంద్ర రావును ఎన్‌సీఎల్‌టీ నియమించింది.

# కొత్త మైనింగ్ కంపెనీలకు వర్తించదు

- 15 శాతం కార్పొరేట్ పన్నుపై ఆర్థికమంత్రి సీతారామన్ స్పష్టీకరణ
- సాఫ్ట్‌వేర్ డెవలపర్స్, బుక్ ప్రింటర్స్‌కూ నిరాశే...
- ఇవి ‘తయారీ’ కేటగిరీలోకి రావు
- ‘కార్పొరేట్ పన్ను ఊరట’ బిల్లుకు పార్లమెంటు ఆమోదముద్ర



**న్యూఢిల్లీ:** కార్పొరేట్ పన్నుల భారం తగ్గిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయానికి గురువారం పార్లమెంటు ఆమోదముద్ర పడింది. ఇందుకు సంబంధించి జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో తీసుకువచ్చిన ట్యాక్సేషన్ లాస్ (అమెండ్‌మెంట్) బిల్లు, 2019కు పార్లమెంటు ఓకే చెప్పింది. ఈ సందర్భంగా రాజ్యసభలో జరిగిన చర్చలో ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ మాట్లాడుతూ, కొత్తగా ఏర్పాటు చేసే తయారీ రంగ కంపెనీలకు 15 శాతం కార్పొరేట్ ట్యాక్స్ విధించే అంశంపై స్పష్టతనిచ్చారు. మైనింగ్ కంపెనీలు, సాఫ్ట్‌వేర్‌డెవలపర్లు, బుక్ ప్రింటర్లకు కొత్త తయారీ కంపెనీలకు వర్తించే ‘కనిష్ట 15 శాతం పన్ను రేటు’ వర్తించబోదని ఉద్ఘాటించారు.

**నెగిటివ్ జాబితా రూపకల్పన...**

కార్పొరేట్ ట్యాక్స్ రేటును కంపెనీలకు 30 శాతం నుంచి 22 శాతానికి, కొన్ని కొత్త తయారీ సంస్థలకు 25 శాతం నుంచి 15 శాతానికి కేంద్రం సెప్టెంబర్‌లో తగ్గించిన సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 20న ఈ మేరకు ఆర్థికమంత్రి ఒక ప్రకటన చేశారు. దీని ప్రకారం ఈ ఏడాది అక్టోబర్ తరువాత ప్రారంభించి 2023 నాటికి కార్యకలాపాలు ప్రారంభించే కొత్త తయారీ రంగ కంపెనీలకు కనిష్టంగా 15 శాతం రేటును వర్తిస్తుంది. ఇందుకు సంబంధించి వెంటనే ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చింది. ఆర్డినెన్స్ స్థానంలో తీసుకువచ్చిన బిల్లుకు ఈ వారం మొదట్లోనే లోక్‌సభ ఈ బిల్లుకు ఆమోదముద్ర వేసింది. పెద్దల సభ కూడా బిల్లులో ఎటువంటి మార్పూ చేయకుండా వెనక్కు పంపడంతో బిల్లుకు పార్లమెంటు ఆమోదముద్ర పడినట్లయ్యింది. రాజ్యసభలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటన ప్రకారం– ట్యాక్సేషన్ చట్ట సవరణ బిల్లు 2019 ప్రకారం కొన్ని సంస్థలను నెగిటివ్ జాబితా ఉంచారు. ఈ జాబితాలో ఉంచిన సంస్థలు తయారీ రంగం పరిధిలోనికి రావని, వీటికి కనిష్ట 15 శాతం బేస్ రేటు వర్తించదని ఆర్థికమంత్రి స్పష్టం చేశారు. ఇందులో మైనింగ్ కంపెనీలు, సాఫ్ట్‌వేర్‌డెవలపర్లు, బుక్ ప్రింటర్లు ఉన్నట్లు వివరణ ఇచ్చారు. వీటితోపాటు స్లాబ్స్‌లో వినియోగించే మార్బుల్ బ్లాక్స్, సిలిండర్‌లోకి గ్యాస్ రీఫిల్లింగ్, సినిమాటోగ్రాఫ్ ఫిల్మ్ ఉత్పత్తి కూడా నెగిటివ్ లిస్ట్‌లో ఉన్నాయి.

**ఆర్థిక వృద్ధి లక్ష్యంగా...**

ఆర్థికవృద్ధే లక్ష్యంగా కార్పొరేట్ పన్నులను తగ్గించినట్లు ఆర్థికమంత్రి తెలిపారు. వృద్ధికి ఊతం ఇవ్వడం లక్ష్యంగా కేంద్రం పలు చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ యంత్రాంగంలో అలసత్వ నిరోధం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డీఐ) ప్రోత్సాహం, ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం వంటి పలు చర్యలు ఈ దిశలో ఉన్నాయన్నారు. కార్పొరేట్ పన్ను తగ్గింపువల్ల పెట్టుబడులకు భారత్ ఆకర్షణీయ దేశంగా అవతరిస్తోందని వివరించారు. ఆర్థికరంగం పునరుత్తేజమే ధ్యేయంగా కేంద్రం తన చర్యలను కొనసాగిస్తుందని తెలిపారు.

## పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా నీరవ్ మోదీ

### ప్రకటించిన ముంబై కోర్టు

**ముంబై:** ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)కి దాదాపు 2 బిలియన్ డాలర్ల టోకరా వేసిన కేసులో వజ్రాభరణాల వ్యాపారవేత్త నీరవ్ మోదీని ’పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుడి’గా (ఎఫ్‌ఈవో) ముంబై కోర్టు ప్రకటించింది. ఈ కేసును విచారణ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అభ్యర్థనతో ఈ మేరకు గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి విచారణ జనవరి 10కి వాయిదా వేసింది. దీంతో మోదీ ఆస్తుల జప్తునకు మార్గం సుగమమైంది. 2018లో ఎఫ్‌ఈవో చట్టం వచ్చిన తర్వాత.. వ్యాపారవేత్త విజయ్ మాల్యా తర్వాత పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుడి ముద్ర పడినది నీరవ్ మోదీకే. పీఎన్‌బీ స్కామ్ వెలుగులోకి రావడానికి ముందే 2018 జనవరిలో నీరవ్ మోదీ దేశం విడిచి వెళ్లిపోయారు. 2019 మార్చిలో లండన్‌లో ఆయన అరెస్టయ్యారు. ప్రస్తుతం తనను భారత్‌కు తీసుకొచ్చే ప్రక్రియ జరుగుతోంది.



## ఎంజీ మోటార్స్ ‘జెడ్‌ఎస్’ ఆవిష్కరణ

**జనవరి నుంచి విక్రయాలు**

**న్యూఢిల్లీ:** చైనాకు చెందిన ఎంజీ మోటార్స్.. ‘జెడ్ ఎస్’ పేరిట ఎలక్ట్రిక్ కారును భారత మార్కెట్లో ఆవిష్కరించింది. వచ్చే ఏడాది ప్రారంభం నుంచి దేశంలోని ఐదు ప్రధాన నగరాల్లో ఈ కారు విక్రయాలను మొదలుపెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ మోడల్ 143 పీఎస్ పవర్‌తో అందుబాటులోకి రానుందని, ఒక్కసారి చార్జ్ చేస్తే 300 కిలోమీటర్ల వరకూ ప్రయాణిస్తుందని కంపెనీ వివరించింది. తొలుత ఈ కారు ఢిల్లీ/ఎన్‌సీఆర్, ముంబై, హైదరాబాద్, అహ్మదాబాద్, బెంగళూరు నగరాల్లో అందుబాటులో ఉండనుందని కంపెనీ ఇండియా ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ చాబా అన్నారు. ఇక రూ. 10 లక్షల లోపు ఉండే చిన్నపాటి ఎలక్ట్రిక్ కారును విడుదల చేయాలనే యోచనలో ఉన్నట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.




## రూ. 12 కోట్ల శాంసంగ్ టీవీ!!

**292 అంగుళాల ‘ది వాల్’**

**న్యూఢిల్లీ:** టెక్ దిగ్గజం శాంసంగ్ తాజాగా భారీ స్క్రీన్‌లతో ’ది వాల్’ టీవీల శ్రేణిని ప్రవేశపెట్టింది. ఇవి 146 అంగుళాలు, 219 అంగుళాలు, 292 అంగుళాల స్క్రీన్‌తో లభిస్తాయి. వీటి ధర రూ. 3.5 కోట్ల నుంచి రూ. 12 కోట్ల దాకా ఉంటుంది. విలాసవంతమైన అనుభూతి కోరుకునే వారి కోసం వీటిని రూపొందించినట్లు శాంసంగ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ (కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ ఎంటర్‌ప్రైజ్ బిజినెస్ విభాగం) పునీత్ సేథి తెలిపారు. దేశీయంగా అత్యంత సంపన్న వర్గాలు లక్ష్యంగా ఈ టీవీలు ఆవిష్కరించినట్లు వివరించారు. 2022 నాటికి 200 యూనిట్లు విక్రయించాలని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ది వాల్ శ్రేణి టీవీలు.. తెరను బట్టి మైక్రో ఎల్‌ఈడీ, 6కే డెఫినిషన్, 8 కే డెఫినిషన్‌లలో ఉంటాయి. టీవీ చూడనప్పుడు కట్టేయాల్సిన అవసరం లేకుండా.. పెయింటింగ్‌లు, ఫొటోలు వంటివి డిస్‌ప్లే చేసుకోవచ్చు.



## ఆంధ్రా బ్యాంకుకు రూ.25 లక్షల జరిమానా

ముంబై: ఆంధ్రా బ్యాంకుపై ఆర్‌బీఐ రూ.25 లక్షల జరిమానా విధించింది. కేవైసీ, యాంటీ మనీలాండరింగ్ సంబంధిత నిబంధలను బ్యాంకు పాటించకపోవడంతో ఈ నిర్ణయం వెలువరించింది.

### బులియన్ రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,480 | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 37,600 | 0 |
| వెండి (కిలో) | 47,500 | ▼ 1000 |
| **చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,260 | ▼ 40 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,440 | ▼ 40 |
| వెండి (కిలో) | 47,500 | ▼ 1000 |
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,260 | ▼ 40 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,440 | ▼ 40 |
| వెండి (కిలో) | 47,500 | ▼ 1000 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,000 | ▼ 100 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,150 | ▼ 100 |
| వెండి (కిలో) | 45,500 | ▼ 800 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,220 | ▼ 130 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,480 | ▼ 110 |
| వెండి (కిలో) | 45,500 | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,400 | ▼ 150 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,440 | ▼ 40 |
| వెండి (కిలో) | 47,500 | ▼ 1000 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

### ముడిచమురు... (బ్యారల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 58.40 (రాత్రి 11.30కు) | $ 58.43 (బుధవారం ముగింపు) |
| బ్రెంట్ | 63.23 (రాత్రి 11.30కు) | $ 63.00 (బుధవారం ముగింపు) |

### కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 06-12-2019

| | |
|---|---|
| విశాఖ | 460-00 |
| చిత్తూరు | 471-00 |
| వరంగల్ | 447-00 |
| **05-12-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 444-00 |
| విజయవాడ | 457-00 |
| గోదావరి | 457-00 |

# కోత లేదు... నష్టాలు తప్పలేదు

- ఆర్‌బీఐ పాలసీ... అంచనాలు వమ్ము
- రేట్ల విషయమై యథాతథ స్థితి
- 71 పాయింట్లు పతనమై 40,780కు సెన్సెక్స్
- 25 పాయింట్ల నష్టంతో 12,018కు నిఫ్టీ



కీలక రేట్లను యథాతథంగా కొనసాగించాలన్న ఆర్‌బీఐ నిర్ణయం గురువారం స్టాక్ మార్కెట్‌ను నష్టాల పాలు చేసింది. అంతే కాకుండా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధి అంచనాలను 5 శాతానికి తగ్గించడం కూడా ప్రతికూల ప్రభావం చూపించింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 71 పాయింట్లు పతనమై 40,780 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 25 పాయింట్ల నష్టంతో 12,018 పాయింట్ల వద్ద ముగిశాయి.

**ఫిబ్రవరిలో తగ్గింపు !**

ఆర్‌బీఐ ఎమ్‌పీసీ(మోనేటరీ పాలసీ కమిటీ) రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాలను పెంచింది. వృద్ధి అంచనాలను తగ్గించింది. వీలును బట్టి రేట్ల నిర్ణయాన్ని తీసుకునే విధానాన్ని కొనసాగించాలని నిర్ణయించడం ఒకింత ఊరటనిచ్చింది. దీంతో ఫిబ్రవరి పాలసీలో రేట్లను ఆర్‌బీఐ పావు శాతం మేర తగ్గంచగలదని నిపుణులు భావిస్తున్నారు.

**'వడ్డీ' షేర్లు ఢమాల్....**

బ్యాంక్, వాహన, రియల్టీ షేర్లు నష్టపోయాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఆర్‌బీఎల్ బ్యాంక్, ఎస్‌బీఐ, యెస్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, హెడ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు 0.3 శాతం నుంచి 2.2 శాతం రేంజ్‌లో పడిపోయాయి. ఇక టీవీఎస్ మోటార్స్, మారుతీ సుజుకీ, అశోక్ లేలాండ్, హీరో మోటొకార్ప్, టాటా మోటార్స్ షేర్లు 0.08 శాతం నుంచి 2 శాతం మేర నష్టపోయాయి.

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్‌ఈ | 2,075 |
| ఎన్‌ఎస్‌ఈ | 34,043 |
| ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్) | 30,97,964 |
| ఎఫ్ఐఐ | 653 |
| డీఐఐ | -410 |

**నిఫ్టీ భారత్ బాండ్ ఇండెక్స్ ఆరంభం:** నిఫ్టీ భారత్ బాండ్ ఇండెక్స్ సిరీస్‌ను ఎన్‌ఎస్‌ఈ గురువారం ప్రారంభించింది. ఏప్రిల్ 2023, ఏప్రిల్ 2030 బాండ్ల సూచీలను ఎన్‌ఎస్‌ఈ అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ సంస్థలు జారీ చేసిన ట్రిపుల్ ఏ రేటింగ్ ఉన్న బాండ్ల పోర్ట్‌ఫోలియోను ఈ బాండ్ సూచీలు ట్రాక్ చేస్తాయి. ఈ సూచీలకు ఆధార తేదీ 2019, నవంబర్ 29 అని, ఆధార విలువ 1,000 పాయింట్లని ఎన్‌ఎస్‌ఈ పేర్కొంది.

## ఆర్‌బీఐకి సీఐసీ షోకాజ్ నోటీసు

**హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కేసులో విచారణకు హాజరు కాని ఫలితం**



**న్యూఢిల్లీ:** ప్రైవేట్ రంగ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు తనిఖీ నివేదికల వెల్లడి వివాదానికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)కి కేంద్రీయ సమాచార కమిషన్ (సీఐసీ) షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈ అంశంపై విచారణకు హాజరు కావాలన్న తమ ఆదేశాలను ఆర్‌బీఐ సెంట్రల్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (సీపీఐవో) తేలిగ్గా తీసుకుంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. వివరాల్లోకి వెడితే.. 2011 నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో జరిపిన తనిఖీల వివరాలు వెల్లడించాలంటూ గిరీష్ మిత్తల్ అనే వ్యక్తి ఆర్‌టీఐ కింద ఆర్‌బీఐకి దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు అనుకూలంగా ఆర్‌బీఐ సీపీఐవో సూచనలు జారీ చేశారు. అయితే, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసింది. కీలకమైన వ్యాపార వివరాలు వెల్లడి కావడం వల్ల సంస్థ ప్రయోజనాలు దెబ్బతింటాయని సీపీఐవోకి తెలిపింది. కానీ సీపీఐవో దాన్ని తోసిపుచ్చడంతో సీఐసీని ఆశ్రయించింది. ఇందుకు సంబంధించిన విచారణకు హాజరు కావాలంటూ సీఐసీ ఆదేశించినప్పటికీ.. ఆర్‌బీఐ సీపీఐవో గైర్హాజరయ్యారు.

## సంగారెడ్డిలో అపర్ణా కొత్త ప్లాంట్

**20 కోట్ల పెట్టుబడి ● ఏప్రిల్ నాటికి అందుబాటులోకి...**

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ ఉత్పత్తుల తయారీ కంపెనీ అపర్ణా ఎంటర్‌ప్రైజెస్ (ఏఈఎల్) సంగారెడ్డిలో నూతన ప్లాంట్‌ను నెలకొల్పనుంది. ఇప్పటికే 10 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేశామని.. ఇందులో రూ.20 కోట్ల పెట్టుబడులతో 5 లక్షల చ.అ. విస్తీర్ణంలో ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నామని ఏఈఎల్ ఎండీ అశ్విన్ రెడ్డి తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్–మే నాటికి ప్లాంట్ అందుబాటులోకి వస్తుందని తెలియజేశారు. గురువారం హాంకాంగ్‌కు చెందిన నిర్మాణ సేవల సంస్థ క్రాఫ్ట్ హోల్డింగ్స్‌తో కలిసి 'అల్టెజా' బ్రాండ్‌తో ప్రీమియం అల్యూమినియం తలుపులు, కిటికీలను మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా విలేకరులతో అశ్విన్ రెడ్డి మాట్లాడుతూ.. అల్టెజా ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ కోసం ప్రత్యేకంగా అపర్ణా క్రాఫ్ట్ ఎక్స్‌టీరియర్స్ సంస్థను ఏర్పాటు చేశామని, దీన్లో అపర్ణాకు 74 శాతం, క్రాఫ్ట్ హోల్డింగ్స్‌కు 24 శాతం వాటాలున్నాయని చెప్పారు.

### కార్పొరేట్ బ్రీఫ్స్...

**సైయంట్:** ఆర్మ్ ధ్రువీకరించిన భాగస్వామ్య కార్యక్రమంలో సంస్థ అనుబంధ కంపెనీ అయిన ఏన్‌సెమ్ పాలుపంచుకోనుంది. చిప్స్ అభివృద్ధి, తయారీలో భాగస్వామ్య కంపెనీలు ఆర్మ్‌కు తోడ్పాటు అందిస్తాయి.

**పెన్నార్:** నవంబరులో కంపెనీకి చెందిన పలు విభాగాలు రూ.302 కోట్ల విలువైన ఆర్డర్లను చేజిక్కించుకున్నాయి.

**యస్ బ్యాంక్:** ఈ ప్రైవేట్ రంగ బ్యాంక్ రేటింగ్‌ను అంతర్జాతీయ రేటింగ్స్ సంస్థ మూడీస్ తగ్గించింది. నెగిటివ్ అవుట్‌లుక్‌కు మూడీస్ డౌన్‌గ్రేడ్ చేసింది. రుణ నాణ్యతపై ఆందోళనలు, మూలధన నిధులు తరిగిపోవడం దీనికి కారణాలని పేర్కొంది.

## జీఎస్‌టీ పరిధిలోకి ఏటీఎఫ్, గ్యాస్!

**2020-21 బడ్జెట్లో ప్రతిపాదన**

**న్యూఢిల్లీ:** విమాన ఇంధనం (ఏటీఎఫ్), సహజ వాయువులను వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) పరిధిలోకి తీసుకుని వచ్చే అవకాశం ఉందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఈ రెండు కమోడిటీలపై ప్రస్తుతం అమల్లో ఉన్న బహుళ పన్నుల భారాన్ని తగ్గించి, వ్యాపార వాతావరణాన్ని మెరుగుపరచడం కోసం ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రానున్న 2020–21 బడ్జెట్లో వీటిని జీఎస్‌టీలో భాగం చేసే దిశగా కసరత్తు చేయనున్నారని అంచనావేశారు. ప్రస్తుతం వీటిపై కేంద్ర ప్రభుత్వం విధించే సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ, రాష్ట్ర ప్రభుత్వాల వ్యాట్ వడ్డన కొనసాగుతుంది.

## బ్యాంకింగ్‌లో మరిన్ని రుణాల రైటాఫ్!

**ఫిచ్ రేటింగ్స్ అంచనా**



**న్యూఢిల్లీ:** దేశీ బ్యాంకులు మరిన్ని రుణాలను రైటాఫ్ (ఖాతాల నుంచి తొలగింపు) చేయాల్సి రావొచ్చని ఫిచ్ రేటింగ్స్ గురువారం పేర్కొంది. మొండిబాకీలకు జరపాల్సిన కేటాయింపుల పరిమాణం పెరుగుతుండటం, బాకీల రికవరీ అవకాశాలు బలహీనంగా ఉండటం వంటి అంశాలే ఇందుకు కారణమని వివరించింది. మొండిబాకీల్లో సుమారు 90 శాతం భాగం ప్రభుత్వ రంగ బ్యాంకులదే (పీఎస్‌బీ) ఉంటోంది. గడిచిన మూడేళ్లలో మొత్తం 30 బిలియన్ డాలర్ల రుణాలను పీఎస్‌బీలు రైటాఫ్ చేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో దేశీ బ్యాంకుల రుణ వృద్ధి బలహీనంగా ఉండటంతో పాటు గత మొండిబాకీల పరిష్కార ప్రక్రియ మందకొడిగా సాగుతోందని ఫిచ్ తెలిపింది. అయితే, రుణ సంబంధ వ్యయాలు తగ్గడంతో 2017–18 తర్వాత తొలిసారిగా బ్యాంకింగ్ రంగం లాభదాయకత మళ్లీ సానుకూలంగా కనిపిస్తోందని, పీఎస్‌బీలు నష్టాలు ప్రకటించినా.. గతంతో పోలిస్తే స్వల్పస్థాయిలోనే ఉన్నాయని పేర్కొంది.

### గతిలో ఆల్‌కార్గోకి వాటా

రవాణా సేవల్లో ఉన్న గతి లిమిటెడ్‌లో ఇదే రంగంలో ఉన్న ముంబై కంపెనీ ఆల్‌కార్గో లాజిస్టిక్స్ వాటాను చేజిక్కించుకోనుంది. ఈ మేరకు షేర్ పర్చేజ్ అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా గతి ప్రమోటర్, ప్రమోటర్ గ్రూప్ అయిన మహేంద్ర కుమార్ అగర్వాల్, మహేంద్ర ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్, టీసీఐ ఫైనాన్స్, గతి నుంచి 1,03,85,332 ఈక్విటీ షేర్లను ఒక్కొక్కటి రూ.75 చొప్పున కొనుగోలు చేయనున్నారు. అలాగే ఒక్కొక్కటి రూ.75 చొప్పున గతికి చెందిన 1,33,33,340 షేర్లను ఆల్‌కార్గో లాజిస్టిక్స్‌కు ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా కేటాయిస్తారు. ఈ రెండు ఒప్పందాలతో గతిలో ఆల్‌కార్గో వాటా 19.43 శాతంగా ఉంటుంది. ఇందుకోసం ఆల్‌కార్గో రూ.178 కోట్లు వెచ్చించనుంది. గతి పబ్లిక్ షేర్‌హోల్డర్ల నుంచి 26 శాతం వాటాకు సమానమైన 3,17,42,615 షేర్లను ఒక్కొక్కటి రూ.75 వెచ్చించి కొనుగోలు చేసేందుకు ఓపెన్ ఆఫర్ ఇవ్వనుంది. దీని కోసం అదనంగా రూ.238 కోట్లు ఖర్చు చేయనుంది. డీల్ 2020 మార్చి 30 నాటికి పూర్తి కానుంది.

### హైదరాబాద్‌లో షూర్ డెవలప్‌మెంట్ సెంటర్

మైక్రోఫోన్స్, ఆడియో ఉపకరణాల తయారీలో ఉన్న యూఎస్ కంపెనీ షూర్.. భారత్‌లో తొలి సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను హైదరాబాద్‌లో 40,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసింది. తెలంగాణ ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ ఈ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు.

### 5జీ సేవల అభివృద్ధిపై క్వాల్‌కామ్ కసరత్తు

అమెరికన్ చిప్‌మేకర్ క్వాల్‌కామ్.. భారత 5జీ సేవల అభివృద్ధిపై కసరత్తు ముమ్మరం చేసింది. సమర్థవంతమైన సేవలను అందించడం కోసం రిలయన్స్ జియో, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లతో కలిసి పనిచేస్తోంది.

### మహీంద్రా అనుబంధ కంపెనీగా మేరు

యుటిలిటి వాహన దేశీయ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా, మేరు ట్రావెల్ సొల్యూషన్స్‌లో 36.63 శాతం వాటాను కొనుగోలు చేసింది. మేరు సంస్థలో 55 శాతం వాటాను రూ. 201.5 కోట్లకు కొనుగోలు చేసే డీల్‌లో భాగంగా 36.63 శాతం వాటా కొనుగోలు లావాదేవీని గురువారం నాడు పూర్తి చేశామని మహీంద్రా తెలిపింది. దీంతో మేరు కంపెనీ తమ అనుబంధ సంస్థగా మారిందని పేర్కొంది.

**రాష్ట్రీయం**



గురువారం వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమావేశంలో గవర్నర్ తమిళి సై

# ఆరోగ్యశ్రీ+ఆయుష్మాన్

- వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు గవర్నర్ సూచన
- అనేక ప్రయోజనాలున్నాయన్న తమిళి సై.. సమావేశానికి హాజరైన కేంద్ర అధికారులు
- సీఎం విజ్ఞప్తి మేరకే రాష్ట్ర వైద్య ఉన్నతాధికారులతో భేటీ

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ రెండు పథకాలను కలిపి అమలు చేసే అంశాన్ని పరిశీలించాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తెలంగాణ ప్రభుత్వానికి సూచించారు. ఆరోగ్యశ్రీలోని సానుకూల అంశాలు, ఆయుష్మాన్ భారత్‌లోని ప్రయోజనాలు రెండింటినీ కలిపి పేదలందరికీ ఉచిత వైద్య సేవలు అందించాలని ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో గవర్నర్ గురువారం నిర్వహించిన సమావేశానికి ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ డాక్టర్ యోగితారాణా, ఆరోగ్యశ్రీ సీఈవో మాణిక్‌రాజ్, ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. తాను ఇటీవల సీఎం కేసీఆర్‌తో సమావేశమైనప్పుడు ఆయుష్మాన్ భారత్ అమలు అంశం చర్చకు వచ్చిందని తెలిపారు. ఈ అంశంపై చర్చించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను పంపిస్తానని, వారితో చర్చించాలని తనకు సీఎం చెప్పారన్నారు. ఆయుష్మాన్ భారత్‌ను వివిధ రాష్ట్రాలు అమలు చేస్తున్నాయన్నారు. అయితే ఆయా రాష్ట్రాల్లో ఉన్న ఆరోగ్య పథకాలతో కలిపి కొన్ని మార్పులతో అమలు చేస్తున్నాయని గవర్నర్ తెలిపారు. పైగా ప్యాకేజీలలోనూ ఆయా రాష్ట్రాలకు అనుకూలంగా తీర్చిదిద్దారన్నారు. రాష్ట్రంలో అందరికీ ఆరోగ్యం అందించడమే లక్ష్యమని గవర్నర్ అన్నారు. ఇక్కడ పట్టింపులకు పోకుండా ప్రజలందరికీ ఆరోగ్య సేవలు ఎలా అందించాలో ఆలోచించాలని గవర్నర్ అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రజలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆరోగ్య పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాలన్నారు. డెంగీ నేపథ్యంలో రక్తం లభ్యత, డిమాండ్ మధ్య అంతరాన్ని తగ్గించాలన్నారు. కేసీఆర్ కిట్, కంటివెలుగు తదితర పథకాల అమలు తీరును గవర్నర్ ప్రశంసించారు.

**హెల్త్ హబ్‌గా హైదరాబాద్**

ఈ సమావేశానికి హాజరైన నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్‌హెచ్‌ఏ) డిప్యూటీ సీఈవో డాక్టర్ ప్రవీణ్ గోయి ఆయుష్మాన్ భారత్‌పై మాట్లాడారు. హైదరాబాద్ హెల్త్ హబ్‌గా రూపుదిద్దుకున్నందున మహారాష్ట్ర, కర్ణాటక సహా దేశంలోని పలు రాష్ట్రాల నుంచి ఆయుష్మాన్ భారత్ లబ్ధిదారులు చికిత్స కోసం వస్తుంటారని ఆయన పేర్కొన్నారు. అయితే తెలంగాణలో ఆయుష్మాన్ భారత్ అమలులో లేకపోవడం వల్ల వీరంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేగాక ఆరోగ్యశ్రీ కింద కవరేజీ రూ. 2 లక్షల వరకు మాత్రమేనని, ఆయుష్మాన్ భారత్‌లో కవరేజీ రూ. 5 లక్షలని పేర్కొన్నారు. అంతేగాక ఆరోగ్యశ్రీ కింద 972 వ్యాధులుండగా, ఆయుష్మాన్ భారత్‌లో 1,350 వ్యాధులున్నాయని ప్రస్తావించారు. ఆరోగ్యశ్రీలో ఏడాదికి ఒకసారి మాత్రమే చికిత్సకు అవకాశం ఉంటే, ఆయుష్మాన్ భారత్‌లో అటువంటి పరిమితి ఏమీ లేదని, పైగా డెంగీ, స్వైన్‌ఫ్లూ వంటి వాటికి కూడా వర్తిస్తుందన్నారు. పైగా ఏడాదికి రూ. 200 కోట్ల మేరకు కేంద్రం నుంచి నిధులు వస్తాయని తెలిపారు.

**అవయవమార్పిడి 'ఆయుష్మాన్'లో లేదు**

ఆయుష్మాన్ భారత్‌కు, ఆరోగ్యశ్రీకి మధ్య తేడాలపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కూడా తమ అభిప్రాయాలను గవర్నర్ ముందుంచారు. ఆరోగ్యశ్రీలో 77.19 లక్షల కుటుంబాలున్నాయన్నారు. అదే ఆయుష్మాన్ భారత్‌కు ఆ సంఖ్య 26.11 లక్షలకు తగ్గుతుందన్నారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ కింద 92.97%మందికి కవరేజీ అందుతుండగా, ఆయుష్మాన్ భారత్ 31.67 శాతానికే పరిమితమవుతుందని తెలిపారు. ఆరోగ్యశ్రీలో అవయవ మార్పిడి కోసం రూ. 23 లక్షల వరకు కూడా కవరేజీ కల్పించామని, కానీ ఆయుష్మాన్ భారత్‌లో ఆ పరిస్థితి లేదన్నారు. అవయవమార్పిడికి ఆరోగ్యశ్రీని కొనసాగిస్తూనే, ఆయుష్మాన్ భారత్‌లో అవసరమైన మార్పులు చేర్పులు చేసే అంశాన్ని కూడా పరిశీలించాలన్న చర్చ సమావేశంలో వ్యక్తమైంది. దీనిపై సీఎం కేసీఆర్‌తో చర్చించాక త్వరలో నివేదిక అందజేస్తామని శాంతికుమారి గవర్నర్‌కు తెలిపారు.

## ఈ చట్టాలు మార్చాలి

- 'దిశ' ఘటనలో నాకూ భావోద్వేగాలున్నాయి..
- నిందితులపై వెంటనే చర్యలకు తగినట్లుగా చట్టాలు లేవు
- సివిల్ సర్వీసెస్ అధికారుల వీడ్కోలు సమావేశంలో కేటీఆర్

**సాక్షి, హైదరాబాద్:** అందరిలాగే 'దిశ' ఘటనలో తనకు భావోద్వేగాలున్నాయని.. అయితే చట్టపరంగానే దోషులకు శిక్ష పడుతుందని మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రజలు సంయమనంతో వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని కోరారు. గురువారం ఎంసీహెచ్‌ఆర్డీలో సివిల్ సర్వీసెస్ 94 ఫౌండేషన్ అధికారుల వీడ్కోలు సమావేశంలో ముఖ్య అతిథిగా కేటీఆర్ పాల్గొన్నారు. కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్న అధికారులకు ఆయన ధ్రువపత్రాలు అందజేశారు. దిశ కేసులో దోషులకు త్వరగా శిక్ష పడేలా చూస్తామని స్పష్టంచేశారు.



'హైదరాబాద్‌లో వెటర్నరీ డాక్టర్‌పై సామూహిక అత్యాచారం, హత్య ఘటన చాలా దారుణం. దీనిపై తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. ఇటు నిందితులను ఉరితీయాలని ఎంపీలు పార్లమెంటు వేదికగా నినదించారు. అందరి కోపం, ఉద్వేగమంతా న్యాయబద్ధమైనవే. నిర్భయ కేసులో 7 ఏళ్లుగా విచారణ సాగినా.. ఇప్పటివరకు నిందితులను ఉరితీయలేదు. ఉగ్రవాది అజ్మల్ కసబ్‌ను ఉరితీయడానికి ఎంత సమయం పట్టిందో అందరికీ తెలుసు. దోషులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఉన్నా, ప్రస్తుత చట్టాలు అందుకు తగినట్లు లేవు. చట్టాలను మార్చాల్సిన అవసరముంది. నాకూ నలుగురు నిందితులను తుదముట్టించాలని ఉన్నా, ప్రభుత్వంలో ఉన్నాం కాబట్టి ప్రజలు కోరినట్లు వారిని ఉరితీయలేం. వాస్తవాలను గ్రహించి, రాజ్యాంగబద్ధంగా నియమ నిబంధనలను అనుసరించాల్సి ఉంటుంది'అని చెప్పారు.

**చిత్తశుద్ధితో పనిచేయాలి..**

సివిల్ సర్వీసెస్ అధికారులు ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలని కేటీఆర్ సూచించారు. సమస్యల పట్ల వేగంగా స్పందించే గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజలతో మమేకం కావాలని సూచించారు.

## ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు?

- ఆవేదన వ్యక్తం చేసిన టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గం
- సమస్యల పరిష్కారానికి వచ్చే నెలలో జిల్లాల వారీగా సమావేశాలు

**సాక్షి, హైదరాబాద్:** 'ప్రభుత్వానికి ఇంత లాయల్‌గా ఉన్నాం.. ప్రభుత్వ కార్యక్రమాల కోసం ఉద్యోగులుగా అంకిత భావంతో పని చేస్తున్నాం.. అయినా మమ్మల్ని ఎందుకు పట్టించుకోవడం లేదు.. సమ్మె చేసిన ఆర్టీసీ కార్మికుల సమస్యలను సీఎం కేసీఆర్ పరిష్కరించారు.. మన సమస్యలపై ఎందుకు దాటవేత వైఖరిని అవలంభిస్తున్నారు. మనం ఎదుర్కొంటున్న సమస్యలన్నీ అలాగే ఉన్నాయి. ఒక్కటీ పరిష్కారం కాలేదు.. పీఆర్సీ అమలులో ప్రభుత్వం జాప్యం చేస్తోంది. ఐఆర్ ఇవ్వడం లేదు. ఇతర సమస్యలను పరిష్కరించడం లేదు. మనల్ని ఎందుకు పట్టించుకోవడం లేదు'అని టీఎన్జీవో జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటం చేస్తేనే ప్రభుత్వం స్పందిస్తుందా? అంటూ ఆందోళనను వెలిబుచ్చారు. స్నేహపూర్వక వాతావరణంలో సమస్యల పరిష్కారం జరగాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం నాంపల్లి టీఎన్జీవో కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీఎన్జీవో కింది స్థాయి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఉద్యోగ వ్యవస్థ, పాలనా వ్యవస్థ బలోపేతానికి, సమస్యల పరిష్కారానికి 2020 జనవరిలో జిల్లాలవారీగా సమావేశాలు నిర్వహించాలని తీర్మానించారు. ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులందరిని సొంత రాష్ట్రానికి తీసుకురావాలని కోరారు. పదవీ విరమణ వయసును 58 సంవత్సరాల నుంచి 61 సంవత్సరాలకు పెంచాలన్నారు. పదోన్నతులు కల్పించడానికి మూడు సంవత్సరాల కనీస సర్వీస్ నిబంధనను తొలగించాలని, అన్ని జిల్లా కేంద్రాలలో 20 శాతం ఇంటి అద్దెను మంజూరు చేయాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లా కార్యాలయాలకు పూర్వపు జిల్లా కార్యాలయాలతో సమానంగా అదనపు కేడర్‌ను మంజూరు చేయాలన్నారు. పీఆర్‌సీ/ఐఆర్, కరువు భత్యం(డీఏ) మంజూరు చేయాలన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సాధారణ ఉద్యోగులతో సమానంగా సెలవులు మంజూరు చేయాలని, అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం నేరుగా జీతాలు చెల్లించాలని కోరారు. ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ సమావేశాల్లో తెలంగాణ ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించాలన్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ హత్యను ఖండిస్తూ ఆమె కుటుంబానికి సంతాపాన్ని తెలియజేశారు. టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కేంద్ర సంఘం అధ్యక్షుడు కారెం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, అసోసియేట్ ప్రెసిడెంట్ బండారి రేచల్, కోశాధికారి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్లలో ప్రజాప్రతినిధులు

- లాభదాయక పదవుల జాబితా నుంచి 29 సంస్థలకు మినహాయింపు
- ఆర్డినెన్స్ జారీ..

**సాక్షి, హైదరాబాద్:** లాభదాయక పదవుల జాబితా నుంచి 29 రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్ చైర్మన్ పదవులను తొలగిస్తూ తెలంగాణ జీతాలు, పింఛన్ చెల్లింపు, నిరర్హతల తొలగింపు చట్టం–1953 నిబంధనలను సవరిస్తూ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ బుధవారం గెజిట్ విడుదల చేశారు. రాష్ట్రంలో సుమారు 90 వరకు వివిధ కార్పొరేషన్లు ఉండగా.. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ నిబంధన మేరకు ఆయా సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను నియమించేందుకు నిబంధనలు అడ్డంకిగా మారాయి. ఈ నేపథ్యంలో కొన్ని ముఖ్యమైన కార్పొరేషన్ల చైర్మన్లుగా ప్రజాప్రతినిధులను నియమించేందుకు ఆర్డినెన్స్ జారీ చేస్తామని సీఎం కేసీఆర్ గత నెల 28న కేబినెట్ భేటీ అనంతరం ప్రకటించిన సంగతి తెలిసిందే.

### ఆర్డినెన్స్‌లో పేర్కొన్న కార్పొరేషన్లు..

అత్యంత వెనకబడిన తరగతుల అభివృద్ధి కార్పొరేషన్, తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి, మూసీనది పరివాహక (రివర్‌ఫ్రంట్) అభివృద్ధి కార్పొరేషన్ (ఎంఆర్డీసీ), కార్మిక సంక్షేమ బోర్డు, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ, కాళేశ్వరం నీటి పారుదల ప్రాజెక్టు సంస్థ, యాదగిరిగుట్ట దేవాలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ (వైటీడీఏ), వేములవాడ దేవాలయ ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ, హైదరాబాద్ మహానగరాభివృద్ధి ప్రాధికార సంస్థ చైర్మన్/వైస్‌చైర్మన్/సభ్యులు/డైరెక్టర్లు, కులీకుతుబ్‌షా పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ, రాష్ట్రంలోని పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థలు, తెలంగాణ రాష్ట్ర క్రీడల ప్రాధికార సంస్థ, రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్, హైదరాబాద్ పట్టణ గ్రంథాలయ సంస్థ, తెలుగు అకాడమీ, హాకా, అధికార భాషా కమిషన్, తెలంగాణ గురుకుల విద్యా సంస్థల సంఘం, హజ్ కమిషన్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు, రాష్ట్ర ఆహార కమిషన్, సెట్విన్, సాహిత్య అకాడమీ, టీఎస్‌ఆర్టీసీ ప్రాంతీయ బోర్డులు/డైరెక్టర్లు, టీఎస్‌జెన్‌కో, టీఎస్‌ట్రాన్స్‌కో, టీఎస్‌డిస్కమ్, యోగాధ్యయన పరిషత్.

## చనిపోయిన వారికీ పెన్షన్లు

- డేటా అందుబాటులో లేక ఆసరా నిధుల దుర్వినియోగం
- మంత్రి కేటీఆర్‌ను ఎప్పుడు కలసినా గొడవే..!
- సీఎఫ్‌వోల సదస్సులో మంత్రి హరీశ్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** రాష్ట్రంలో ఆసరా పెన్షన్ల నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆర్థికమంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో సరైన సాంకేతిక వ్యవస్థ, డేటా అందుబాటులో లేకపోవటమే దీనికి కారణమని చెప్పారు. గురువారమిక్కడ సీఐఐ తెలంగాణ ఆధ్వర్యంలో 2వ ఎడిషన్ 'సీఎఫ్ఓ కాన్‌క్లేవ్' జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్ మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో ఆసరా పెన్షన్లను పోస్టల్, బ్యాంక్ అకౌంట్ ద్వారా రెండు విధాలుగా అందిస్తున్నాం. పోస్టల్‌లో లబ్ధిదారులు వేలిముద్ర వేస్తారు కనుక ఒకవేళ లబ్ధిదారులు మరణిస్తే వాళ్ల పెన్షన్‌ను డేటా నుంచి తొలగిస్తున్నారు.



అదే బ్యాంకింగ్ విధానంలో ఇది జరగటం లేదు. లబ్ధిదారుడు మరణించినా బ్యాంక్ ఖాతాలో పెన్షన్ సొమ్ము జమవుతూనే ఉంటోంది. దీన్ని తన కుటుంబీకులో, ఇతరులో తీసుకుంటున్నారు. కొన్ని అలాగే ఖాతాలో ఉండిపోతున్నాయి.'అని వివరించారు. పెన్షన్ లబ్ధిదారులు మరణించిన వివరాలు ప్రభుత్వ డేటాకు చేరడం లేదని, అందుకే పెన్షన్‌లో డ్రాపవుట్స్ 1.5 శాతమే ఉంటున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం పింఛను లబ్ధిదారుల వివరాలను, కొత్త దరఖాస్తులను అన్నింటినీ బ్యాంకర్లు, తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం (టీఎస్ ఐటీఈఎస్) తో క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిస్తున్నట్లు హరీశ్ తెలిపారు.

**గుండె ఆగినంత పనైంది..**

ఇటీవల టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులతో ముఖ్యమంత్రి కేసీఆర్ సమావేశం జరిగింది. ఏటా బడ్జెట్‌లో ఆర్టీసీకి రూ.1,000 కోట్లు కేటాయిస్తామని కేసీఆర్ ప్రకటించడంతో గుండె ఆగినంత పనైందని హరీశ్ వ్యాఖ్యానించారు. 'గత 3, 4 త్రైమాసికాలుగా ఆర్థిక పరిస్థితి బాగాలేదు. మరో రెండు త్రైమాసికాలు ఈ పరిస్థితి తప్పదు. ఇలాంటపుడు భారీ బడ్జెట్ కేటాయింపులు గుర్తు చేసుకుంటే ఒక్క క్షణం గుండె ఆగినంత పనవుతోంది.'అని అన్నారు. కంపెనీలకు అందాల్సిన రాయితీలపై ఆ శాఖ మంత్రి కేటీఆర్‌తో ఎప్పుడు కలిసినా గొడవ జరుగుతోందని నవ్వుతూ వ్యాఖ్యానించారు.

## ఇంటర్ బోర్డు దిద్దుబాటు!

- విద్యార్థుల వివరాల్లో తప్పులు దొర్లకుండా పక్కా ఏర్పాట్లు
- గతంలో చోటుచేసుకున్న పరిణామాల నుంచి గుణపాఠం
- వెబ్‌సైట్‌లో ఫీజు చెల్లించిన విద్యార్థులు
- పొరపాట్ల సవరణకు ఈ నెల 15 వరకు అవకాశం

**సాక్షి, హైదరాబాద్:** ఇంటర్మీడియట్ బోర్డు పలు దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా వచ్చే మార్చిలో జరిగే పరీక్షలకు హాజరయ్యేందుకు పరీక్ష ఫీజు చెల్లించిన విద్యార్థులకు సంబంధించిన వివరాల్లో తప్పులు దొర్లకుండా పక్కా ఏర్పాట్లు చేసింది. ఫీజు చెల్లించిన విద్యార్థుల వివరాలను బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచి వాటిల్లో పొరపాట్లు ఉంటే సవరించుకునేలా అవకాశం కల్పించింది. ఇంటర్మీడియట్ చదివే విద్యార్థుల వివరాల్లో గతంలో పలు పొరపాట్లు దొర్లాయి. విద్యార్థులు ఫీజులు చెల్లించినా యాజమాన్యాలు ఫీజులను బోర్డుకు పంపించకుండా వారిని ఇబ్బందులపాలు చేసిన ఘటనలు ఉన్నాయి. కంప్యూటర్ ఏజెన్సీల తప్పిదాలతో ఒక సబ్జెక్టుకు బదులు మరో సబ్జెక్టు రావడం, ఫీజు చెల్లించిన విద్యార్థుల వివరాలు గల్లంతు కావడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఈసారి అలాంటి తప్పులు జరగకుండా ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ పక్కా చర్యలకు శ్రీకారం చుట్టారు. పరీక్ష ఫీజు చెల్లించిన ప్రతీ విద్యార్థి వివరాలను వెబ్‌సైట్‌లో(tsbie.cgg.gov.in) అందుబాటులో ఉంచారు.

**సవరణలు ఇలా..**

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థులైతే తమ పదో తరగతి హాల్‌టికెట్ నంబరుతో వెబ్‌సైట్‌లో తమ వివరాలను చూసుకోవాలని ఉమర్ జలీల్ స్పష్టం చేశారు. ద్వితీయ సంవత్సర రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులైతే తమ వద్ద ఇంతకు ముందు ఉన్న ఇంటర్మీడియట్ హాల్‌టికెట్ నంబరు ఎంటర్ చేసి వివరాలను పొందవచ్చు. అందులో తమ పేరు, తల్లి పేరు, తండ్రి పేరు, గ్రూపు, మీడియం, సెకండ్ లాంగ్వేజ్, పీహెచ్ కేటగిరీ, పరీక్షలకు హాజరయ్యే సబ్జెక్టుల వివరాలు, పరీక్ష ఫీజు వివరాలను చెక్ చేసుకోవాలి. వాటిల్లో ఏమైనా పొరపాట్లు ఉంటే విద్యార్థుల ఈ నెల 15లోగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఇతర వివరాలతో సంబంధిత కాలేజీల ప్రిన్సిపాళ్లు లేదా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి లేదా నోడల్ ఆఫీసర్‌ను కలిసి తమ వివరాల్లో ఉన్న తప్పులను సరిచేయించుకోవాలని ఉమర్ జలీల్ వివరించారు.



సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలో నిర్మించిన రంగనాయకసాగర్ ప్రాజెక్ట్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈనెల చివరికల్లా ప్రాజెక్ట్‌కు కాళేశ్వరం జలాలను తరలించే అవకాశముందని అధికారవర్గాలు తెలిపాయి. ఈ ప్రాజెక్టు కింద 1.10 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయి.

- కె.సతీశ్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

## సర్కారీ కొలువుల్లేవ్!



- నూతన జోనల్ విధానంతో నియామక ప్రక్రియకు బ్రేక్
- ఇప్పటికీ కొలిక్కిరాని జిల్లా, జోనల్, మల్టీజోనల్ ఉద్యోగుల విభజన
- ప్రభుత్వం ఆమోదించిన పోస్టుల భర్తీకి తొలగని ఆటంకాలు
- భర్తీకి సిద్ధంగా 8,547 పోస్టులు
- ఉద్యోగుల విభజన పూర్తయ్యే వరకు నోటిఫికేషన్లు కష్టమే

**వివిధ శాఖల్లో భర్తీకి అనుమతించిన పోస్టుల సంఖ్య**

| నియామక సంస్థ | పోస్టులు |
|---|---|
| టీఎస్‌పీఎస్సీ | 1,949 |
| టీఆర్‌ఈఐఆర్‌బీ | 2,440 |
| టీఎస్‌ఎంఆర్‌బీ | 4,150 |

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ శాఖల్లో కొత్త నియామకాలు ఇప్పట్లో కష్టమే. గతేడాది ఆగస్టు నుంచి రాష్ట్రంలో కొత్తగా అమల్లోకి వచ్చిన జోనల్ విధానంతో ఈ పరిస్థితి తలెత్తింది. నియామక సంస్థలు కొత్త జోనల్ విధానం అమల్లోకి రావడంతో ఉద్యోగాల ఖాళీల భర్తీ నోటిఫికేషన్ల విడుదలకు బ్రేక్ వేశాయి. ప్రభుత్వం ఆమోదించిన పోస్టులను సైతం భర్తీ చేయకుండా వాయిదా వేశాయి. దాదాపు ఏడాదిన్నర నుంచి వివిధ నియామక సంస్థలు ఎలాంటి నోటిఫికేషన్లు విడుదల చేయలేదు. కొత్త విధానం ప్రకారం ఉద్యోగుల విభజన, పోస్టుల సర్దుబాట్లు, ఖాళీలపై స్పష్టత వచ్చే వరకు నూతన నియామకాలు చేపట్టే అవకాశాల్లేవు.

**కొత్త విధానమేంటంటే..**

రాష్ట్రంలో నూతన జోనల్ విధానాన్ని ఆమోదిస్తూ గత ఆగస్టులో రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విధానం ప్రకారం రాష్ట్రాన్ని రెండు మల్టీజోన్లు, 7 జోన్లు, 31 జిల్లాలుగా విభజించారు. ఆ తర్వాత ఉత్తర్వుల ప్రకారం జిల్లాల సంఖ్య 33కు పెరిగింది. మల్టీజోన్లు, జోన్ల పరిధిలో ఏయే జిల్లాలు వస్తాయనే అంశంపై స్పష్టత లేదు. కొత్త జోనల్ విధానం అమల్లోకి రావడంతో స్థానికత, కేడర్ ఆధారంగా మల్టీజోన్లు, జోన్లు, జిల్లా స్థాయిలో ఉద్యోగులను విభజించాలి. ఈ ప్రక్రియ పూర్తయితేనే కేటగిరీల వారీగా పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య, ఖాళీలపై స్పష్టత వస్తుంది.

**ఆ నోటిఫికేషన్ల సంగతి..**

గతేడాది రాష్ట్రపతి ఉత్తర్వులు వెలువడే నాటికే ప్రభుత్వం కొన్ని రకాల పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. ఈమేరకు ఆయా శాఖల వారీగా ప్రతిపాదనలు సంబంధిత నియామక సంస్థలకు పంపగా.. నోటిఫికేషన్ల రూపకల్పన దాదాపు పూర్తయింది. చివరి నిమిషంలో రాష్ట్రపతి ఉత్తర్వులు వెలువడటం.. కొత్త విధానం తక్షణమే అమల్లోకి వస్తున్నట్లు ప్రకటించడంతో ఆ నోటిఫికేషన్లు నిలిచిపోయాయి. టీఎస్‌పీఎస్సీ, గురుకుల, మెడికల్ బోర్డుల పరిధిలో 8,547 పోస్టులు భర్తీకి సిద్ధంగా ఉన్నాయి. టీఎస్‌పీఎస్సీ పరిధిలో గ్రూప్–1 కేటగిరీలో 138, గ్రూప్–2 కేటగిరీలో 60, గ్రూప్–3 కేటగిరీలో 339, అదేవిధంగా 117 అసిస్టెంట్ ఇంజనీర్, 58 డ్రాఫ్ట్‌మెన్, 68 దేవాదాయ, 31 అటవీ అధికారి, 260 రెవెన్యూ అధికారి, 287 కార్మిక ఉపాధి కల్పన, 208 రోడ్డు రవాణా సంస్థ విభాగాలతో పాటు మరిన్ని శాఖల్లో సింగిల్ డిజిట్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వీటికి సంబంధించి నోటిఫికేషన్లు విడుదల చేసే క్రమంలో కొత్త జోనల్ విధానం అమల్లోకి వచ్చింది. తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు పరిధిలో సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపల్, లైబ్రేరియన్, క్రాఫ్ట్, ఆర్ట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, స్టాఫ్ నర్సు కేటగిరీల్లో 2,440 పోస్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపినా.. బోర్డు నుంచి ఏడాదిన్నరగా నోటిఫికేషన్లు విడుదల కాలేదు. తెలంగాణ రాష్ట్ర వైద్య నియామకాల బోర్డు పరిధిలో కూడా డాక్టర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, నర్స్, హెల్త్ అసిస్టెంట్ తదితర కేటగిరీల్లో 4,150 పోస్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిసినా ఇప్పటివరకు నోటిఫికేషన్లు వెలువడలేదు.

## రెండేళ్ల వరకు గుర్తింపు సంఘం ఎన్నికలొద్దు

- కార్మికశాఖ కమిషనర్‌కు ఆర్టీసీ కార్మికుల మూకుమ్మడి లేఖలు
- అధికారుల ఒత్తిడితోనే ఇలా: జేఏసీ
- నిరసనగా నేడు డిపోల వద్ద ధర్నాలకు పిలుపు

**సాక్షి, హైదరాబాద్:** రెండేళ్ల వరకు తమ కార్మిక సంఘాలకు ఎన్నికలే వద్దంటూ స్వయంగా ఆ కార్మికుల సంతకాలతో మూకుమ్మడి లేఖలు కార్మిక శాఖ కమిషనర్‌కు అందుతున్నాయి. గత ఆదివారం సీఎం కేసీఆర్ ఆర్టీసీ కార్మికులతో ప్రగతిభవన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో, రెండేళ్ల వరకు యూనియన్లే అవసరం లేదని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే డిపోల వారీగా ఓ నిర్దేశిత పత్రం సిద్ధం చేసి దానిపై కార్మికుల సంతకాలు తీసుకుని లేబర్ కమిషనర్ కార్యాలయానికి పంపుతున్నారు. ఇప్పుడిదే వివాదానికి కారణమవుతోంది. దీనిపై నిరసనగా శుక్రవారం డిపోల ఎదుట ధర్నాలకు జేఏసీ పిలుపునిచ్చింది.

**'వెల్ఫేర్ కౌన్సిళ్లపై నమ్మకం ఉన్నందునే...'**

డిపో స్థాయిలో సమస్యల పరిష్కారం కోసం వెల్ఫేర్ కౌన్సిళ్లను ఏర్పాటు చేయాలని ఆత్మీయ సమ్మేళనంలో సీఎం సూచించారు. ప్రతి డిపో నుంచి ఇద్దరు చొప్పున ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారని, ఆ కమిటీలే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాయన్నారు. రెండేళ్ల వరకు ఇక కార్మిక సంఘాలతో పని ఉండదని, అప్పటి వరకు గుర్తింపు సంఘం ఎన్నికలు కూడా నిర్వహించాల్సిన పనిలేదని వివరించారు. రెండేళ్ల తర్వాత యూనియన్లు అవసరమన్న అభిప్రాయం వ్యక్తమైతే అప్పుడు చూద్దామని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా అధికారులు చర్యలు ప్రారంభించారు. కార్మిక సంఘాల ఎన్నికలు అవసరం లేదని ఆర్టీసీ సొంతంగా నిర్ణయం తీసుకోలేదు. దీనికి కార్మికులంతా ఏకగ్రీవ అభిప్రాయం వ్యక్తం చేస్తే కార్మిక శాఖ పరిశీలించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గురువారం నుంచి లేఖల కార్యక్రమం మొదలైంది. కార్మికుల సమస్యను తక్షణం పరిష్కరించేందుకు 'వెల్ఫేర్ కౌన్సిళ్ల'కృషి చేస్తాయన్న నమ్మకం తమకు ఉందని, రెండేళ్ల వరకు గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలు అవసరం లేదని ఏ డిపోకు ఆ డిపోగా ఓ నమూనా సిద్ధం చేసి కార్మికులందరితో సంతకాలు తీసుకుంటున్నారు. వారు ముక్తకంఠంతో దీనికి అంగీకరించినట్టే అవుతున్నందున, దీనికి కార్మిక శాఖ సానుకూలంగా స్పందిస్తే రెండేళ్ల వరకు ఎన్నికలు చేపట్టకపోవచ్చు.

**తీవ్రంగా పరిగణిస్తున్న జేఏసీ..**

కార్మికులకు ఇష్టం లేకపోయినా, అధికారులు బలవంతంగా వారితో సంతకాలు చేయిస్తున్నారని జేఏసీ నేతలు ఆరోపిస్తున్నారు. దీనికి పోటీగా జేఏసీ నేతలు, కార్మిక సంఘాలు అవసరమని, వెంటనే ఎన్నికలు జరపాలని, వెల్ఫేర్ కౌన్సిళ్లపై తమకు నమ్మకం లేదంటూ పత్రాన్ని సిద్ధం చేసి కార్మికులతో సంతకాలు చేయించి లేబర్ కమిషనర్‌కు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం డిపోల ఎదుట చేపట్టనున్న ధర్నాలకు కార్మికులు వస్తారా లేదా అనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

## అదనంగా రూ.177 కోట్లు ఇవ్వండి

**కేంద్రమంత్రి గడ్కరీకి సీఎం కేసీఆర్ లేఖ**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జాతీయ రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వాటిని యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేసేందుకుగాను అదనంగా రూ.177 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఈమేరకు ఆయన కేంద్రమంత్రికి గురువారం లేఖ రాశారు. ఇప్పటికే జాతీయ రహదారుల మరమ్మతుకు కేంద్రం రూ.155 కోట్లు మంజూరు చేసినందున వాటితో పనులు జరుగుతున్నాయని, రోడ్లు బాగా దెబ్బతినటంతో ఆ నిధులు సరిపోవని అధికారులు ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. వాటికి అదనంగా రూ.177 కోట్లు అవసరమని పేర్కొనటంతో సీఎం తాజాగా కేంద్ర మంత్రికి రాసిన లేఖలో దాన్ని ప్రస్తావించారు. ఇక రాష్ట్రంలో కొత్తగా 6 జాతీయ రహదారుల కోసం ఇప్పటికే ప్రభుత్వం పంపిన డీపీఆర్‌లు కేంద్రం వద్ద పెండింగులో ఉన్నాయి. వాటిని పరిశీలించి వెంటనే మంజూరు చేయాల్సిందిగా ఆయన కోరారు. గతంలో మంజూరు చేసి, తర్వాత అనుమతులు నిలిపి వేసిన రోడ్ల విషయాన్ని కూడా పరిశీలించాల్సిందిగా కోరారు. వచ్చే ఫిబ్రవరిలో సమ్మక్క సారలమ్మ జాతర ఉన్నందున, హైదరాబాద్–ఏటూరునాగారం జాతీయ రహదారి విస్తరణ పనుల ను వేగంగా పూర్తి చేయాలని సీఎం పేర్కొన్నారు. బైపాస్ చేసిన వరంగల్ పట్టణంలోని దెబ్బతిన్న అంతర్గత రోడ్లను వెంటనే మరమ్మతు చేయాల్సి ఉందన్నారు.

## క్యాబ్‌ల్లో ఎస్‌వోఎస్ బటన్ తప్పనిసరి

- స్పష్టం చేసిన నగర పోలీసు అధికారులు
- మొత్తం 15 సంస్థల నిర్వాహకులతో సమావేశం

**సాక్షి, హైదరాబాద్:** దిశ హత్యాచార ఘటన నేపథ్యంలో మహిళల భద్రతపై పోలీసు విభాగం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా నగర పోలీసులు గురువారం 15 క్యాబ్ నిర్వాహక సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. బషీర్‌బాగ్‌లోని పోలీసు కమిషనరేట్‌లో కొత్వాల్ అంజనీకుమార్ నేతృత్వంలో ఈ సమావేశం జరిగింది. ప్రతి క్యాబ్‌కు ట్రాకింగ్ డివైజ్‌లు, ఎస్‌వోఎస్ బటన్లు కచ్చితంగా ఉండాలని ఈ సందర్భంగా పోలీసులు స్పష్టం చేశారు. తమ క్యాబ్‌లకు ట్రాకింగ్ డివైజ్‌లు ఉన్నాయని, ఇక ఎస్‌వోఎస్‌ను తమ యాప్‌ల్లో ఏర్పాటు చేస్తున్నామంటూ క్యాబ్‌ల నిర్వాహకులు చెప్పగా.. మోటారు వాహనాల చట్టంలోని 125 (హెచ్) సెక్షన్ ప్రకారం వాహనంలోనే ఎస్‌వోఎస్ బటన్ ఉండాలని, దీన్ని అమలు చేయాలని స్పష్టం చేశారు. క్యాబ్ డ్రైవర్ల పూర్వాపరాలను అనునిత్యం పరిశీలించాలని, వారి గత చరిత్రను సైతం పరిగణనలోకి తీసుకున్న తర్వాతే నియమించాలని కొత్వాల్ తెలిపారు. క్యాబ్‌ల్లో ప్రయాణించే వారి నుంచి ప్రతి సందర్భంలోనూ డ్రైవర్ల ప్రవర్తనపై ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని, దాని ఆధారంగా తదుపరి చర్యలు ఉండాలని అన్నారు. ప్రధానంగా మహిళల భద్రత అంశానికి సంబంధించి ఫిర్యాదు వస్తే వెంటనే తమ దృష్టికి తేవాలని ఆదేశించారు. ప్రతి క్యాబ్ యాప్‌ను హాక్–ఐతో అనుసంధానించాలని సూచించారు. సమావేశంలో ట్రాఫిక్ చీఫ్ అనిల్ కుమార్, డీసీపీ–2 బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## 'దిశ'పై పోస్టులు పెట్టిన వ్యక్తికి రిమాండ్



అమర్‌నాథ్

**హైదరాబాద్:** 'దిశ'సంఘటనపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన నిందితుడిని రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎల్‌బీనగర్ సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైమ్ డీసీపీ పి.యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా కొత్తపేట ఆర్టీసీ కాలనీకి చెందిన కకునూరు అమర్‌నాథ్ (18) 10వ తరగతి వరకు చదివి, మెడికల్ షాపులో పనిచేసేవాడు. గత రెండేళ్ల నుంచి ఫేస్‌బుక్ వాడుతున్నాడు. స్మైలీ నాని అనే వ్యక్తితో ఫేస్‌బుక్‌లో పరిచయం ఏర్పడింది. గత నెల 29న దిశ అత్యాచార సంఘటనపై స్మైలీ నాని అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ పోస్ట్ చేశాడు. దీంతో అమర్‌నాథ్ కూడా ఫేస్‌బుక్‌లో దిశపై అసభ్యకర వ్యాఖ్యలు పోస్ట్ చేశాడు. వీరి ఫేస్‌బుక్ సంభాషణలు సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో పలువురు వీరి పోస్టులను ఖండించారు. విషయం తెలుసుకున్న అమర్‌నాథ్ తన ఖాతాను తొలగించాడు. దీనికి సంబంధించి గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ఎల్‌బీనగర్ సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులు.. అమర్‌నాథ్‌ను అరెస్ట్ చేసి విచారించగా నేరాన్ని అంగీకరించాడు. దీంతో అతడిని రిమాండ్‌కు తరలించారు. సోషల్‌మీడియాను దుర్వినియోగం చేస్తూ ఇతరులను అగౌరవపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తే నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీపీ తెలిపారు. అత్యాచార బాధితురాలి ఫొటో, పేరు, చిరునామా, ఇతర వివరాలు వెల్లడిస్తే వారిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ అవినాష్‌రెడ్డి, విక్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆవు కడుపులో 61 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు

### ఆపరేషన్ చేసి తొలగించిన వైద్యులు

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్‌లోని పశువైద్యశాలలో.. నడవలేని స్థితిలోఉన్న ఓ ఆవు కడుపులో నుంచి 61 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను గురువారం సాయంత్రం డాక్టర్లు వెలికి తీశారు. డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైద్య బృందం దాదాపు నాలుగు గంటలపాటు ఈ శస్త్రచికిత్స నిర్వహించి 61 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించింది. ప్రస్తుతం ఆవు కోలుకుంటోందని వైద్యులు తెలిపారు. గతంలో చెన్నైలోని పశువైద్యాలయంలో 51కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను డాక్టర్లబృందం ఆపరేషన్ చేసి బయటకు తీసింది.

## దీర్ఘకాలిక సెలవులో అశ్వత్థామరెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ సమ్మెలో కీలకంగా వ్యవహరించిన జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. గురువారం ఉదయం ఎంజీబీఎస్‌లో విధుల్లో చేరి, ఆ వెంటనే ఆరు నెలల కాలానికి సెలవు కోసం దరఖాస్తు చేశారు. జేఏసీలో కీలకంగా వ్యవహరించిన రాజిరెడ్డి, థామస్‌రెడ్డి, సుధ తదితరులు ఇప్పటికే విధుల్లో చేరారు. కన్వీనర్‌గా ఉన్న అశ్వత్థామరెడ్డి ఇన్ని రోజులు విధులకు దూరంగా ఉండి గురువారం విధుల్లో చేరారు. ఆ వెంటనే ఆరు నెలల కాలానికి సెలవు కావాలంటూ దరఖాస్తు చేసి వెళ్లిపోయారు. ఆర్టీసీ పోస్టుకు రాజీనామా చేయాలన్న ఆలోచనలో ఉన్నట్టు సన్నిహితులు పేర్కొంటున్నారు.

**న్యాయపోరాటం చేస్తాం: అశ్వత్థామరెడ్డి**

'రెండేళ్ల వరకు గుర్తింపు సంఘం ఎన్నికలొద్దంటూ కార్మికుల చేత అధికారులు బలవంతంగా సంతకాలు తీసుకుంటున్నారు. కొంతమంది సంతకాలకు నిరాకరిస్తే, సమ్మె కాలానికి సంబంధించిన వేతనాల విషయంలో ఇబ్బందులు వస్తాయని బెదిరిస్తున్నారు. ఆ ప్రయత్నం చట్ట విరుద్ధం. దీనిపై కార్మిక శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తాం. అవసరమైతే న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తాం. శుక్రవారం ధర్నాలు కొనసాగుతాయి'



గురువారం ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న మాదాల కిరణ్

## తెలంగాణ డాక్టర్‌కు ఎక్సలెన్స్ అవార్డు

**సాక్షి, హైదరాబాద్:** నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ అనస్తీషియా విభాగం అధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మాదాల కిరణ్ జాతీయ స్థాయిలో మెడికల్ ఎక్సలెన్స్, రతన్ గోల్డ్ మెడల్‌ను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ డైరెక్టర్ బిపిన్ బాత్ర చేతుల మీదుగా అందుకున్నారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి ఈ అవార్డు ఇస్తారు. భారత సాలిడారిటీ కౌన్సిల్, ఇంటర్నేషనల్ బిజినెస్ కౌన్సిల్, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని అందజేశారు.

## గాంధీలో బాలుడి కిడ్నాప్?

### పోలీసులను ఆశ్రయించిన బాలుడి తల్లి



దీపక్

**హైదరాబాద్:** సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఏడాదిన్నర వయసున్న దీపక్ అనే బాలుడు కిడ్నాప్‌నకు గురయ్యాడు. బాలుడి తల్లి ఫిర్యాదు మేరకు చిలకలగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్మాన్‌ఘాట్‌కు చెందిన తులసీరాం, రాధిక భార్యాభర్తలు. వీరికి నలుగురు పిల్లలు. సైఫాబాద్ ఠాణా పరిధిలో జరిగిన అత్యాచారం కేసులో తులసీరాం చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. రాధిక తన పిల్లలతో కలిసి మౌలాలిలో ఉంటుంది. డెలివరీ కోసం గాంధీ ఆస్పత్రికి వచ్చిన బంధువుల కుమార్తెను పరామర్శించేందుకు నెల క్రితం రాధిక తన పిల్లలను తీసుకుని గాంధీ ఆస్పత్రికి వచ్చింది. అప్పటినుంచి గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలోనే ఉంటూ దాతలు అందించిన ఆహారపదార్థాలు తింటూ పిల్లలను పోషించుకుంటోంది. ఎప్పటిలాగే ఈ నెల 4న రాత్రి 11 గంటలకు పిల్లలతో కలిసి విజిటర్స్ షెడ్‌లో పడుకుంది. ఉదయం లేచి చూడగా దీపక్ కనిపించలేదు. గాంధీ ఆస్పత్రి ప్రాంగణంతోపాటు వార్డులు, చుట్టుపక్కల వెతికినా జాడ తెలియలేదు. దీంతో రాధిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.